04 . 12. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

గురువారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 184 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper




## కోకాపేటలో కాసులు కురిపిస్తున్న వేలం

### హెచ్ఎండిఏ ఖాతాలో మరో వేయికోట్లు

**హైదరాబాద్, డిసెంబర్3 వెలుతురు:**
కోకాపేట నియోపొలిస్ భూములకు మూడో విడత వేలం

# త్వరలోనే మరో 40వేల ఉద్యోగాల భర్తీ

- ఇప్పటికే 60వేల ఉద్యోగాలు భర్తీ చేసాం, ● హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేసేది లేదు, ● తెలంగాణ ఉద్యమ జ్వాలలకు కరీంనగర్ కేంద్రం, ● ఎట్టి పరిస్థితుల్లోనూ గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం, ● బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఏమయ్యిందో చూశాం, ● రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం, ● సమర్థులనే సర్పంచ్‌లుగా ఎన్నుకోండి, ● హుస్నాబాద్ పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి



**సిద్దిపేట,డిసెంబరు3 వెలుతురు:**
రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. తమ ప్రభుత్వంలో ఇప్పటికే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని.. త్వరలో మరో 40 వేల ఉద్యోగాలు ఇస్తామని స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల పాలన పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ. 262.68 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఇచ్చిన హామీ మేరకు త్వరలో మరో 40వేల ఉద్యోగాల భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శ్రీకాంతాచారి స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60వేల ఉద్యోగాలు ఇచ్చాం. ప్రజాపాలన రెండున్నరేళ్లు పూర్తయ్యేలోగా లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తాం అన్నారు. పనిచేసే





### తెలంగాణను అవమానించిన పవన్ కళ్యాణ్‌ను

# రక్షించడమే బీజేపీ లక్ష్యం!

- పవన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు ఫైర్
- అదే రోజు సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీజేపీ కొత్త రాజకీయం
- భవిష్యత్తులో పవన్ అవసరాలను దృష్టిలో పెట్టుకొనే ఆయన్ను కాపాడే ఎత్తుగడ!

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 03:**
తెలంగాణ ప్రజను ఘోరంగా అవమానించిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కాపాడడానికి తెలంగాణ బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తున్నట్టు కనిపిస్తోంది. దీని కోసం ప్రజల వ్యక్తిగత దైవారాధనపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన విశ్లేషణను వివాదాస్పదం చేయడం ద్వారా బీజేపీ స్వార్థ రాజకీయాలకు తెరలేపిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ ప్రజలది నరదిష్టి అని అహంకారపూరిత వ్యాఖ్యలు చేసిన పవన్‌ను అవసరమైన ప్రతి చోట బీజేపీ రాజకీయంగా వాడుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీచేయం మొదలుకొని అనేక సందర్భాల్లో పవన్



## రియల్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు



**న్యూఢిల్లీ,డిసెంబర్3 వెలుతురు:**
క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే తెలంగాణ ప్రభుత్వం 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్' హిల్ట్ పాలసీని

# తెలంగాణ రైజింగ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం

### రాజ్‌నాథ్ సహా పలువురు కేంద్రమంత్రులకు ఇన్విటేషన్

### భట్టితో కలిసి ఆహ్వానించిన సిఎం రేవంత్

### దేవుళ్లపై వ్యాఖ్యలను వక్రీకరించారని ఆగ్రహం

**న్యూఢిల్లీ, డిసెంబర్3 వెలుతురు:**
దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలసి ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్'కు ప్రధాని మోదీని ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ప్రధాని మోదీకి సీఎం విజ్ఞప్తి చేశారు. తులంగాణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్- బెంగళూరు- చెన్నై బుల్లెట్ రైలు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశ విస్తరణకు అనుమతి



ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని అభ్యర్థించారు. పలువురు కేంద్ర మంత్రులతో పాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలను కలిసిన సీఎం సమ్మిట్‌కు ఆహ్వానించారు. కాగా, మంగళవారం రాత్రి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను సీఎం రేవంత్‌రెడ్డి కలిసి గ్లోబల్ సమిట్‌కు రావాలని కోరారు. తరవాత సిఎం రేవంత్ మీడియాతో చిట్‌చాట్‌లో ..తెలంగాణలో పదేళ్లు తన నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హిందూ సమాజంలాంటిదే కాంగ్రెస్ అని డీసీసీ అధ్యక్షులకు చెప్పానని సిఎం వివరించారు. పార్టీ నేతగా ఎలా

### కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను

# రెండేళ్లలో పునర్నిర్మించాం

- భూ హక్కుల నుంచి రిజిస్ట్రేషన్ల వరకు సమూల మార్పులు
- 2. 29 కోట్ల సర్వే నెంబర్లకు భూధార్ నెంబర్ కేటాయింపునకు చర్యలు
- 373 నక్షా గ్రామాల్లో రీసర్వేకు సన్నాహాలు
- వచ్చే జనవరి నాటికి మూడు శాఖల సమాచారంతో ప్రత్యేక యాప్
- అక్రమాలపై రెండు జిల్లాలో సాగుతున్న ఫోరెన్సిక్ ఆడిట్
- భూ సమస్యలపై త్వరలో ట్రిబ్యునల్స్ ఏర్పాటు
- ఒకే గొడుగు కిందకు ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 03:**
తెలంగాణ రాష్ట్రంలో రెండేళ్లలో రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలో ప్రజల సౌలభ్యం కోసం విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార





## తూప్రాన్ మండలం గణపూర్ లో పోలీసుల ఆధ్వర్యంలో ఎన్నికల అవగాహన కార్యక్రమం

### ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు మోటివేషన్ చేసిన డీఎస్పీ నరేందర్ గౌడ్

**తూప్రాన్, వెలుతురు డిసెంబర్ 03:**
రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తూప్రాన్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తూప్రాన్ పీఎస్ పరిధిలో కీలక గ్రామంగా గుర్తించిన గణపూర్ లో బుధవారం రోజు సాయంత్రం డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ రంగ కృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నరేందర్ గౌడ్ ప్రజలకు, గ్రామ పెద్దలకు, అభ్యర్థులకు గ్రామ పంచాయతీ ఎన్నికలలో పాటించాల్సిన నియమావళి తోపాటు ఏమి చేయాలి? ఏమి చేయకూడదు? అనే పలు ముఖ్యమైన అంశాలను

## మహానగరంగా ఇక హైదరాబాద్

### జిహెచ్ఎంసిలో 27 మున్సిపాటలిటీల విలీనం

### మున్సిపల్ రికార్డులను స్వాధీనం

### సిబ్బంది వివరాలు తెలియచేయాలని సూచనలు

### జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రత్యేక ఆదేశాలు జారీ

**హైదరాబాద్,డిసెంబరు3 ( వెలుతురు):**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో 27 మున్సిపాలిటీల విలీనం పక్రియ వేగవంతం అయింది. ఇప్పటికే ప్రభుత్వం పంపిన ఆర్డినెన్సుకు గవర్నర్ ఆమోదం తెలిపారు. ప్రత్యేక ఆదేశాలను జీహెచ్ఎంసీ

## బెంగాల్‌లో సర్ సక్రమంగా సాగేలా చూడండి

### బిజెపి ఎంపిలకు మోడీ హితోక్తులు



**న్యూఢిల్లీ,డిసెంబరు3 ( వెలుతురు):**
పశ్చిమబెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. దాని నిర్వహణపై బెంగాల్‌కు చెందిన భాజపా ఎంపీలకు ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచనలు చేశారని సమాచారం. ఆ పక్రియ

# అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

- మౌలిక సదుపాయాల కల్పనలో క్రీయాశీలకంగా ఉండాలి
- గ్రామస్థాయి నుంచి అభివృద్ధి కమిటీల ఏర్పాటు
- జనసేన ముఖ్యనేతల సమావేశంలో పవన్ దిశానిర్దేశం

**మంగళగిరి,డిసెంబర్3 వెలుతురు:**
జనసేన పార్టీ నాయకులు, శ్రేణులు తమ పంచాయతీల నుంచి పార్లమెంట్ నియోజకవర్గం వరకు అభివృద్ధిలో భాగం కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో పవన్ సమావేశం నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రాంత అభివృద్ధిలో అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో క్రియాశీలకంగా వ్యవహరించేలా పార్టీ శ్రేణులను ముందుకు తీసుకువెళ్దామన్నారు. జనసేన పార్టీ కమిటీల నిర్మాణంలో భాగంగామన్నారు. గ్రామ స్థాయిలో అయిదుగురు సభ్యులతో



# రైతు సమస్యలపైనే ప్రధాన దృష్టి

- రైతన్నకు అండగా ఉండడమే మా విధానం
- నీటి వనరులు పెంచేందుకు అనేక ప్రయత్నాలు
- గోదావరి జలాలను కృష్ణా నదికి కలిపి చూపాం
- విద్యుత్ ఛార్జీలు పెంచే ఆలోచన లేదు
- వైసిపి హయాంలో వ్యవసాయ రంగాన్ని భ్రష్టు పట్టించారు
- నల్లజర్లలో రైతన్నా మీకోసంలో సిఎం చంద్రబాబు



**కాకినాడ,డిసెంబర్3 వెలుతురు:**
ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కనుక రైతుల సమస్యలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాం అని సిఎం చంద్రబాబు అన్నారు. రైతన్నకు అండగా ఉంటామనేది మా మొదటి నినాదం అన్నారు.. నీటి వనరులు పెంచేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో సీఎం చంద్రబాబు బుధరం పర్యటించారు. 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో భాగంగా రైతులు, రైతు కుటుంబాలతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వ పంచ సూత్రాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడారు. అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చాం.. అమలు చేస్తున్నాం. ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం. సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అయ్యింది. గోదావరి జలాలను కృష్ణా నదికి

## తూప్రాన్ మండలం గణపూర్ లో పోలీసుల ఆధ్వర్యంలో ఎన్నికల అవగాహన కార్యక్రమం

వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, న్యాయంగా, అహింసాత్మకంగా జరగేందుకు ప్రతీ ఒక్కరూ చట్టాలకు లోబడేలా ఉండాలని సూచించారు. అలాగే ఓటరులను ప్రభావితం చేసే చర్యలు, డబ్బు, బహుమతుల పంపిణీ, బెదిరింపులు వంటి అక్రమ చట్టవిరుద్ధ కార్యకలాపాలను సహించబోమని చెప్పారు. అభ్యర్థులు, కార్యకర్తలు ఎన్నికల కమిషన్ నియమావళిని ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి సంఘర్షణలు చోటుచేసుకోకుండా పోలీసులకు సహకరించాలని కూడా సూచించారు. గ్రామంలో శాంతి భద్రతల పరిస్థితిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలు విధుల్లో ఉన్నాయని డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ శివానందం తోపాటు పోలీసులు, గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహానగరంగా ఇక హైదరాబాద్

కమిషనర్ ఆర్వీ కర్ణన్ జారీ చేశారు. 27 మున్సిపాలిటీల్లో రికార్డులను స్వాధీనం చేసుకోవాలని డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు ఇచ్చారు. జోనల్ కమిషనర్ పర్యవేక్షణలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు రికార్డ్స్ స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రత్యేకంగా రికార్డ్స్ ప్రొఫార్మ రూపొందించాలని తెలిపారు. ఇక, 27 మున్సిపాలిటీల్లో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్ల బాధ్యతల జాబితాను జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేటర్ లో విలీనం అయ్యే 27 మున్సిపాలిటీలలో ఉన్న సిబ్బంది వివరాలను తక్షణమే అందించాలని పేర్కొన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పూర్తి వివరాలు సమర్పించాల్సిందిగా లేఖ రాశారు. జీహెచ్ఎంసీలో మున్సిపాలిటీల ప్రక్రియ వేగవంతం చేసేందుకు అత్యవసరంగా ఈ డేటాను కోరినట్లు కమిషనర్ లేఖలో స్పష్టం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్-1955లో వచ్చిన తాజా ఆర్డినెన్స్‌ల ఆధారంగా విస్తరణకు అనుమతి ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి నుంచి మొత్తం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ జీహెచ్ఎంసీ పరిధిలో భాగం కానుంది. ఈ మేరకు కోర్ అర్బన్ రీజియన్ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. జీహెచ్ఎంసీని ఇప్పుడు రాష్ట్రంలోనే అతిపెద్ద అర్బన్ అడ్మినిస్ట్రేటివ్ యూనిట్‌గా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వ సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. 27 మున్సిపాలిటీల్లో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్ల బాధ్యతల జాబితా విడుదల చేస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు.

## బెంగాల్‌లో సర్ సక్రమంగా సాగేలా చూడండి

సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు ప్రధాని సన్నిహితవర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇదిలాఉంటే.. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. ఈసీ 'భాజపా కమిషన్'గా మారిందని, దిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుంటోందని ఆరోపణలు చేస్తున్నారు. ఎన్ని కేంద్ర సంస్థలను రాష్ట్రంలోకి తీసుకువచ్చినా.. ఎంత ఖర్చుపెట్టినా తనను రాజకీయపరంగా ఓడించలేరని గతంలో విరుచుకుపడ్డారు. అలాగే 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని ఎంపీలకు మోదీ సూచించారు. అలాగే తృణమూల్ కాంగ్రెస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్లను ప్రస్తావించకుండా.. విపక్షాల ట్రాప్‌లో చిక్కవద్దని బెంగాల్ భాజపా ఎంపీలకు హితబోధ చేశారు. అంతేగాకుండా ఆ రాష్ట్రంలో భాజపా ఎదిగిన తీరును ప్రస్తావించారు. 2011లో అసెంబ్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని గుర్తుచేశారు. 2021లో ఆ సంఖ్య 65కు చేరింది. స్థానిక అంశాలపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని ఎంపీలతో పేర్కొన్నారు. కాగా.. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తోన్న ఎస్ఐఆర్‌ను విపక్షాలు తొలి నుంచి వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ స్పందన వచ్చింది.

## అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

కమిటీని నియమించాలని, వారు గ్రామాభివృద్ధిలో భాగమయ్యేలా చేద్దామని తెలిపారు. అదే విధంగా మండల, అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల అభివృద్ధిపై ఆయా కమిటీలు దృష్టి కేంద్రీకరించేలా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకూ జనసేన పొందిన నామినేటెడ్ పదవుల వివరాలను పరిశీలించారు పవన్ కల్యాణ్. మిగిలిన పదవుల భర్తీపై పలు సూచనలు చేశారు. కూటమి ధర్మాన్ని అనుసరించి ముందుకు వెళ్లడంతోపాటు, పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేసినవారికి వివిధ దశల్లో గుర్తింపు, బాధ్యతలను అందించే దిశగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పార్టీ కమిటీల నియామకంపై పవన్ పలు సూచనలు ఇచ్చారు. పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ స్థాయి నుంచి నియోజక వర్గ స్థాయి వరకూ పార్టీ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలకు అయిదుగురు చొప్పున సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలి. ఆ సభ్యులు స్థానికంగా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ గా పిఠాపురంలో నియోజకవర్గ స్థాయిలో అయిదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటైంది.. ఆ కమిటీ పని తీరును మదింపు చేసి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీలు రూపకల్పన చేయాలి. పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించి నెలకొనే అంశాలను పరిష్కరించేందుకు ఉద్దేశించిన కాన్ ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ విభాగాన్ని కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షించాలి. ఈ విభాగంలో 11 మంది వరకు సభ్యులను నియమించాలి. ఈ విభాగం ముందుకు వచ్చే అంశం ప్రాధాన్యం, తీవ్రతను బట్టి ముగ్గురు లేదా మొత్తం విభాగంలోని సభ్యులు చర్చించి పరిష్కరించాలని పార్టీ అధినేత పవన్ దిశానిర్దేశర చేశారు. ఇకపై ప్రతి కమిటీలో మహిళలకు స్థానం కల్పించాలని స్పష్టం చేశారు. అయిదుగురు సభ్యులు ఉండే కమిటీలో తప్పనిసరిగా ఒకరు, గరిష్టంగా ఇద్దరు వీర మహిళలు సభ్యులుగా ఉండాలి.. 11మంది సభ్యులు ఉండే కమిటీ ముగ్గురు వీర మహిళలకు స్థానం ఇస్తూ కమిటీలు ఉండాలని నిర్ణయించారు.

## కోకాపేటలో కాసులు కురిపిస్తున్న వేలం

ప్రక్రియ ముగిసింది. బుధవారం ప్లాట్ నెంబర్ 19, 20లోని 8.04 ఎకరాలకు అధికారులు ఈ-వేలం నిర్వహించారు. ప్లాట్ నెంబర్ 19లో ఎకరానికి రూ.131 కోట్లు, ప్లాట్ నెంబర్ 20లో ఎకరం రూ.118 కోట్ల ధర పలికింది. 8.04 ఎకరాలకు హెచ్ఎండీఏకు రూ. వెయ్యి కోట్ల మేర ఆదాయం సమకూరింది. మొత్తం 3 విడతల్లో ఆరు ప్లాట్లలోని 27 ఎకరాలకు రూ.3,708 కోట్ల ఆదాయం లభించింది. ఈసారి మొత్తం 44 ఎకరాల భూమిని నాలుగు విడతల్లో హెచ్ఎండీఏ వేలం వస్తోంది. కోకాపేట గోల్డెన్ మైల్‌లోని 2 ఎకరాలు, మూసాపేటలోని 15 ఎకరాలకు డిసెంబర్ 5న ఈ-వేలం వేయనుంది.

## రియల్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ



తీసుకొచ్చిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా హిల్ట్ పాలసీ ఉందని ఆరోపించారు. దిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవాడలో పనిచేస్తున్న వారితో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు సహకారం అందించకుండా పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూరుస్తోందని విమర్శించారు. పారిశ్రామికవేత్తలకు ఒక విధానం.. రైతులకు ఒక విధానమా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూర్చేలా అవినీతి జీవోను తెచ్చారన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక ప్రాంతాల్లోని వేల ఎకరాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లకు అనుమతిస్తే ట్రాఫిక్ పరిస్థితి ఏంటని నిలదీశారు.

## రైతు సమస్యలపైనే ప్రధాన దృష్టి

కలిపాం. రాబోయే రోజుల్లో గోదావరిని వంశధారకు కలుపుతాం. పెన్నా వరకూ తీసుకెళ్తాం. విద్యుత్ ఛార్జీలను పెంచేది లేదని మరోసారి స్పష్టం చేస్తున్నా. ఛార్జీలను పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం అని అన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఈ సదర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో వ్యవసాయం అస్తవ్యస్థం అయ్యిందని విమర్శలు చేశారు. వైసీపీ హయాంలో భూ రికార్డులు తారుమారు చేశారని ఆరోపించారు. ఇష్టం ఉంటే భూరికార్డులు అలాగే ఉంచారని.. భూములు కబ్జా చేయాలనుకుంటే 22ఏ విధానం అనుసరించారని ఆరోపించారు. వైసీపీ నేతలు ప్రభుత్వ భూములను ఆక్రమించారని విమర్శించారు. గత జగన్ ప్రభుత్వం పశు వులకు దాణా కూడా ఇవ్వలేదు. వైసీపీ అక్రమాలను అరికట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పవన్ కల్యాణ్‌లతో కూటమి కట్టి ఎన్నికలకు వెళ్లామని గుర్తుచేశారు. చరిత్రలో ఎప్పుడు లేనంతగా రికార్డు సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. 90 శాతం సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని గుర్తుచేశారు. మొదటగా రైతుల సమస్యలు పరిష్కరించాలని అనుకున్నామని దాని తర్వాత మిగతా సమస్యలపై దృష్టి సారించామని తెలిపారు. వ్యవసాయంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయం ద్వారా రాష్ట్రానికి ఆరు శాతం ఆదాయం వస్తుంది. వ్యవసాయంలో ఖర్చులెక్కువ ఆదాయం తక్కువ. వ్యవసాయమే మన బలం.. ఈరంగంలో అనేక సమస్యలు వస్తున్నాయి. వ్యవసాయంలో జూదం వద్దు. సమస్యలు అన్ని ఒకేసారి పరిష్కారం అయిపోతాయని భావించి ముందుకు వెళ్తే, నష్టపోయే పరిస్థితి వస్తుంది. రైతుల్లో కూడా మార్పు రావాలి. మేము రూపాయి ఇస్తే, మీరు రుపాయి ఖర్చుపెట్టాలి. చదువుకునే పిల్లలు కూడా వ్యవసాయం అంటే పొలాల నుంచే నేర్చుకోవాలి. ప్రస్తుతం వ్యవసాయ పనులు చేయడానికి ప్రజలు ముందుకు రావడం లేదు.. అందుకే యాంత్రికరణ జరగాలి. మీరు పండించే పంట విలువ ఇక్కడ పరిస్థితిపై ఆధారపడి ఉండదు. ఇతర దేశాలు, ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలపై ఆధారపడి ఉంటాయి. రైతులకు గిట్టుబాటు ధర రావాలి.. ఆదాయం పెరగాలి. ఇప్పుడు ఉభయ గోదావరి జిల్లాల వాసులతో పాటు రాయలసీమ వాసులకు డయాబెటిస్ వస్తోంది. రాష్ట్రాన్ని ఒక మోడల్ స్టేట్‌గా మారుస్తాం. విశాఖపట్నం సమ్మిట్‌లో ఎప్పుడూ రానంత పెట్టుబడులు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.. జఠిలమైన వ్యవసాయ సమస్య పరిష్కరించడానికి ఐదు సూత్రాలు అమలు చేస్తున్నాం. ఇందులో భాగంగానే నీటి భద్రత కల్పించాలని భావించాం. గంగా, కావేరి నదులను అనుసంధానం చేయాలని అప్పుడే నిర్ణయించాం. ఇప్పట్లో సాధ్యం కాదని, కనీసం మన రాష్ట్రంలో నదులను అనుసంధానం చేయాలని నిర్ణయించాం. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు ఎట్టి పరిస్థితుల్లోనైనా తరలిస్తాం. భూమిని జలాశయంగా చేసి, భూగర్భ జలాలు పెంచితే నీటి సమస్య ఉండదు. నేను చాలా సమస్యలు పరిష్కరించగలను. రైతుల సమస్యలు పరిష్కరించడానికి కొంత సమయం పడుతుంది. గతంలో రాష్ట్రాన్ని అస్తవ్యస్థం చేశారు. కరెంటు చార్జీలను పెంచబోం. గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేస్తున్నాం. పెన్నా నది వరకు తీసుకువెళ్తాం. ప్రతీ ఎకరానికి నీరు అందేలా చేస్తాం. ఏపీలో తాగడానికి, వ్యవసాయానికి, పారిశ్రామికరంగానికి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంతరి అచ్చన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే మరో 40వేల ఉద్యోగాల భర్తీ

వాడిని, మంచోడిని గ్రామ సర్పంచ్ గా ఎన్నుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వీలైనంత వరకు సర్పంచ్ లను ఏకగ్రీవం చేసుకోవాలని సూచించారు. పొంకనాలు కొట్టే వాడిని సర్పంచ్ గా ఎన్నుకోవద్దని చెప్పారు. ఎడ్యుకేషన్,ఇరిగేషన్ పై మా ప్రభుత్వం దృష్టి పెట్టింది. నెహ్రూ స్ఫూర్తితోనే మేం ముందుకెళ్తున్నాం. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయ్యింది. ఆనాడు ఎస్ఆర్ఎస్పీని నెహ్రూ కడితే ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఆనాడు కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులే దేశానికి సేవలు అందిస్తున్నాయి. రూ.2 లక్షల రుణామాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం మాదే. వ్యవసాయం దండగ కాదు..పండగ చేసి నిరూపించాం. లక్షా4 వేల కోట్లు రైతుల కోసం మా ప్రభుత్వం ఖర్చు చేసింది. మహిళలకు ఫ్రీ బస్సులే కాదు..బస్సు ఓనర్లను చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లను ఆడబిడ్డలకు అప్పగించాం. అడిగిన ప్రతీ పేద ఇంటికి రేషన్ కార్డు ఇచ్చాం. ఆనాడు దొడ్డు బియ్యం ఇస్తే పశువులకు దాణ పెట్టేవాళ్లు. మా ప్రభుత్వం వచ్చాక సన్నబియ్యం ఇస్తున్నాం. ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లునిర్మిస్తున్నాం. హుస్నాబాద్ లో దేవుళ్లేమైనా పాలించారా?. హుస్నాబాద్లో గౌరెల్లి రిజర్వాయర్ ఎందుకు పూర్తి కాలేదు. పదేండ్లు హుస్నాబాద్ నిర్లక్ష్యానికి గురైంది. గౌరెల్లి రిజర్వాయర్లు పూర్తి చేసే భాధ్యత నాది. ఆనాడు సిద్దిపేట,సిరిసిల్ల ,గజ్వేల్ నియోజకవర్గాలే అభివృద్ధి అయ్యాయి. ఐటీఐ కాలేజీలన్నింటిని ఏటీసీలుగా మార్చాం. ఏటీసీలో చేరే ప్రతి విద్యార్థికి నెలనెలా రూ.2వేలు ఇస్తున్నాం. అని రేవంత్ అన్నారు.సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ హుస్నాబాద్ నుంచే.. బహుజనులు దండు కట్టి ఉద్యమించారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం ఇక్కడి నుంచే ఉవ్వెత్తున ఎగసిపడిందని గుర్తుచేశారు. 2004లో కరీంనగర్ గడ్డ నుంచే తెలంగాణ ఇస్తానని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. 2014లో స్వరాష్ట్ర ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారని వ్యాఖ్యానించారు. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తున్నామని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో నిధులు ఎక్కువగా ఇచ్చారని.. మిగిలిన ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. హుస్నాబాద్‌కు పదేళ్ల నిధులెందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు ఎన్ని నిధులైనా ఇచ్చి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో లాగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయబోనని చెప్పుకొచ్చారు. గత పదేళ్లలో ఎవ్వరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా అలస్వతం ప్రదర్శించారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్ఆర్ఎస్పీ ఎలా ఉందో?.. బిఆర్ఎస్ కట్టిన కాళేశ్వరం ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలి. దేశంలో అత్యధికంగా వరిని పండించేది మన రాష్ట్రంలోనే. వ్యవసాయం అంటే దండగ కాదు.. పండగ అని చేసి చూపించింది మన ప్రభుత్వమే. రాష్ట్రంలో రైతుల కోసం రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు పెట్టాం. రాష్ట్రంలో వందలాది బస్సులకు ఆడబిడ్డలు యజమానులు అయ్యారు. 3.10 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. రూ.22,500 కోట్లు పేదల ఇళ్ల కోసం ఖర్చు చేస్తున్నాం. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యాయి. కానీ, హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరెల్లి ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. గత పాలకుల మాదిరిగా హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చెయ్యం. త్వరలో గౌరెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తాం అని సీఎం ప్రకటించారు. సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ లో రూ. 262.78 కోట్లతో పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ. 44.12 కోట్లతో హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 45.15 కోట్లతో హుస్నాబాద్‌లో ం÷ఌఅ ఏర్పాటుతో పాటు రూ. 20 కోట్లతో హుస్నాబాద్ మునిసిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే, రూ. 8.60 కోట్లతో ఖిం యూనిట్ ఆఫీస్ కు శంకుస్థాపన చేశారు. ఇక, రూ. 86 కోట్లతో హుస్నాబాద్ అర్బన్- కొత్తపల్లి ప్యాకేజీ-1లో భాగంగా 4 లైన్ల రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. రూ. 58.91 కోట్లతో హుస్నాబాద్- అక్కన్నపేట నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, శ్రీధర్‌బాబు తదితరులు సభలో పాల్గొన్నారు..

## కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను రెండేళ్లలో పునర్నిర్మించాం

పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం డాక్టర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో పాత్రికేయుల సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకల్లా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల సమాచారంతో కూడిన సింగిల్ పేజీ డిజిటలైజేషన్‌ను అందుబాలులోకి తీసుకువస్తామని ,ధరణి పోర్టల్ ద్వారా వచ్చిన యాప్‌ను పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఎన్ఐసీ తగు కసరత్తు చేస్తోందని వివరించారు. రాష్ట్రంలో నక్షాలు లేని 413 గ్రామాల్లో సరిహద్దుల, భూధార్ నెంబర్ల కేటాయింపు వంటి ప్రధాన అంశాలతో కూడిన సౌకర్యాలు కల్పించేందుకు ప్రయోగాత్మకంగా ఐదు గ్రామాలను ఎంపిక చేసి పని పూర్తి చేశామని , ఈ ఐదు గ్రామాలకు భూదార్ కార్డులు సిద్దంగా ఉన్నాయని తెలిపారు. మిగిలిన 408 గ్రామాల్లో పట్టణ ప్రాంతాలు మినహా 373 గ్రామాల్లో రెండవ విడత కింద సర్వే నిర్వహిస్తామన్నారు. మూడవ విడతగా అన్నిజిల్లాల్లోనూ జిల్లాకు 70 గ్రామాలను ఎంపిక చేసి భూదార్ కార్డులు అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఇంతవరకు భూ సమస్యలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులలో అర్హత కలిగిన వాటిని జనవరి నెలాఖరు కల్లా పరిష్కరిస్తామని, ఆ తర్వాత ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాం నుంచి చోటుచేసుకున్న అక్రమాలను వెలికితీసేందుకు గాను ఇంతవరకు రెండు జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ జరుగుతోందని, వాటి ఫలితాలను గమనించి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసి అక్రమార్కుల భరతం పడతామన్నారు. గడచిన పది సంవత్సరాలలో ఆనాటి పాలకుల స్వార్ధపూరిత నిర్ణయాల వల్ల విధ్వంసమైన , కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో రెండేళ్లలో సామాన్యులకు రెవెన్యూ సేవలను చేరువ చేశామని తెలిపారు. భూ హక్కుల నుంచి రిజిస్ట్రేషన్ల వరకు ప్రతి పౌరుడికి మేలు జరిగేలా రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ధరణీ దరఖాస్తులకు మోక్షం కల్పించాం. అధికారం చేపట్టిననాటికి 2.45 లక్షల ధరణీ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ తర్వాత మరో నాలుగు లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటినీ పరిష్కరించి ప్రజల సంతృప్తికి తొలి అడుగు వేశాం. ధరణి పోర్టల్ బాధ్యతలను ప్రభుత్వ సంస్థలకు అప్పగిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ధరణి పోర్టల్ నిర్వహణను టెరాసిస్ అనే విదేశీ సంస్థ నుంచి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసికి అప్పగించడం జరిగింది. ఈ నిర్ణయం వల్ల తెలంగాణ రైతుల కోటీ 56 లక్షల ఎకరాల భూమి వివరాలు ఇప్పుడు సురక్షితమైన స్వదేశీ సంస్థ పరిధిలోకి వచ్చాయి.

రాష్ట్రంలో రెవెన్యూ సేవలను సరళీకృతం చేయడం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు దశల వారీగా భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగింది. అధికారులే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలపై దరఖాస్తులను తీసుకోవడం జరిగింది. ఏప్రిల్ 17వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు మూడు విడతలుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించగా దాదాపు 9 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వీరందరికీ నోటీసులు జారీ చేసి దరఖాస్తులు పరిష్కరిస్తున్నామని అన్నారు అధికారంలోకి వస్తే గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్దరిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని 10,954 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్ వారీగా విభజించి జీపీవోలను నియమించడం జరిగింది. అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకునే ప్రక్రియలో ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులను భర్తీకి చర్యలు చేపట్టడంతోపాటు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చాం. భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6గురు లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నాం. ఇప్పటికే దాదాపు నాలుగు వేల మందికి శిక్షణ ఇచ్చి లైసెన్స్‌లు జారీ చేశాం. డిసెంబర్ నెల నుంచి మరో మూడు వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చి గంటల తరబడి చెట్లకింద నిరీక్షించే పరిస్థితికి స్లాట్ బుకింగ్ ద్వారా తెరదించాం. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మూడు దశల్లో ఈ స్లాట్ బుకింగ్‌ను ప్రవేశపెట్టడమేగాక ఆధార్ -ఈ సంతకం కూడా అమలు చేసి ప్రజల డబ్బు, సమయం ఆదా చేశాం. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా కార్పొరేట్ స్థాయిలో సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను దశల వారీగా నిర్మించాలని నిర్ణయించాం. హిల్ట్ పాలసీపై స్పందిస్తూ నోరుందని ఏదిపడితే అది మాట్లాడుతున్నారు. ఆనాడు ప్రభుత్వంలో ఎమ్ ఎ యూ డీ మంత్రిగా ఆయనకు నచ్చిన వారికి ముడుపులు చెల్లించిన వారికి ల్యాండ్ కన్వర్షన్ చేశారు. వారికి అవసరమైన ప్రాంతాలను రెసిడెన్షియల్ ప్రాంతాలుగా మార్చారు. మేం అలా చేయలేదు. పారదర్శకంగా క్యాబినెట్ తీర్మానం చేశాం. ఆనాడు కన్వర్షన్ చేసిన ల్యాండ్ వివరాల చిట్టాను విప్పుతామన్నారు ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ , రిజిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణను అవమానించిన పవన్ కళ్యాణ్‌ను రక్షించడమే బీజేపీ లక్ష్యం!

కళ్యాణ్‌ను బీజేపీ వాడుకుంది. తెలంగాణ ప్రజలపై పవన్ చేసిన వ్యాఖ్యలు ఏ మాత్రం ఉపేక్షించేవి కాదని తెలంగాణ సమాజం మండిపడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్తులో పవన్‌ను తెలంగాణలో రాజకీయంగా వాడుకోవాలంటే ఇప్పుడు ఆతన్ని కాపాడుకోవాలని బీజేపీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో పవన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు వరుసగా విమర్శల దాడికి దిగిన రోజున ఈ అంశాన్ని డైవర్ట్ బీజేపీ ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. తద్వారా పవన్ కళ్యాణ్‌ను రక్షించడానికి సీఎం చేసిన వ్యాఖ్యలపై రాజకీయం చేస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల్ని ఖండించని బీజేపీ

అసలు దేవుళ్లను పూజించే విషయంలో ప్రజల విశ్వాసాన్ని విశ్లేషించిన సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యల్లో ఎలాంటి వివాదం లేకపోయినా బీజేపీ దాన్ని వివాదాస్పదం చేయడానికే మొగ్గు చూపినట్టు కనిపిస్తోంది. ఇదంతా కూడా పవన్ కళ్యాణ్‌ను రాజకీయంగా రక్షించడానికే బీజేపీ ప్రయత్నిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. ఇక్కడ గమనించాల్సిన మరో అంశం ఏంటంటే, పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజల్ని అవనమానించినా కూడా బీజేపీ కనీసం స్పదించలేదు. ఆయన వ్యాఖ్యలను ఖండించలేదు.

బీజేపీకి భయం పట్టుకుంది..

అంతేకాకుండా, బీజేపీని ప్రతి అంశంలో నిలదిస్తూ, ఆ పార్టీ మతత్వ రాజకీయాలు తెలంగాణలో సాగనివ్వకుండా అడ్డుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి అంటే బీజేపీకి భయం



పట్టుకుందని పలువురు విశ్లేషిస్తున్నారు. అందుకే ప్రతి అంశంలో ఆ పార్టీ రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తోందని చెబుతున్నారు. ఇక ముఖ్యమంత్రిగా తన రెండేళ్ల పాలనలో విస్తృత సంక్షేమ పథకాలను అమలు చేస్తుండడం, తెలంగాణ అభివృద్ధితో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన విజన్‌తో ముందుకెళ్తుండడం బీజేపీకి రుచించడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకి రేవంత్ రెడ్డి చేరువ అవుతున్న తీరును బీజేపీ జీర్ణంచుకోలేకపోందని తెలుస్తోంది. ముఖ్యంగా మేడారం అభివృద్ధి, వేములవాడ రాజన్న ఆలయాల అభివృద్ధి, గోశాలల నిర్మాణం వంటి చర్యలను ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రి చేస్తుండడాన్ని బీజేపీ సహించలేకపోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్ గెలుపును జీర్ణించుకోలేకపోతున్న బీజేపీ!

అంతేకాకుండా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నించినా కూడా కులమతాలకు అతీతంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి జైకొట్టడం బీజేపీకి నిద్రపట్టనివ్వడం లేదని తెలుస్తోంది. దేశంలో ఏ బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రి చేయలేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణకు విదేశీ సంస్థలను తీసుకొస్తుండడం, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్‌ను గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తున్న తీరును చూసి బీజేపీ ఓర్వలేకపోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ప్రజల భావోద్వేగాలు పట్టని బీజేపీ స్వార్థ్య రాజకీయాల కోసమే సీఎం వ్యాఖ్యలపై రాజకీయం చేస్తోందనే చర్చ నడుస్తోంది.

# పీచుపల్లిలో సర్పంచ్ పదవి ఏకగ్రీవం

- బీజేపీ బలపర్చిన అభ్యర్థి రాజిరెడ్డి ఒక్కరే నామినేషన్
- గ్రామాభివృద్ధికి రూ.10 లక్షల నిధులు కేటాయిస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటన
- బీజేపీ బలపర్చిన అభ్యర్థులను ఏకగ్రీవం చేస్తే గ్రామాల అభివృద్ధి కోసం నిధులు తెస్తానని హామీ



**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 03:**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడత నామినేషన్ల దాఖల పర్వం పూర్తయింది. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పీచుపల్లి గ్రామంలో సర్పంచ్ పదవికి బీజేపీ బలపర్చిన సామ రాజిరెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల గడువు కూడా ముగియడంతో సామ రాజిరెడ్డి ఎన్నిక ఏకగ్రీవం లాంఛనమే కానుంది. సర్పంచ్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపర్చిన అభ్యర్థులను ఏకగ్రీవం చేస్తే ఆ గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులను కేటాయిస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో బీజేపీ పక్షాన తొలి ఏకగ్రీవం కావడంతో ఇచ్చిన మాట మేరకు ఆయా నిధులను అందజేస్తానని బండి సంజయ్ తెలిపారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నికల్లేకుండా సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యే గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ లెక్కన పీచుపల్లి మొత్తం రూ.20 లక్షల ప్రోత్సాహక నిధులు అందనున్నాయి. ఈ నిధులను తమ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటామని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. ఈ మేరకు గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

# పబ్లిసిటీ కోసమే హిందూ దేవుళ్లను హేళన చేస్తున్న రేవంత్ రెడ్డి

- హిందువులపై కాంగ్రెస్ విషం చిమ్ముతోంది
- హిందూ సనాతన ధర్మమంటే సర్వేజనా సుఖినోభవంతు
- సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్... బీజేపీ నినాదం
- హిందూ సమాజమంతా సీఎం వ్యాఖ్యలపై స్పందించాలి
- కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించక తప్పదు
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 03:**
హిందూ దేవుళ్లను అవమానిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనం. ఎన్నికలకు ముందు తానే గొప్ప హిందువునంటూ మాట్లాడిన రేవంత్ రెడ్డికి అధికారంలోకి రాగానే హిందువుల మనోభావాలను అవహేళన చేయడం సిగ్గు చేటు. కేసీఆర్ మాదిరిగానే రేవంత్ రెడ్డి సైతం పబ్లిసిటీ కోసం హిందూ దేవుళ్లపై నోరు పారేసుకోవడం శోచనీయం. హిందూ సనాతన ధర్మమంటే సర్వేజనా సుఖినోభవంతు. అందరూ బాగుండాలని కోరుకునేదే హిందూ సనాతన ధర్మం. అందులో భాగంగానే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ నినాదంతో ప్రతి ఒక్కరికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నరనరాల్లోనూ హిందూ ద్వేషం నింపుకుంది. హిందువులపట్ల, హిందూ సనాతన ధర్మంపట్ల విషం చిమ్ముతోంది. దేవుళ్లు, దేవాలయాలు తిండిపెడతాయా? కొలువులిస్తాయా? అంటూ గతంలో కాంగ్రెస్ నేత శ్యాంపిట్రోడా హిందూ ధర్మాన్ని హేళన చేస్తే, నేడు రేవంత్ రెడ్డి సైతం తాగుబోతులకు ఒక దేవుడు, మాంసాహారులకు ఒక దేవుడు ఉన్నాడంటూ అవమానించి సనాతన హిందూ ధర్మాన్ని చులకన చేస్తున్నారు. హిందూ సమాజమంతా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించాలి. సీఎం చేసిన అహంకార పూరిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించక తప్పదు. హిందువుల ఓట్లతో గెలిచి హిందువులనే అవమానించేలా మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హిందూ సమాజమంతా తగిన బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే రాబోతున్నాయి.

# ఓయూలో విద్యార్థులకు పాడైన అన్నం

- విద్యార్థుల అందోళన కనువిప్పు కావాలి
- సిఎం రేవంత్‌పై హరీష్ రావు విమర్శలు

**హైదరాబాద్,డిసెంబర్3 వెలుతురు:**
మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపంగి నూనె అన్నట్లుగా రేవంత్ పాలన తీరు ఉందని సిద్దిపేట ఎమ్మెల్యే,బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఓయూ లా కాలేజీ మెస్‌లో పాడైపోయిన అన్నం పెడుతున్నారని విద్యార్థులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేయడం కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థ దుస్థితికి అద్దం పడుతోందని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి వేయి కోట్లు ఇస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి గారు.. కనీసం విద్యార్థులకు ఒక పూట మంచి భోజనం పెట్టలేక పోవడం సిగ్గుచేటు అని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనంలో గొడ్డుకారం, గురుకులాల్లో పురుగుల అన్నం, ఇప్పుడు యూనివర్సిటీల్లో పాడైపోయిన భోజనం.. ఇదేనా కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో సాధించిన ఘనత అని నిలదీశారు. అడుగడుగునా యూనివర్సిటీ పర్యవేక్షణలో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. రేవంత్ రెడ్డి గారూ.. మీ చేతగానితనంతో విద్యార్థుల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని ఆగం చేయకండి అని హరీశ్‌రావు హితవుపలికారు. ఇప్పటికైనా ప్రగల్భాలు మాని.. విద్యార్థులకు కడుపునిండా మంచి భోజనం పెట్టండని సూచించారు.

# ఎండోమెంటు మినిస్టర్ కొండా సురేఖతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మర్యాదపూర్వక భేటీ

- పలు కీలక అంశాలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్ళిన మంత్రి

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 03:**
తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం హైదరాబాదులోని జూబ్లీహిల్స్ లో గల ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని ఆయన శాలువా, స్వామివారి ప్రసాదంతో సత్కరించారు. అనంతరం మంత్రి సురేఖ, టీటీడీ చైర్మన్ ను కూడా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహా స్వామి వారి ప్రతిమను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు దేవాలయాల నిర్మాణానికి టీటీడీ చేస్తున్న చర్యలు, ప్రత్యేకించి దళిత కాలనీల్లో నిర్మిస్తున్న హిందూ దేవాలయాల గురించి ప్రస్తావించారు. ఈ నిర్మాణాలు మంథని, కొడంగల్, ఖమ్మం ప్రాంతాల్లో చేపడుతున్నట్టు మంత్రికి స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రసిద్ధి చెందిన కొండ ప్రాంతాల్లోని



దేవాలయాల్లో రోప్‌వే నిర్మాణ పనులు చేపట్టడానికి టీటీడీ నుంచి నిధులు కేటాయించేందుకు సాయం చేయాలని మంత్రి కొండా సురేఖ, టీటీడీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో ప్రముఖంగా వికారాబాద్ జిల్లాలోని పరిగిలో గల పాంబండ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, హన్మకొండలోని పద్మాక్షి అమ్మవారి టెంపుల్, వరంగల్ జిల్లాలోని గోవింద రాజుల ఆలయంలో రోప్ వే నిర్మాణం అవసరం ఉందని ఆయనకు ప్రత్యేకంగా గుర్తు చేశారు. ఈ ఆలయాలకు ఎంతో చారిత్రకత ఉందని... వీటి దర్శనానికి దివ్యాంగులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. దాంతోపాటు, రాష్ట్రంలోని ముఖ్యమైన ఆలయాల్లో భజన మందిరాలు నిర్మించుకునేందుకు టీటీడీలోని శ్రీవాని ట్రస్టు నిధులు గతంలో ఇచ్చేవారని... ఈ మధ్య కాలంలో వాటిని నిలిపివేశారని... అయితే, వీటి మళ్ళీ ఇవ్వాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి సురేఖ కొండా సురేఖ, టీటీడీ చైర్మన్ ను కోరారు. ఈ ట్రస్టు ద్వారా రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుందని గుర్తు చేయగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

# జర్నలిస్టుల మహా ధర్నా గ్రాండ్ సక్సెస్

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 03:**
పన్నెండేండ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మాసాబ్ ట్యాంక్ లోని సమాచార కమిషనర్ కార్యాలయం ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(%ఖఔజీ%) ఆధ్వర్యంలో బుధవారం నాడు జరిగిన మహా ధర్నా అనూహ్యరీతిలో విజయవంతం అయ్యింది. టీయూడబ్ల్యూజే పిలుపుపై స్పందించి, రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు రాష్ట్ర నలుమూలల నుండి ఏంతో ఉత్సాహంగా, భారీగా జర్నలిస్టులు తరలి రావడం విశేషం. జర్నలిస్టుల నినాదాలతో మహానగరం రోడ్లన్నీ దద్దరిల్లాయి. సమాచార శాఖ చరిత్రలో, ఆ కార్యాలయం వద్ద ఇంత పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు ధర్నా చేయడం ప్రప్రథమని పోలీసు అధికారులతో సహా పలువురు సీనియర్ పాత్రికేయులు







చర్చించుకోవడం విశేషం. ఈ మహా ధర్నాకు యూనియన్ అనుబంధ సంస్థలైన తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం, మహిళా జర్నలిస్టుల విభాగం, తెలంగాణ ఉర్దూ జర్నలిస్టుల సమాఖ్యలతో పాటు హైదరాబాద్ ప్రెస్ క్లబ్, జూబ్లీహిల్స్ హౌజింగ్ సొసైటీ, జవహర్ లాల్ హౌసింగ్ సొసైటీ, టీజేఏలు సంపూర్ణ మద్దతును ప్రకటించి మహా ధర్నాలో భాగస్వామ్యమయ్యాయి. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన ఈ మహా ధర్నాలో, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎం. ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ,ఉప ప్రధాన కార్యదర్శి కలుకూరి రాములు ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, నగునూరి శేఖర్, చిన్న పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్ రెడ్డి, రమేష్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కె.ఎన్.హరి, వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, హరీష్, జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోపరాజు, యూనియన్ రాష్ట్ర నాయకులు వి. యాదగిరి, కె. శ్రీకాంత్ రెడ్డి,మధు గౌడ్, ఫైసల్, హెచ్.యూ.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు ఏ. రాజేష్, ఈ మహా ధర్నాలో వయోధిక జర్నలిస్టుల సంక్షేమ సంఘం కూడా భాగస్వామ్యం అయ్యింది. ఆ సంఘం నాయకుడు శ్రీనివాస్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఉర్దూ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్, సీనియర్ మహిళా జర్నలిస్టులు విమల, అత్తలూరి అరుణ, వాకటి మంజుల, కళ్యాణం రాజేశ్వరీ తదితరులు మాట్లాడారు.

# ప్రతి ఒక్క లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇల్లు

- ఐదేండ్లలో 17లక్షల ఇందిరమ్మ ఇండ్లు
- హుస్నాబాద్‌లో బహిరంగ సభలో మంత్రి వివేక్

**సిద్దిపేట,డిసెంబర్3 వెలుతురు:**
ఐదేళ్లలో ప్రతి ఒక్క లబ్దిదారుడికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్న భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఐదేండ్లలో 17లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక లబ్దిదారులకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పారు. పేదల కోసం రేషన్ కార్డుపై సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్ని ÷ర్ అయ్యారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లుఇస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ సర్కార్లో కేసీఆర్ కుటుంబ సభ్యులు తమ ఆస్తులు పెంచుకుని రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు మంత్రి వివేక్. బీఆర్ఎస్ అప్పులకు నెలకు రూ. 5 వేల కోట్ల మిత్తీలు కడుతున్నామని చెప్పారు. యంగ్ ఇండియా స్కూళ్లతో విద్యారంగంపై భారం



తగ్గుతుందన్నారు. హుస్నాబాద్ లో అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సర్కార్ చేసిన అభివృద్ధితోనే జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ గెలిచిందన్నారు వివేక్. కేటీఆర్ ఒక ఫెయిల్యూర్ లీడర్ అని..ఆయన నాయకత్వంలో పనిచేయాలో లేదో ఆ పార్టీ కార్యకర్తలు తెలుసుకోవాలన్నారు.

# ఛత్తీస్‌గడ్‌లో మరో ఎన్‌కౌంటర్

- ఐదుగురు మావోలు..ఒక పోలీస్ మృతి

**బీజాపూర్,డిసెంబర్3( వెలుతురు):**
అడవుల్లో రక్తపుటేరులు పారుతున్నాయి. కేంద్రహోంశాఖ విధించిన గడువు సమీపిస్తున్న కొద్దీ అరణ్యాలు కాల్పుల మోతతో దద్దరిల్లుతున్నాయి. బుధవారం ఉదయం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ జరిగినట్లు పోలీసులు తెలిపారు. పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని అడవిలో భద్రతా సిబ్బందికి, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయని అన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు, పోలీసుల డిస్టిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి) మరణించినట్లు తెలిపారు. మరో జవాన్‌కి గాయాలయ్యాయని అన్నారు. ఎన్‌కౌంటర్ ప్రాంతం నుండి మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. రాష్ట్రపోలీసుల్లోని రెండు విభాగాలైన డిస్టిక్ట్ రిజర్వ్‌గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్ మరియు సిఆర్‌పిఎఫ్ ఎలైట్ గ్రూప్ కోబ్రా ( కమాండో బెటాలియన్ ఫర్ రిసోల్యూట్ యాక్షన్ ) ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారని ఆ అధికారి తెలిపారు. తాజా ఎన్‌కౌంటర్‌తో ఈ ఏడాది ఇప్పటివరకు 268మంది మావోయిస్టులు మరణించారు.

# తెలంగాణ రైజింగ్‌కు ప్రధాని మోడీకి ఆహ్వానం

పనిచేయాలనేది వివరించే క్రమంలో చెప్పానన్నారు. జూబ్లీహిల్స్‌లో డిపాజిట్ కోల్పోవడంతో భాజపా దీన్ని వివాదం చేస్తోందని మండిపడ్డారు. పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన వ్యాఖ్యలను ఎడిట్ చేసి ప్రచారం చేస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. ఉత్తర భారతంలోనూ తనను పాపులర్ చేస్తున్నందుకు సంతోషమని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా మాట్లాడిన విషయాల్లో ముందు వెనక కట్ చేసి కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లు తెలంగాణలో తన నేతృత్వంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని స్పష్టం చేశారు. హిందూ దేవుళ్లు, హిందూ సమాజం లాంటిదే కాంగ్రెస్ అని కొత్తగా ఎన్నికైన తమ పార్టీ జిల్లా అధ్యక్షులకు చెప్పినట్లు వివరించారు. సమావేశంలో పార్టీ నాయకుడిగా ఎలా పనిచేయాలో తాను చెప్పినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కోల్పోవడంతో ఈ విషయాన్ని పెద్దదిగా చేసి వివాదాస్పదం చేస్తోందని ధ్వజమెత్తారు. హిందూ దేవుళ్లు మూడు కోట్ల మంది ఉన్నారని? పలు సారూప్యతలు కలిగిన దేవుళ్లు ఉన్నారని తాను చెప్పానని అన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ కూడా హిందూ సమాజం లాంటిదేనని అని పోలుస్తూ తాను వ్యాఖ్యానించానని స్పష్టత ఇచ్చారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులకు పలు కీలక అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారంపిసిసి సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో సీఎం మాట్లాడిన మాటలను కొంతమంది సోషల్ మీడియాలో వక్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని ప్రధాని మోడీని కోరాను.. మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్ రాష్ట్ర అభివృద్ధికి నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ సహకరించారని తెలిపాం.. అలాగే, రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ప్రధాని మోడీకి పలు వినతులు చేశాం.. ఆర్ఆర్ఆర్ సౌత్ ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని ప్రధాన మంత్రిని కోరామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఇక, డిసెంబర్ 8, 9న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అశ్విని వైష్ణవ్, మనోహర్ లాల్ ఖట్టర్, సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలకు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆహ్వానించారు. అలాగే, భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధి, ఆదాయ వృద్ధి లక్ష్యంగా రూపొందించిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ గురించి వివరించిన ఆహ్వాన పత్రికను వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు.

# సంపాదకీయం..

# ఎన్నికల సంస్కరణలపై చర్చించే దమ్ముందా ?

పార్లమెంట్ బృహత్తర బాధ్యతను నిర్వహించాల్సిన సమయం వచ్చింది. సమగ్ర ఎన్నికల సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. దీనిపై పార్లమెంటులో విస్తృతంగా చర్చించాలి. అప్పుడే ఎన్నికల సంస్కరలప చర్చకు అర్థం ఉంటుంది. రాజ్యాంగం గురించి గొప్పగా మాట్లాడుతున్న వారు అప్పుడు రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల సంఘంపై విమర్శలు చేయకుండా చూడాలి. అలా చేస్తే శిక్షార్హులు అయ్యేలా చేయగలగాలి. సర్‌పై చర్చకు అనుమతించినందున పార్లమెంటులో ఈ అంశాలన్నీ చర్చించాలి. అనేకానేక అంశాలు చర్చ చేయాలి. దేశానికి గుదిబండగా మారిన గవర్నర్ వ్యవస్థ, మండలి వ్యవస్థ, ఒకే వ్యక్తి వరుసగా చట్టసభలకు ఎన్నికవ్వడం, డబుల్ పెన్షన్లు పొందడం వంటివన్నీ ఈ ఎన్నికల సంస్కరణలపై జరిగే చర్చలో భాగం కావాలి. అప్పుడే ప్రభుత్వ చిత్తశుద్ధి కూడా బయట పడుతుంది. అలాగే విపక్షాల నిజాయితీ కూడా ప్రజలకు తెలుస్తుంది. ఎన్నికల సంస్కరణలపై తూతూ మంత్రంగా చర్చించకుండా ఈ అంశాలను చర్చించాలి. విపక్షాల సూచనలనలు పరిగణించాలి. అంతా కలసి సమగ్ర ఎన్నికల విధానం రూపొందించాలి. అలాగే ఇటీవల పదవీ విరమణ చేస్తూ..సుప్రీం ప్రధాన న్యయామూర్తి బిఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలను కూడా చర్చించాలి.ఎస్సీల్లో క్రిమీలేయర్ వర్తింప చేయాలన్న సూచనలు సభముందు చర్చించాలి. ఇకపోతే... ఇంతగా టెక్నాలజీ పెరిగినా..దానిని కేంద్ర ఎన్నికల సంఘం వినియోగించుకోవడం లేదేమో అని అనిపిస్తోంది. ఓటర్ల జాబితా మొదలు, ఓటరు నమోదు ప్రక్రియన సులువుగా చేయడం, లేని ఓట్లను తొలగించడం



అన్నది సులువుగా జరగాలి. కానీ అలా జరగడం లేదనడానికి సర్ ప్రక్రియపై వస్తున్న ఆరోపణలు రుజువు చేస్తున్నాయి. ఇటీవల ఉడాయ్ 2కోట్ల ఆధార్ కార్డులన నంబర్లను తొలగించింది. ఎక్కడా గందరగోళ రాలేదు. కాన ఓటు వషయంలో మాత్రం గందరగోళం ఏర్పడుతోంది. పక్కాగా ఓటు నమోదు, జాబితా రూపకల్పన, ఓటు అడ్రస్ మార్చుకోవడం అన్నది కంప్యూటర్ ముందు కూర్చుంటే అయిపోవాలి. నకిలీ ఓటు నమోదయితే కఠిన శిక్షలు అమలు కావాలి. మనదేశంలో తప్పులకు కఠిన శిక్షలు లేకపోవడం వల్లనే నేరాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం ఈ తరహాలో ఆలోచన చేయాలి. ఓటును ఆధార్‌తో అనుసంధానం చేయడమే గాకుండా పక్కా ఓటరు కార్డు, జాబితాను రూపొందించాలి. సర్ లాంటి ప్రక్రియను ప్రతి ఎన్నికలకు ముందు జరపాలి. దొంగ ఓట్లను, చనిపోయిన వారి ఓట్లను నిరంతరం తొలగించేలా వ్యవస్థను రూపొందించాలి. ఇకపోతే భారత ఎన్నికల సంఘం 12 రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్, దాని అమలు విధానం సర్వత్రా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో భవిష్యత్‌లో ఇలాంటి వివాదాలు రాకుండా పక్కాగా లక్ష్యాలను నిర్దేశించేలా పార్లమెంట్ చట్టాలను ఆమోదించాలి. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తోపాటు గుజరాత్‌లో సర్‌పై వివాదాలు రాకుండా చేయగలగాలి. ఇకపోతే బిఎల్‌ఓల మృతి వార్తలను దీనికి ఆపాదిస్తూ అసలు వ్యవస్థ పనిచేయకుండా చేయాలన్న మమతా బెనర్జీ లాంటి వారికి గట్టిగా సమాధానం చెప్పాలి. బీహార్‌లో ప్రారంభమైన ఎస్ఐఆర్ ప్రక్రియ రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు విచారించింది. ఇసి నుంచి వివరాలు తీసుకుంది. అయినా వివాదాలు సృష్టించేందకు విపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు సరికాదు. ఇది రాజ్యాంగ విధులను అడ్డుకోవడం తప్ప మరోటి కాదు. ఓటర్లు బూత్ లెవల్ అధికారుల ద్వారా అందజేయ బడిన ఎన్యూమరేషన్ ఫారాలను నింపి, తమ వివరాలను 2002-2005 నాటి ఓటర్ల జాబితాలతో సరిపోల్చాలి. 12 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎక్కువ మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశామని ఇసిఐ చెబుతున్నది. నిజమైన ఓటర్లు నింపాదిగా ఉండవచ్చు. వచ్చే నెలలో విడుదల కాబోయే ముసాయిదా జాబితాల్లో నమోదుకి అవసరమైన పత్రాలపై కూడా గందరగోళం లేకుండా చూడాలి. ఇంటింటికీ వెళ్లాలని చెప్పిన మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్తాయిలో బిఎల్‌వోలు పనిచేయాలి. పక్కాగా సమాచారం సేకరించాలి. ప్రతి ఓటరూ పాత రికార్డులు లేదా ఇసిఐ పేర్కొన్న పత్రాల ఆధారంగా తన చెల్లుబాటు నిరూపించాలి. సవరించిన జాబితాల్లో తప్పుడు నమోదు సమస్యలను కూడా పరిశీలించడం ద్వారా ఎక్కడా ఎలాంటి అపోహలకు తావులేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. సార్వత్రిక వయోజన ఓటుహక్కును పరిరక్షించేందుకు, సాంకేతిక ఆధారిత డీ డూప్లికేషన్ తోపాటు, మరింత ఓర్పుతో ఇంటింటికీ వెళ్లి ధృవీకరణ చేసే పద్ధతిని ఇసిఐ ఎంచుకోవాలి. ప్రధానంగా టెక్నాలిజితీ నకిలీ ఓట్లకు చెక్ పెట్టవచ్చు. ఎఐ వినియోగం పెంచుకోవాలి. వయోజనులందరికీ ఓటుహక్కు పరిరక్షణ కంటే మరో ధర్మం ఉండరాదు. ఎన్నో సంవత్సరాలుగా ఓటర్ల జాబితాల్లో ఉన్న పౌరులు తమ అర్హతను నిరూపించుకోవాల్సిన పరిస్థితి రాకుండా చూడాలి. ఖచ్చితమైన నమోదు బాధ్యతను కేంద్ర ఎన్నికల సంఘం పాటించాలి. అంతేగాక గందరగోళానికి దారితీసేలా చర్యలు ఉండరాదు. ఈ క్రమంలో కేంద్రం కూడా చిత్తశుద్ధితో వ్యవహరించాలి. ఓటరు నమోదు అన్నది వ్యవస్థీకృతం కావాలి. పక్కాగా ఓటు నమోదు సాగాలి. ఎన్నికల సంస్కరణలపై చర్చలో ఇలాంటి అంశాలను అన్నింటినీ చర్చించాలి. విపక్షాల సూచనలను కూడా పరిగణలోకి తీసుకోవాలి. దేశం అభివృద్ధి చెందాలంటే పక్కా ఓటు నమోదు వ్యవహారం ఉండాలి. లోటుపాట్లను చర్చించి సమగ్ర విధానంతో ముందుకు సాగేలా సవరణలకు వెనకాడరాదు.

## అడ్డూ అదుపులేని వెండి ధరలు

**- వేలల్లో పెరుగుతూ బంగారానికి సవాల్**

**- రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరిక**



**న్యూఢిల్లీ,డిసెంబర్3( వెలుతురు):**
వెండిధరలు అదరగొడుతున్నాయి. బంగారంతో నాకేంటి పోటీ అన్నట్లుగా అమాంతంగా పెరుగుతున్నాయి. పెరగడమే తప్ప తగ్గడం లేదు. సరిగ్గా ఏడాది క్రితం వెండి ధర కిలో తొలిసారి లక్ష రూపాయలు దాటితే అంతా అబ్బో అనుకున్నారు. కానీ, ఇప్పుడు అదే వెండి పసిడికి ఏమాత్రం తక్కువ కానంటోంది. పట్టపగ్గాల్లేకుండా దూసుకెళుతోంది. దేశీయంగా కిలో వెండి రూ.1.84 లక్షల వద్ద సరికొత్త రికార్డు గరిష్ఠాలను నమోదు చేసింది. అటు పసిడి సైతం రూ.1.30 లక్షల పైనే పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరగడానికి తోడు, రూపాయి విలువ పతనం కావడమూ ఈ లోహాల ధరల పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. వెండి అత్యధికంగా రూ.3,126 పెరిగి రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరింది. బుధవారం డాలరుతో రూపాయి మారకం విలువ 90 మార్కు దాటింది. దీంతో దేశీయంగా వీటి ధరలు పెరిగాయి. దీనికితోడు యూఎస్ ఫెడ్ వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,204 వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 57.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.1.32 లక్షలు పలుకుతుండగా.. కిలో వెండి రూ.1.83 లక్షలుగా ఉంది. గతంలో దేవుళ్ల బొమ్మలు, పూజా సామగ్రి, సంపన్నుల ఇళ్లల్లో పళ్లాలు, గ్లాసులకు వెండిని దేశీయంగా వినియోగించేవారు. కొవిడ్ తర్వాత పరిస్థితులు మారాయి. పారిశ్రామికంగా వెండి వినియోగం పెరిగింది. సౌర విద్యుత్ రంగం, విద్యుత్ కార్లు, మొబైల్స్ తదితర రంగాల నుంచి దీనికి డిమాండ్ పెరిగింది. దీనికితోడు చిన్న మదుపరులు పెట్టుబడి కోసం వెండిని కొనడం ప్రారంభించారు. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తి బంగారంతో పాటు వెండికీ ఉందని చెబుతుండటంతో, మదుపరుల్లో ఆసక్తి పెరుగుతోంది. దీంతో ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెడుతున్నారు.

## మరింతగా క్షీణించిన రూపాయి

**ముంబై,డిసెంబర్3( వెలుతురు):**



యుఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఉదయం ట్రేడింగ్‌లో 6 పైసలు తగ్గి చరిత్రలో తొలిసారిగా 90.02కి చేరుకుంది. గ్రీన్‌బ్యాక్‌తో పోలిస్తే 89.96 వద్ద ప్రారంభమైన రూపాయి, రికార్డు స్థాయిలో 90.15కి చేరుకుంది. తరువాత కొంత కోలుకుని 90.02 వద్ద ట్రేడవుతోంది. ఇది దాని మునుపటి ముగింపు కంటే 6 పైసలు తగ్గింది. బ్యాంకులు అధిక స్థాయిలో యుఎస్ డాలర్లను నిరంతరం కొనుగోలు చేయడం, ఎఫ్ఐఐ ఇన్‌ఫ్లోలు కొనసాగడం దీనికి కారణమని చెబుతున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లలో, సెన్సెక్స్ 165.35 పాయింట్లు తగ్గి 84,972.92కు, నిఫ్టీ 77.85 పాయింట్లు తగ్గి 25,954.35కు చేరుకుంది. రూపాయి క్షీణత అకస్మాత్తుగా సంభవించలేదు. ఇది 2025 అంతటా క్రమంగా తగ్గుతూ వచ్చింది. అప్పుడప్పుడు తిరిగి పుంజుకునే సంకేతాలు వచ్చినప్పటికీ కొనసాగలేకపోయింది. 2025 ప్రారంభంలో రూపాయి బలహీనపడటం ప్రారంభమైంది. 2025 జనవరి మధ్య నాటికి, రూ.86.70కి పడిపోయింది. మార్చి 10న 30 పైసలు తగ్గి సుమారు రూ.87.25కి చేరుకుంది. సెప్టెంబర్‌లో ఇది ఆల్‌టైమ్ కనిష్ట స్థాయికి చేరుకుంది. దాదాపు రూ.88.79కి చేరుకుంది. నవంబర్ 21న రూ.89.49కి పడిపోయింది. నవంబర్ చివరిలో ఇది కోలుకునే సంకేతాలను చూపించింది. కొన్ని రోజుల్లో రూపాయి రూ.89.26- రూ.89.28 మధ్య ట్రేడవుతూ నిలిచింది. కానీ దీనిని నిలబెట్టుకోలేకపోయింది. డిసెంబర్ నాటికి ఇది 90 దాటి దిగువకు పడిపోయింది.

## రైతు సమస్యలపై దృష్టి సారించండి

**- అనేక రకాల ఇబ్బందుల్లో రైతులు**

**- పంటలకు భీమా సౌకర్యం కల్పించాలి**

**- కూటమి ప్రభుత్వానికి సిపిఎం నేత మధు డిమాండ్**

**తిరుపతి,డిసెంబర్3( వెలుతురు):**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతాంగ సమస్యలు పట్టించుకోవాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా రైతుల ఎదుర్కొంటున్న సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులు న్యాయం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు పి మధు డిమాండ్ చేశారు. బుధవారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా వారి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోవడమే కాకుండా అప్పులు పాలవుతున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల వద్దకు క్షేత్రస్థాయిలో వెళ్లి వారి సమస్యలు గుర్తించి పరిష్కరించేలా చూడాలని సమావేశాలు, సభలు నిర్వహించడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. వరి పంట కనీసం మద్దతు ధర కూడా లేకపోవడంతో రైతులు ఉభయగోదావరి జిల్లాలో ఉండే రైతులు నష్టపోయారన్నారు. ఒక ఎకరాకు వరి 10 నుంచి 20 బస్తాలు దిగుబడి తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టో రైతుల గురించి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు ఏది అమలు కావడం లేదు అన్నారు. టిడిపి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో 20 వేలు, ఇస్తామని ప్రకటించి, మొదటి విడత ఇవ్వలేదన్నారు. కౌలు రైతులు కూడా అన్నదాత సుఖీభవ పథకంలో ఇస్తామని చెప్పి వారిని కూడా చేర్చకపోవడం దారుణం అన్నారు. కౌలు రైతులకు ప్రత్యేక




చట్టం తీసుకొస్తామని చెప్పిన చంద్రబాబు వాటిని ఎంతవరకు అమలు చేయలేదన్నారు. 23 రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్రం ప్రకటించిందని తెలిపారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క పంట కూడా గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో రైతులు అప్పుల్లో కూలిపోయారని వెల్లడించారు. వ్యవసాయ ఖర్చులు పెరిగిపోతున్న రైతులకు పండించే పంటలు గిట్టుబాటు ధర ఒకపక్క ఇవ్వకపోగా, ఇంకొకపక్క యూరియా ధరలు బస్తాపై 100 నుంచి 150 రూపాయలు అదనంగా పెరిగిపోయాయని తెలిపారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టో చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. జిల్లాలో మామిడి రైతులు పంటను బాగా పండించినా కూడా టన్నుకి ఎనిమిది రూపాయలు ఫ్యాక్టరీ ధర కొనుగోలు చేయాలని, నాలుగు రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందని ప్రకటించడం జరిగిందన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్లు రైతుల నుంచి మూడు నుంచి నాలుగు రూపాయలకు కొనుగోలు చేసి వారికి మద్దతు ధర లేకుండా చేశారన్నారు. జిల్లా కలెక్టర్ చెప్పినా కూడా ఫ్యాక్టరీ య ా జ మ ా న్య ం ప ట్టి ం చు కో లే ద న్నా రు. మిర్చి రైతులకు గతంలో క్వింటలు 24 వేల రూపాయలు వచ్చేదని ఇప్పుడు 8రూపాయలకు పడిపోయిందని గుర్తు చేశారు. పొగాకు రైతులకు 18 వేల ధర వస్తే ఇప్పుడు 6 వేల నుంచి 9 వేల పడిపోయింది అన్నారు. మొక్కజొన్న పంట 2,400 రూపాయలు మద్దతు ధర గతంలో ఉంటే ఇప్పుడు 16 వందల రూపాయలకు పడిపోయిందన్నారు. ఉల్లి రైతులు ధర లేదని రెండు రూపాయలకు పడిపోయిందని గుర్తు చేశారు. పులి రైతులకు చంద్రబాబు 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పి ఆ తర్వాత ఎకరాకి 2 వేలు ఇస్తామని అది కూడా ఇవ్వలేదు అన్నారు. టమేటా ఒక్క రూపాయికి పడిపోయిందన్నారు. శనగ పంట గతంలో పదివేల రూపాయలు ధర ఉంటే ఇప్పుడు 7 వేల500 రూపాయలుకు పడిపోయిందని అన్నారు. ఏ పంటకు గిట్టుబాటు రైతాంగానికి లేకపోవడం వల్ల రైతుల అప్పుల ఊబిలో కూలిపోయారన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో 50 లక్షల మంది రైతులు ఉంటే వాటిని సంఖ్య తగ్గించడం దారుణమన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉచిత పంటలకు భీమా సౌకర్యం కూడా ఎత్తివేయడం దారుణమన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పంటలకు భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

## 31 నుండి జనవరి 4 వరకు సిఐటియు మహాసభలు

**- జగదాంబ సెంటర్లో సిఐటియు పైలాన్ ఆవిష్కరణ**

**విశాఖపట్టణం,డిసెంబర్3( వెలుతురు):**
డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభల ప్రచారం వేగవంతమైంది. ఈ క్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు వై రాజు ఆధ్వర్యంలో విశాఖలోని జగదాంబ సెంటర్లో ఉన్న క్లాక్ టవర్ వద్ద సిఐటియు పైలాన్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జగదాంబ ప్రధాన కార్యదర్శి కర్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకి ఒకసారి ఆల్ ఇండియా మహాసభలు జరుగుతాయని, అలాగే ఈ మహాసభలు మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నంలో జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాలకు ఆల్ ఇండియా నాయకత్వం జరగవలసిన ఉద్యమాలను తీర్మాలను చర్చించి కార్యాచరణ చేయటానికి నిర్ణయాలు జరుగుతాయని అన్నారు. ముఖ్యంగా లేబర్ కోడ్స్ వచ్చిన తర్వాత కార్మికుల జీవితం దుర్భరంగా ఏర్పడుతుందని, ఈ లేబర్ కోర్సు రద్దు చేసే వరకు పోరాడుతామని తెలియజేశారు. యువజన నాయకులు గణేలిష్ మాట్లాడుతూ జనవరి 4న జరగబోవు ర్యాలీలో యువకులు, కార్మికులు, నగర ప్రజలు పెద్ద మొత్తంలో పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఈశ్వరరావు మెడికల్ రిప్రజెంట్ యూనియన్ నాయకులు చంద్రమౌళి రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు కళాధర్, తదితరులు పాల్గొన్నారు.




## లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఎంపిల ఆందోళన




**న్యూఢిల్లీ,డిసెంబర్3( వెలుతురు):**
మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా బుధవారం ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటు ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ నిరసనలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, ఇండియా బ్లాక్ ఎంపీలు పాల్గొన్నారు. ’కార్పొరేట్ జంగిల్ రాజ్‌కి నో ? కార్మిక న్యాయానికి ఎస్’ అని రాసిన బ్యానర్లు పట్టుకుని ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. కాగా, పార్లమెంటు సమావేశాల రెండో రోజు కూడా ఎస్ఐఆర్‌పై చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో.. కేంద్ర ప్రభుత్వం దీనిపై డిసెంబర్ 9న చర్చించేందుకు ఆమోదించింది. డిసెంబర్ 1 నుంచి 19 వరకు పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరగనున్నాయి.

## శ్రీకాంతచారి మరణం తోనే తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఊపందుకుంది.

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 03:**
శ్రీకాంతాచారి మరణంతోనే తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఊపందుకుందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తెలిపారు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన తొలి అమరుడు బీసీ బిడ్డ శ్రీకాంత్ ఆచారి 16 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం లింగంగౌడ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం వేల మంది విద్యార్థులు అందులోనా దళిత బడుగు బలహీన వర్గాల విద్యార్థులే బలిదానాలు చేసుకున్నారని కానీ వచ్చిన తెలంగాణలో మాత్రం అగ్ర కులాలకు చెందినవారు పదవులు అనుభవిస్తున్నారని అన్నారు. సామాజిక తెలంగాణ ఏర్పాడినప్పుడే శ్రీకాంతచారి కి అసలైన నివాళి అని అన్నారు.తెలంగాణ సాహిత్య అకాడమీ సెక్రటరీ బాలాచారి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా శ్రీకాంతచారి కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రం టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు రవి కిరణ్ బీసీ విద్యార్థి సంఘం నాయకులు గోదా రవీందర్ ఇంద్రం రజక పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రధానమంత్రి మోడీ అపాయింట్మెంట్ దొరకదు కానీ ఇతర కార్యక్రమాలకు అపాయింట్మెంట్ దొరుకుతుందా ???

**- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 03:**
బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారిని కలిసి విజ్ఞప్తి చేస్తానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అపాయింట్మెంట్ దొరకదు కానీ హైదరాబాదులో నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్ కు రావాలని ఆహ్వానించడానికి మాత్రం అపాయింట్మెంట్ దొరుకుతుందా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మీకు అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థలు రిజర్వేషన్ల కోసం ఇంత పెద్ద ఎత్తున తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఏదో బీసీలకు రిజర్వేషన్ల పెంపు కోసం కృషి చేస్తున్నట్లు నటించి ఈరోజు రిజర్వేషన్లు పెంచకుండానే ఎన్నికలకు పోయి బీసీలను నట్టేట ముంచారని అన్నారు.బీసీ సమాజమంతా అగ్రకులాలు చేస్తున్న రాజకీయాలను గమనిస్తూనే ఉందని,బిజెపి,కాంగ్రెస్ రెండు పార్టీలు దొంగనాటకాలు ఆడాయని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం ఓయూ ఇన్చార్జి గోదా రవీందర్, గుంటీ మహేష్ తిరుమణి వెంకట్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## అంబర్‌పేట్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్ పనులపై ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆగ్రహం



**బషీర్ బాగ్ వెలుతురు 3డిసెంబర్ :**
అంబర్‌పేట్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్ పనులు నెలల తరబడి నత్తనడకన సాగుతుండడంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించిన అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఈరోజు అధికారులతో కలిసి ప్రాంతాన్ని పరిశీలించారు.సర్వీస్ రోడ్ పూర్తికాకపోవడంతో స్థానికులు, విద్యార్థులు, స్కూల్ ఆటోలు మరియు ప్రతిరోజూ ప్రయాణించే వేలాది మంది తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.పనులను నిర్లక్ష్యంగా వదిలేసిన అధికారులు వెంటనే అప్రమత్తం కావాలి. సర్వీస్ రోడ్‌ను అత్యవసరంగా పూర్తి చేసి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తేవాలి అని ఆయన ఆదేశించారు.ప్రజల ప్రయాణ సౌకర్యం కోసం ఈ పనులు త్వరితగతిన పూర్తవ్వాలని ఎమ్మెల్యే అన్నారు.

## రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**రంగారెడ్డి జిల్లా వెలుతురు డిసెంబర్ 03:**



తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో బుధవారం రోజున రంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు నామని వెంకటేష్ నేత ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ నేత ఒక ప్రకటనలో తెలిపారు.. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా బి. రమణారెడ్డి. జిల్లా కార్యదర్శిగా,ఎన్ కె బి మణి. జిల్లా కోశాధికారిగా పి.రవి చారి. జిల్లా ముఖ్య సలహాదారుడిగా ఎస్. నాగయ్య జిల్లా ఉపాధ్యక్షులుగా ఎం శ్రీనివాసరావు. ఎస్ నవీన్ రావు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా వి వేణుగోపాల్ రెడ్డి. ఏ గణేష్ రెడ్డి. ఆర్గనైజేషన్ సెక్రెటరీగా ఎం ఉదయ్ గౌడ్. కే జానారెడ్డి. సత్యం గౌడ్. జిల్లా అడ్వైజర్ కమిటీ సభ్యులుగా ఎం బిక్షమయ్య. జి కృష్ణారెడ్డి. బి శ్రీనివాస్ రాజు. కె.వెంకటేశ్వరావు. మరియు కార్యవర్గ సభ్యులు తదితరులు ఎన్నుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## సెక్యులరిజం ముసుగులో హిందుత్వాన్ని కించపరచడం ఫ్యాషన్ అయింది

**- ముఖ్యమంత్రి కించపరిచే మాటలు మాట్లాడినందుకు క్షమాపణ చెప్పాలి**

**- బిజెపి నాయకురాలు ఎం. రాజేశ్వరి.**



**బషీర్ బాగ్ వెలుతురు 3 డిసెంబర్ :**
హిందూ దేవి దేవతలపై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని హిందువులకు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని బిజెపి ఓ బి సి మోర్చా రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి డిమాండ్ చేశారు. హైదరాబాదులో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ దేశానికి చేసిన దేశద్రోహపు చర్యల గురించి మాట్లాడకుండా హిందూమతంలో పెండ్లి కానోల్లకు ఒక దేవుడు మందు తాగే వాళ్లకు ఎల్లమ్మ, పోచమ్మ రెండు పెళ్లిళ్లు చేసుకుంటునోళ్లకు మరో దేవుడు కల్లు,కోడి తినేటటువంటి వాల్లకు ఇంకో దేవుడు అంటూ కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడి కాంగ్రెస్ అంటే ఎంఐఎం ఎంఐఎం అంటే కాంగ్రెస్ అని నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. హిందువుల ఆహారపు అలవాట్ల గురించి మాట్లాడిన ముఖ్యమంత్రి గొడ్డు మాంసం,పంది మాంసం తినే వారి గురించి ఎందుకు మాట్లాడలేదని అన్నారు. హిందూ సంప్రదాయ పెళ్లిల్ల గురించి మాట్లాడిన ముఖ్యమంత్రి చారు ఔరత్ చాలిస్ బచ్చే వాళ్ల గురించి మరియు స్వేచ్ఛ పేరుతో విచ్చలవిడి శృంగారాన్ని ప్రోత్సహించి కాంట్రాక్టు వివాహాలు చేసుకునే మతాల గురించి ఎందుకు మాట్లాడలేదని సెక్యులరిజం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. గతంలో పార్లమెంట్ సాక్షిగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ హిందూ దేవి దేవతలు హింసవాదులని అందుకే త్రిశూలం,శంకు,చక్రం, ఖడ్గం లాంటి ఆయుధాలు కలిగి ఉన్నారని చేసిన వ్యాఖ్యలు దేశ ప్రజలు మరచిపోకముందే ముఖ్యమంత్రి హోదాలో ఉండి రేవంత్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని కేవలం ఓటు బ్యాంకు కోసమేనని అన్నారు. గత ముఖ్యమంత్రి హిందూ గాల్లు, బొందుగాల్లు అన్నందుకు హిందువులు బొంద పెట్టారని హిందువులు సౌమ్యులు అమాయకులు అని ఏది మాట్లాడిన చెల్లుతుందని రేవంత్ రెడ్డి భావిస్తే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని పాతాళంలో బొంద పెడతారని అన్నారు హిందువులకు 33 కోట్ల దేవతలు ఎందుకని ప్రశ్నించిన ముఖ్యమంత్రి ప్రపంచ జనాభా 33 కోట్లు ఉన్నప్పుడు ప్రతి మానవుడిని మాధవుడిగా భావించి నప్పుడు ప్రతి ఒక్కరిలో దేవుడు ఉన్నాడని ఆనాటి ఆధ్యాత్మికవేత్తలు సూచించారని తెలుసుకోవాలని అన్నారు.

## ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా జాతీయ సంస్థ చే ఆహ్వాన ర్యాలీ.








**హైదరాబాద్ జిల్లా వెలుతురు డిసెంబర్ 03:**
ప్రపంచా వికలాంగుల దినోత్సవం సందర్భంగా అలీ యవర్ జంగ్ జాతీయ వాక్కు మరియు శ్రావణ వికలాంగుల సంస్థ ప్రాంతీయ కేంద్రం సికింద్రాబాద్ సిబంది మరియు ట్రైనీస్ వారు డిసబిలిటీస్ (వాక్కు మరియు శ్రావణ వికలాంగుల సేవలు గురించి ) అవగాహనా ర్యాలీ చేయడం జరిగింది. ఈ ర్యాలీలో సంస్థయందు జరుగుతున్న ఉచిత సేవలు గురించి స్లొగన్స్ ద్వారా ప్రజలకు అర్థమయేరీతిలో స్పీచ్ తెరపీ మరియు ఉచిత వినికిడి యంత్రాల పంపిణి గురించి నినాదలు చేస్తూ ప్లేకార్డ్స్ చూపిస్తూ అవగాహనా చేపట్టారు. ఇందులో సుమారు 150 మంది శిక్షణ పొందుతున్న ట్రైనీస్ మరియు సిబంది క్రమశిక్షణతో చురుకుగా అవగాహనా ర్యాలీని కార?నా పోలీస్ బృందం సహాయంతో మరియు సంస్థ సిబంది డాక్టర్ రాజేంద్ర కుమార్ (%ూూూూా%), డాక్టర్ పాటిల్, ఇతర స్టాఫ్ మరియు బి. శ్రీనివాస్ రావు అసిస్టెంట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో విజయవంతంగా అవగాహనా ర్యాలీని నిర్వహించడం జరిగింది

## కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాతో హిమాయత్ నగర్ డివిజన్ లో పర్యటించిన హైడ్రా టీం

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 03:**
మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథం హిమాయత్ నగర్ డివిజన్ లో పర్యటించిన సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ డివిజన్ లోని పలు ప్రాంతాల్లో వర్షపానీలు రావడంతో స్థానికులు మరియు ఆ స్థలంలో స్కూలు మరియు కాలేజీలు ఉండడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని వారికి తెలియజేశారు. దీనికి స్పందిస్తూ వారు వారి టీం ని డ్రోన్ కెమెరాతో బుధవారం రోజున డివిజన్ లోని విజయ డయాగ్నస్టిక్స్ సెంటర్ నేమ్ మరియు మదీనా కాలేజ్ లేన్, మహబూబ్ బస్తి తరతర ప్రాంతాల్లో పర్యటించి అక్కడున్న వృషాలను కెమెరాలో తీసుకొని బి ఎం సి మారుతి దివాకర్



గారికి కాల్ లో వీటిపై మూడు రోజులలో నోటీసులు విచ్చి చర్యలు తీసుకోవాలని లేదంటే హైడ్రా టీం ఈ యొక్క ఆక్రమాలను కూల్ చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైడ్రా టీం డీఎఫ్ఓ యజ్ఞ నారాయణ, సీఐ ఆదిత్య, ఎస్ ఎఫ్ పి దత్తు, మరియు సిహెచ్ శ్రీనివాస్, హైడ్రాడ్రోన్ టీం మరియు కాంగ్రెస్ నాయకులు మహేష్, నిజాం, మోసిన్, పురుషోత్తం, పాషా, శేఖర్, హితేష్ తతలు పాల్గొన్నారు.

## మంచాల గ్రామ పంచాయతీ బిజెపి బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన గడ్డం పుష్పలత మైసయ్య

**- మంచాల గ్రామ అభివృద్ధికి పాటుపడతా**

**- సర్పంచ్ అభ్యర్థి గడ్డం పుష్పలత మైసయ్య**



**మంచాల వెలుతురు డిసెంబర్ 3:**
మంచాల మండలం సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా మంచాల గ్రామపంచాయతీ బిజెపి పార్టీ బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన గడ్డం పుష్పలత మైస య్యసర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు ఈ సందర్భంగా గడ్డం పుష్పలత మైసయ్య మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం ప్రజలకు చేసిన సంక్షేమ పథకాలు బిజెపి కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తాను అ ని అన్నారు మంచాల గ్రామ ప్రజలు నన్ను ఆదరించి నన్ను సర్పంచ్ అభ్యర్థిగా గెలిపించాలని మీడియా ద్వారా కోరుకుంటున్నాను నన్ను స ర్పంచిగా గెలిపిస్తే మంచాల గ్రామా న్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి నావంతు కృషిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను ప్రజలకు సేవ చేస్తాను అని అన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకుడు వింజమూరి వెంకట్ రెడ్డి మంచాల మాజీ సర్పంచ్ జగన్ రెడ్డి టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అండెం విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## భారతీయ జనతా పార్టీ బలపరచిన బాటసింగారం సర్పంచ్ అభ్యర్థి గా నామినేషన్ వేసిన విష్ణు గౌడ్



**బాటసింగారం వెలుతురు డిసెంబర్ 03:**
బాటసింగారం భారతీయ జనతా పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా బండిగారి విష్ణుగౌడ్ నామినేషన్ వేయడానికి వెళుతున్న సందర్బంగా ముఖ్య అతిదులుగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, కొత్త అశోక్ గౌడ్ మాట్లాడుతూ గతంలో గ్రామనికి ఎన్నో సేవలందించిన విష్ణు ని సర్పంచిగా అత్యధిక మెజారితో గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో బిజెపి ఎస్సిమోర్చా రాష్ట్ర నాయకులు బచ్చిగళ్ళ రమేష్, బలదేవ రెడ్డి మండల బిజెపి అధ్యక్షులు సాయి గౌడ్ జంగమయ్య గౌడ్ బిక్షపతి బిజెపి సీనియర్ నాయకులు యాదగిరి గ్రామ యువకులు కార్యక్రతలు పెద్ద ఎత్తున పాల్గొని నామినేషన్ వేయడమైనది

## నాయకుడిని కాదు సేవకుడిని

**- డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ అన్ని విధాలుగా అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా**

**- స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి**



**బి.యన్ రెడ్డి వెలుతురు డిసెంబర్ 03:**
బుధవారం రోజున బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం మరియు సచివాలయ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సత్కార సభ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరు కావడం జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు మరియు సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనముకు నూతన రంగులు వేయించాలని కోరిన వెంటనే నూతన రంగులు కార్పొరేటర్ సొంత నిధుల్లో నుంచి వేయించినందుకు మరియు కాలనీలో నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు మరియు సంక్షేమ సంఘం సభ్యులు కార్పొరేటర్ కి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది అనంతరం కాలనీలో కొంతమేర భూగర్భ డ్రైనేజ్ మరమతు పనులు, మరికొన్ని రోడ్ల నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ కాలనీల అభివృద్ధికి మరియు సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయ నగర్ సీనియర్ సిటిజన్స్ ఫొరం అధ్యక్షులు బసవయ్య, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు సాంబశివరావు, అసోసియేషన్ సొసైటీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు కూర్మారావు,సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి నరసరాజు, కాలనీ ప్రధాన కార్యదర్శి బాల్ రెడ్డి మరియు కాలనీ సీనియర్ సిటిజన్స్ ఫొరం సభ్యులు, సంక్షేమ సంఘం సభ్యులు, సొసైటీ సభ్యులు, మహిళా సోదరీమణులు, మరియు పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, పవన్ రెడ్డి, నాయకులు సుధీర్, మధుసూదన్ రెడ్డి,బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ మరియు తదితరులు ఉన్నారు.



# దివ్యాంగులకు అండగా ఉంటాం

- ఉన్నత చదువులు చదివేలా సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తాం
- ఐదు శాతం ఇందిరమ్మ ఇళ్ళను కేటాయిస్తాం
- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్











**కరీంనగర్ వెలుతురు డిసెంబర్ 03:**

దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని.. వారు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా సహాయ సహకారాలు అందిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం శాతవాహన యూనివర్సిటీ సమీపంలో ఉన్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితోపాటు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితా రామచంద్రన్, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. దివ్యాంగులైన ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని బదిరుల ఆశ్రమ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని.. నిపుణులైన అధ్యాపకులను నియమించి సైన్ లాంగ్వేజ్ ద్వారా తరగతులు బోధిస్తామని వివరించారు. దివ్యాంగులు తమలోని దివ్య దృష్టిని వృధా చేయవద్దని.. ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని సూచించారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు, ఇందిరమ్మ ఇళ్ళ మంజూరులో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఆర్టీసీ బస్సు పాసుల సమస్య కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. దివ్యాంగులు ఉంటున్న పాఠశాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ కి సూచించారు. వచ్చే ఏడాది (దివ్యాంగుల దినోత్సవం) కల్లా దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివ్య దృష్టి యూట్యూబ్ ఛానల్ ను ఆవిష్కరించారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో దివ్యాంగులు పాడిన పాటను సీఎం ఆవిష్కరించినట్లు అతిథులు వివరించారు. దివ్యాంగుల శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న దివ్యాంగులలో అద్భుత ప్రతిభ ఉంటుందని వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. సైన్ లాంగ్వేజ్ లో జనగణమన పాడిన కలెక్టర్ బృందాన్ని అభినందించారు. స్కిల్ ట్రైనింగ్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. యూపీఎస్సీ వంటి ఉన్నత ఉద్యోగాల్లో దివ్యాంగులు రాణిస్తున్నారని.. చదువును నమ్ముకుని ముందుకు సాగాలని సూచించారు. వయో వృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ మన రాష్ట్రంలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యం పెంచుకోవాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కలెక్టర్ చేపడుతున్న చర్యలను అభినందించారు. దివ్యాంగుల కోపరేటివ్ చైర్మన్ వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులతో ఇప్పటికీ స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. 40 శాతం వైకల్యం ఉన్న పరికరాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని డిసిబిసి భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అతిథులను అధికారులు, సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. సందర్భంగా దివ్యాంగులైన విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూప రాణి, అధికారులు, వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు. బాలుడి కుటుంబానికి అండగా ఉంటాం హైదరాబాదులో వీధి కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. అతని కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, మా శాఖ ద్వారా మెరుగైన వైద్య సేవలు, అది చదువు బాధ్యతలు చూస్తామని హామీ ఇచ్చారు.

## అమరుల ఆశయాలు నెరవేర్చని ప్రభుత్వాలు

**భువనగిరి వెలుతురు డిసెంబర్ 3:**



గత ప్రస్తుత ప్రభుత్వాలు తెలంగాణ అమరవీరుల ఆశయాలు నెరవేర్చడంలో అమరుల కుటుంబాలను గుర్తించడంలో అలసత్వం పాటించాయని టి జాక్ కన్వీనర్ మెరుగు మధు,బిసి జాక్ నాయకులు కొత్త బాలరాజు అన్నారు.మలిదశ ఉద్యమ పోరాటంలో అసువులు బాసిన కాసోజు శ్రీకాంతాచారి 16వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు.తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ తొలి మలి దశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల ఆశయాలను వారి కుటుంబాలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి అని అన్నారు, ఉద్యమకారుల విషయంలో రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు వెంటనే అమలు చేసి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సుర్వి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఉద్యమ నిర్మాణం చేసిన నాయకులను గుర్తించకపోవడం పార్టీల భావదారిద్రాన్ని తెలియజేస్తుంది అని అన్నారు. శ్రీకాంత్ ఆచారి ఆత్మార్పణ తర్వాతనే తెలంగాణ ఉద్యమం ఉధృతం అయింది అన్న విషయాన్ని పాలకులు మరవద్దని సూచించారు. అమరుడు శ్రీకాంత్ చారి తల్లిని కూడా రాజకీయ విషయాల్లో అవమానపరిచారని, తెలంగాణకే సిగ్గుచేటు అని అన్నారు ,కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు బీసీ ఉద్యోగ సంఘాల రాష్ట్ర కార్యదర్శి మాటూరు అశోక్,టిఆర్ఎస్ నాయకులు పెంట నరసింహ, ఇట్టబోయిన గోపాల్, కల్లూజూ సతీష్, ఉడత భాస్కర్ , రాళ్ళబండి కృష్ణా చారి,రాజు చారి, తంగళ్ళపల్లి గిరిధర్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు వ్యక్తి మృతి

**ఆత్మకూర్ ఎస్ వెలుతురు డిసెంబర్ 03:**



ఆత్మకూర్ ఎస్ మండల కేంద్రంలోని క్రాస్ రోడ్ వద్ద ఉదయం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది అతి వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బోయపాడు గ్రామపంచాయతీ పరిధిలోని మంగ్య తండ కు చెందిన ఎర్ర నాగుల సైదులు తండ్రి పంతులు ఇద్దరు కలిసి గొర్రె పిల్లలు కొనడానికి ద్విచక్ర వాహనంపై ఆత్మకూర్ వస్తున్నారు . తుమ్మలపెన్ పహాడ్ రోడ్డు నుండి ఆత్మకూర్ క్రాస్ రోడ్డుకు వస్తుండగా మరిపెడ బంగ్లా నుండి చివ్వెంల వెళుతున్న కారు అతివేగంతో వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న ఎర్ర నాగుల సైదులు అక్కడికక్కడే మృతిచెందగా వెనకాల కూర్చున్న అతని తండ్రి పంతులకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన అంబులెన్స్ లో సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. కారు మహబూబాద్ జిల్లా మరిపెడ బంగ్లా మండలం చౌక్ల తండ కు చెందిన బానోత్ కిషన్ నడుపుతున్నారు. కారులో కిషన్ తో పాటు మరో నలుగురు మహిళలు ఒక చిన్నారి ఉన్నారు . వీరు చివ్వెంల మండలంలోని పాచ్య తండాలో జరుగుతున్న ఇరుముడి కార్యక్రమానికి వెళుతున్నారు. కారులో ఉన్న ఒక మహిళకు కూడా తీవ్ర గాయాలు కావడంతో ఆమెను కూడా ఆసుపత్రికి తరలించారు.

## అభివృద్ధి కోసం వస్తున్న..
## కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించండి

- తాటిపాముల గ్రామ పంచాయతీ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి కోల రమేష్ గౌడ్
- స్వచ్ఛత, అభివృద్ధి, పారదర్శక పాలన మా హామీ.
- తాటిపాముల గ్రామం ముందుకు సాగాలంటే కలిసి గెలుద్దాం!
- సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి కోల రమేష్ గౌడ్

**తాటిపాముల వెలుతురు డిసెంబర్ 03:**



తాటిపాముల గ్రామం మరింత ముందుకు సాగాలంటే ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని రమేశ్ గౌడ్ పిలుపునిచ్చారు. యువతకు అవకాశాలు, మహిళలకు భద్రత, రైతులకు సాయం, వృద్ధులకు ఆదరణ, ప్రతి వర్గానికి చేయూత అందించే గ్రామ పాలన అవసరమని తెలిపారు. గ్రామ అభివృద్ధే నా ఏకైక అజెండాతో అభ్యర్థిగా బరిలో నిలిచానని స్పష్టం చేశారు. గ్రామ అభివృద్ధి కోసం తాను రూపొందించిన ప్రణాళికలను ప్రజల ముందుకు తీసుకు వస్తున్నట్లు వెల్లడించారు. పంచాయతీ నిధుల పారదర్శక వినియోగం, శుద్ధి నీరు, శుభ్రమైన గ్రామం, యువతకు క్రీడావేదికలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, మహిళల కోసం స్వయం సహాయక వనరుల బలోపేతం, రైతులకు కాలానుగుణ సాయం, వ్యవసాయ అవసరాలపై త్వరిత స్పందన ఇలా అనేక అంశాలపై కేంద్రీకరించి పనిచేస్తానని తెలిపారు. తాటిపాముల అభివృద్ధి కోసం వస్తున్న ఆశీర్వదించి, కత్తెర గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## భవిత సెంటర్ నందు ఉచిత వైద్య శిబిరం

- ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శిరీష



**రామన్నపేట వెలుతురు న్యూస్ డిసెంబర్ 03:**

మండల కేంద్రంలో గల భవిత సాహితీ విద్య వనరుల కేంద్రం నందు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అదేశాలనుసారం, మండల న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట అధ్వర్యంలో మండల విద్యాధికారి గవ్వ జ్యోతి సమక్షంలో, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి రామన్నపేట డాక్టర్లు వరుణ్ రెడ్డి, ఉదయ్ లు కలిసి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శిరీష హాజరై మాట్లాడుతూ ఈ కేంద్రం నందు ఉన్న వారందరికీ ఇక్కడ అందించే సేవలు మరువలేనివి, మనం ఎంత చేసిన తక్కువనే అన్నారు. ఎంతో మందికి సేవా చేయాలనే నిండు మనస్సు తో ఎన్నో సేవలు చేస్తున్నారని కొనియాడారు. ఇక్కడ ఉండే దివ్యాంగ వికలాంగుల పట్ల అసభ్యకరంగా, చులకన భావంతో ఉండకూడదని, వారిలో ఎన్నో నైపుణ్యాలు దాగి ఉన్నాయని, వాటికి బయటికి తియలన్నారు. ఈ వైద్య శిబిరం నందు మొత్తం 20 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి పండ్లు,బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రాల జిల్లా ఇన్చార్జి లింగా రెడ్డి, ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, రిసోర్స్ పర్సన్ జంగమ్మ, ఫిజియథెరపీస్ట్ శ్వేత, షఫీ, వైద్య సిబ్బంది సిస్టర్స్ బూపాల, సబిత, హనుమాన్ ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు రేవతి, కవిత, బి.రేవతి, మమత, షమీమ్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పలివెల గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా ..

- పలివెల ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థి చెరుకు రోజా

**మునుగోడు వెలుతురు డిసెంబర్ 03:**



మునుగోడు మండలం పలివెల గ్రామంలో జరగనున్న సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలందరూ ఆడబిడ్డను ఆశీర్వదించాలని. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని పలివెల గ్రామం ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థి చెరుకు రోజా కోరారు బుధవారం పలివెల గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తనను గెలిపించాలని ఆమె ప్రచారం చేపట్టారు. సందర్భంగా రోజా మాట్లాడుతూ గ్రామంలో ఉన్న అన్ని వర్గాల పేద ప్రజలందరికీ నిరంతరం సేవ చేస్తానని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి. ఎవరికి ఏ ఆపద వచ్చిన కంటికి రెప్పలా మా కుటుంబంలా కాపాడుకుంటామన్నారు.. తనను సర్పంచ్ గా గెలిపిస్తే. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. తనను సర్పంచిగా గెలిపించే అందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఆశీర్వాదంతోనే సర్పంచ్ బరిలో ఉన్నానని అన్నారు.. గ్రామంలో ఉన్న యువకులు. ముఖ్యంగా మహిళలు తనకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామాభివృద్ధి కోసం. ప్రజలకు నచ్చే విధంగా ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు

## కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కట్ట లాలమ్మ



**వెలుతురు, కల్వకుర్తి డిసెంబర్ 03 :**

మాడ్గుల మండల పరిధిలోని నల్లచెరువు గ్రామానికి చెందిన కట్ట లాలమ్మ కాంగ్రెస్ పార్టీ తరపున నల్లచెరువు గ్రామానికి సర్పంచ్ అభ్యర్థిగా బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. 25 సంవత్సరాల నుండి కాంగ్రెస్ పార్టీకి పనిచేస్తున్న ట్టు ఆమె తెలిపారు. ప్రజలందరూ నాకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి ఆశీస్సులతో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కుడు బోదాసు వెంకటేష్, మాజీ వార్డు సభ్యుడు కట్ట జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలపరచిన సర్పంచ్ అభ్యర్థి గుజలాల్ శేఖర్ బాబు ఏకగ్రీవం



**శాలిగారారం వెలుతురు డిసెంబర్ 3:**

భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి స్వగ్రామం శాలిగారారం లో కాంగ్రెస్ పార్టీ బలపరచిన సర్పంచ్ అభ్యర్థి గుజలాల్ శేఖర్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికకావడం జరిగింది.

## అంకిరెడ్డిగూడెం గ్రామ సర్పంచ్ గా నామినేషన్ దాఖలూ చేసిన పర్నె శ్రీనివాస్ రెడ్డి

**చౌటుప్పల్ వెలుతురు డిసెంబర్ 03:**



చౌటుప్పల్, మండల పరిధి అంకిరెడ్డిగూడెం గ్రామ ప్రజలు బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా పర్నె శ్రీనివాస్ రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలాలు చేశారు. బుధవారం అంకిరెడ్డిగూడెం గ్రామంలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ప్రాచీన దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలూ నిర్వహించారు.ఈ నామినేషన్ కార్యక్రమానికి భాజపా నియోజకవర్గం ఎన్నిక ఇంచార్జి గంగిడి మనోహర్ రెడ్డి పాల్గొని డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ర్యాలీగా వెళ్లి నామినేషన్ అంకిరెడ్డిగూడెం నామినేషన్ స్వీకరణ కేంద్రంలోని రిటర్నింగ్ అధికారికి దాఖలూ చేశారు.దఆయనతో 1వ వార్డు అభ్యర్థిగా బత్తుల అనూష-మహేష్,4వ వార్డు అభ్యర్థిగా బత్తుల పద్మ-జంగయ్య, 7వ వార్డు అభ్యర్థులుగా రాపోలు రేణుక-సాయిలూ, రాపోలు జయమ్మ - లక్ష్మయ్య 8వ వార్డు అభ్యర్థిగా వలందాసు మహేష్ నామినేషన్ దాఖలూ చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల మండల ఇంచార్జ్ రమణగోని శంకరయ్య, భాజపా పుర అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్, దూడల బిక్షం గౌడ్, ముత్యాల భూపాల్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి పోలో శ్రీధర్ బాబు దాసోజు బిక్షమాచారి, ఉడుగు వెంకటేశం, కాసుల వెంకటేశం,పర్నె నర్సిరెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, కడారి ఐలయ్య,ఎడ్ల మహేశ్వర్ రెడ్డి, బత్తుల మహేష్, మహిళలు అంకిరెడ్డిగూడెం ప్రజానీకం తదితరులు పాల్గొన్నారు.




గ్రామ పంచాయితీ ఎన్నికల నమూనా బ్యాలెట్ పత్రము-2025

తాటిపాముల గ్రామ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థిగా

**శ్రీ కోల రమేష్ గారి**

కత్తెర గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించగలరని ప్రార్థన.

| క్రసం | అభ్యర్థి పేరు | గుర్తు |
|---|---|---|
| 1 | |  |
| 2 | శ్రీ కోల రమేష్ |  |
| 3 | |  |
| 4 | |  |

పోలింగ్ తేది: 11-12-2025

సమయం: ఉ॥ 7 గం॥ల నుండి మ ॥ 1-00 గం॥వరకు

**కత్తెర గుర్తుకే మనఓటు**

ప్రతులు: 100

# నాచారం డివిజన్ లో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి/ ఉప్పల్ (వెలుతురు న్యూస్) డిసెంబర్ 03:** ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం డివిజన్లో సుమారు రెండు కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ తో కలిసి పనులు ప్రారంభించారు. అన్నపూర్ణ కాలనీ, సీసీ రోడ్డు పనులు 30 లక్షలు, ఇంద్రనగర్, 1వ ఎడమ వీధి సీసీ రోడ్డు (30 లక్షలు) హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పక్క లేన్ సీసీ రోడ్ (37 లక్షలు), స్నేహపురి కాలనీ పార్కు ఫెన్సింగ్ (20 లక్షలు), శ్రీనగర్ కాలనీ పార్కు ఫెన్సింగ్ పనులు (10 లక్షలు), బాబానగర్ లోని రెడ్డి సమాధి వాటిక అభివృద్ధి పనులు (58.5 లక్షలు) లతో నిర్మించిన వివిధ పనులు కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఈ బాలకృష్ణ, ఏఈ వినీత్ మరియు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకులు కుటిల రాజకీయాలు మానుకోవాలి.

**- ముఖ్యమంత్రి వాక్యాలను వక్రీకరించడం సరికాదు.**

**- బీజేపీ పై వజ్రేష్ యాదవ్ ఫైర్..**



**మేడిపల్లి వెలుతురు డిసెంబర్ 03:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వాక్యాలను బీజేపీ నాయకులు కావాలనే వక్రికరించారని బీజేపీ నాయకులపై మేడ్చల్ మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మండిపడ్డారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మాట్లాడుతూ హిందూ దేవతల్లోనే ఒక్కొక్కరి అభిప్రాయం ఒక్కలా ఉందని అలాంటిది కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకుల అభిప్రాయాలు ఒకేలా ఇండవని అన్నారని అంతేకాని హిందూ దేవాను దేవాతలపై ఎలాంటి అనుచిత వాక్యాలు చేయలేదని అభిప్రాయ పడ్డారు. ఈ విషయంలో ప్రజల్లో వైషమ్యాలు పెంచేలా బీజేపీ నాయకుల ప్రవర్తన ఉందని ముఖ్యమంత్రి అనేక హిందూ దేవాలయాలు సందర్శించిన వ్యక్తి అన్నారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు పూనసమీక్షించుకోవాలని అన్నారు. కేవలం మతపరమైన రాజకీయాలే కాకుండా తెలంగాణ అభివృద్ధి కోసం బీజేపీ ఎంపీలు కృషి చేయలాని కోరారు.

# ఘనంగా రాహా ఎక్స్క్లూజివ్ ఎంఆర్ఎఫ్ షోరూమ్ ప్రారంభం





**కాప్రా, డిసెంబర్ 3 వెలుతురు :** సాకేత్ రోడ్‌లో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన ఎంఆర్ఎఫ్ ఎక్స్‌క్లూజివ్ షోరూమ్ 'రాహా టైర్స్' బుధవారం ఘనంగా ప్రారంభమైంది. కాప్రా సాకేత్ శ్రీయం టవర్ల సమీపంలో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఏఎస్‌రావు నగర్ కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నేత సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ప్రారంభ వేడుకలో స్థానిక ప్రముఖులు, కొత్త రామారావు, కాసం మహిపాల్ రెడ్డి, ధన్పాల్ రెడ్డి, రాఘవరెడ్డి, పజ్జూరి పావని రెడ్డి, నీలం రెడ్డి, రజనీకాంత్ రెడ్డి, సంధ్యారెడ్డి, మర్రి మోహన్ రెడ్డి, రహీం, కుమారస్వామి తదితరులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కస్టమర్లకు నాణ్యతతో కూడిన టైర్లు, విశ్వసనీయ సేవలు అందించడమే తమ లక్ష్యమని రాహా టైర్స్ ప్రతినిధులు వెల్లడించారు.

## ఏఎస్ రావునగర్ డ్రైనేజీ పనులపై కార్పొరేటర్ ఆగ్రహం

## నాసిరకం నిర్మాణాలపై తక్షణ చర్యలకు ఆదేశాలు



**ఏఎస్ రావునగర్, డిసెంబర్ 03 వెలుతురు :** ఏఎస్ రావునగర్ డివిజన్‌లో కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో తీవ్ర నాణ్యతా లోపాలు కనిపిస్తున్నాయని కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం టీఎస్ఐఐసీ కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణాన్ని ఆమె జలమండలి అసిస్టెంట్ ఇంజనీర్ అలేఖ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాంట్రాక్ట్ సంస్థ పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. డ్రైనేజీ నిర్మాణంలో మొత్తం రోబో సాండ్‌నే వినియోగించడం, మ్యాన్‌హోల్ ఛాంబర్లకు క్యూరింగ్ చేయకుండానే కప్పులు వేయడం వంటి నిర్లక్ష్యాలు తీవ్రంగా కనిపించాయని తెలిపారు. వెంటనే కాంట్రాక్టర్‌ను పిలిపించి నిర్మాణంలో ఉన్న ఛాంబర్లను తెరిపించి లోపాలను పరిశీలించాలని ఆమె అధికారులను ఆదేశించారు. "మన కాలనీలోనే పనులను ఇలా నిర్లక్ష్యంగా చేస్తే ప్రజల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి?" అని కార్పొరేటర్ అధికారులను ప్రశ్నించారు. దీనికి స్పందించిన ఏఈ అలేఖ్య రెడ్డి, నాణ్యతా లోపాలున్న ఛాంబర్లను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు.



# ప్రభుత్వ పాఠశాలలతోనే మెరుగైన విద్య సాధ్యం

**- ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను లంచానంగా ప్రారంభించిన అదనపు కలెక్టర్ రాధిక గుప్తా**





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (వెలుతురు న్యూస్) డిసెంబర్ 03:** పేద మధ్యతరగతి పిల్లల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్త అన్నారు. మంగళవారం కీసర మండల పరిధిలోని, నాగారం మునిసిపాలిటీ లోని, రాంపల్లి రెండు పడక గదుల కాలనీ లో నూతన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారిణి విజయకుమారితో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్త లాంఛనంగా ప్రారంభించారు. నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, కీసర మండల విద్యాధికారి ఎం జమదగ్ని, కీసర కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డి, చీర్యాలకాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రవీందర్, రాంపల్లి కాలనికి సంబంధించిన 52 బ్లాక్ల చైర్ పర్సన్స్, స్థానిక ప్రజా ప్రతినిధుల పెద్దల సహకారంతో షాపింగ్ కాంప్లెక్స్లో అలాట్ చేసిన మూడు హాల్స్లో ఈ పాఠశాలను శ్రీనివాస్ ఎస్ జి టి ఆధ్వర్యంలో 1వ తరగతి నుండి అయిదవ తరగతి వరకు ముప్పై మంది విద్యార్థులతో ఏర్పాటు చేసామన్నారు. జిల్లా ఏ ఎస్ ఓ అయ్యన్న ఇక్కడి వసతులను, అవకాశాలను పరిశీలించారని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికా గుప్త కాలనీ వాసులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ కాలనీలో నివసించే 52 బ్లాక్ ల కుటుంబాల పిల్లల కోసం ఒక కిలోమీటర్ పరిధిలో ఎటువంటి ప్రభుత్వ పాఠశాల లేనందున ప్రభుత్వం విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రభుత్వ నిబంధనల ద్వారా ఈ పాఠశాలని ఏర్పాటు చేశామని, త్వరలో అక్కడే నూతన భవనాన్ని సి ఎస్ ఐ ఆర్ దాతల ద్వారా వెంటనే నిర్మాణం చేపడతామని తెలిపారు. ఎక్కడైనా బడి గుడి అభివృద్దిలో రాజకీయాలకు తావివ్వకుండా అందరూ కలిసికట్టుగా ముందుకి వచ్చి భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఒక మంచి భవనం నిర్మించుకుందాం అని తెలిపారు. పేద మధ్యతరగతి పిల్లల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని కావున కాలనీ లో ఉన్న అందరూ తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రైవేట్ బడులలోకి పంపకుండా విధిగా ఈ బడిలోనే పిల్లలను ఎక్కువ సంఖ్యలో చేర్పించగలరని అడిషనల్ కలెక్టర్ కోరారు.

# హిందువులంటే ద్వేషం.. మాటల్లోనే బయటపడింది!

**- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం**

**కుషాయిగూడలో సీఎం దిష్టిబొమ్మ దహనం**



**కాప్రా, డిసెంబర్ 4 వెలుతురు :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవతలను అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ మండిపడింది. బుధవారం కుషాయిగూడ బస్ స్టాప్ వద్ద బీజేపీ నాయకులు సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. హిందువుల ఓట్లతో సీఎం పదవి దక్కించుకుని, ఇప్పుడంతా హిందూ భావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అని పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువులంటే కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు ద్వేషం ఉండగా, ఎంఐఎం తో మాత్రం మోకరిల్లి నడుస్తున్నారని ఆరోపించారు. హిందువుల అవమానాన్ని ఇక ఎవరూ భరించరని, హిందూ ఓటర్లు ఒక్కటై స్పందించాల్సిన సమయం వచ్చిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ బీజేపీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్ స్పందించారు. "ఖబర్దార్ రేవంత్! హిందువుల ఆశీస్సులతో గెలిచి, దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం అసహ్యం" అని ఆయన విమర్శించారు. సీఎం వ్యాఖ్యలు రాష్ట్రంలోని మత సామరస్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు, రైల్వే బోర్డు సభ్యులు కొమ్ము నర్సింగరావు, డి. నాదం, ఉప్పల్ అసెంబ్లీ మీడియా సెల్ కన్వీనర్ టీ. ఆనంద్ గౌడ్, జిల్లా జడ్ పీ సభ్యుడు విస్లావత్ హరినాయక్, డివిజన్ ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, యువమోర్చా నాయకులు వీరాంబాబు, వెంకట్ యాదవ్, మహిళా నాయకురాలు కళావతి తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన వీరారెడ్డిపల్లి గ్రామ మాజీ వార్డ్ మెంబెర్.

**కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన : కాట శ్రీనివాస్ గౌడ్**



**గుమ్మడిదల వెలుతురు డిసెంబర్ 03:** గుమ్మడిదల మండలం వీరారెడ్డిపల్లి గ్రామ వార్డ్ సభ్యుడు కనకరాజు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తూ కాంగ్రెస్ పార్టీలో పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా పార్టీ లో చేరారు.

# దక్షిణ కాశీ గా నారాయణ ఖేడ్ కాశీ నాథ్ మందిరము







**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 03 :** సంగారెడ్డి జిల్లా :- కాశి లో ఉన్న ప్రధాన శివ లింగం నారాయణఖేడ్ కాశీ నాథ్ మందిరంలో నందు ఉన్న ప్రధాన శివ లింగం ఒకే ప్రమాణం తో ఒకే మాదిరి నారాయణఖేడ్ పట్టణ ప్రజల భాగ్యం. పైన కనిపిస్తున్న శివ లింగం నారాయణఖేడ్ పట్టణంలో కాశీనాథ్ మందిరం లోనీది కింద ఉన్న శివ లింగం వారణాసి కాశి లో ఉన్న ప్రధాన శివ లింగం.. ఈ రెండు శివ లింగాలు ఒక్క సారి గమనిస్తే ఒకే కొలతల ప్రమాణం తో రెండు ప్రధాన శివ లింగాలు ఉండటం. కాశీనాథ్ మందిరం పేరుతో ఉండడం వల్ల నారాయణఖేడ్ కాశీ నాథ్ మందిరము దక్షిణ కాశీ గా చెప్పడం లో ఎటువంటి సందేహము లేదు ఇలా రెండు ప్రధాన శివ లింగా లు ఒకే లాగా ఉండటం మన నారాయణఖేడ్ భాగ్యం..అని నారాయణఖేడ్ కాశీనాథ్ మందిరం లో స్వామివారిని దర్శిస్తే కాశీ వెళ్లినంత ఫలితం వస్తుంది అని. ఆలయ ప్రధాన అర్చకులు ప్రముఖ వేద స్మార్త జ్యోతిష్య చండీ ఉపాసకులు మల మంచి గురురాజ శర్మ గారు తెలియజేయడం జరిగింది..

# నామినేషన్ వేసిన బిజెపి కార్యకర్త



**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 03 :** సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మండలంలో సత్యగామ గ్రామ పంచాయతీ సర్పంచ్ గా పోటీ చేయడానికి నామినేషన్ వేసిన గ్రామ యువకుడు బాయిని శ్రీనివాస్... ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతూ గ్రామ అభివృదే ధ్యేయంగా పనిచేస్తానని సామాజిక చైతన్యం కొరకు అలుపెరగని పోరాట పటిమ కనబరుస్తానని ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుకు సాగారు.



## సిఐటియు రాష్ట్ర మహాసభల విజయానికి జహీరాబాద్‌లో 2కే రన్

**- 7న 'చలో మెదక్'కు పిలుపు...**



**జహీరాబాద్ వెలుతురు, డిసెంబర్ 03:**
తెలంగాణ రాష్ట్రంలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) ఐదవ రాష్ట్ర మహాసభలు ఈ నెల 7 నుంచి 9 వరకు మెదక్ పట్టణంలో జరగనున్న సందర్భంగా, మహాసభలను జయప్రదం చేయడానికి భాగంగా జహీరాబాద్‌లో 2కే రన్‌ను ఘనంగా నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ రన్‌లో కార్మిక వర్గం, సంఘాల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జహీరాబాద్ పారిశ్రామిక క్లస్టర్ కన్వీనర్ ఎస్. మహిపాల్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి కట్టుబడిన సిఐటియు ఉద్యమాల కొనసాగింపులో భాగంగా రాష్ట్ర 5వ మహాసభలకు విశేష ప్రాధాన్యం ఉందని తెలిపారు. గత కాలంలో చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష చేపట్టి, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన ఉద్యమ రూపరేఖలను ఈ మహాసభలలో సిద్ధం చేయనున్నామని చెప్పారు. కార్మిక పోరాటాల సారథిగా నిలుస్తున్న సిఐటియు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయడానికి ఇప్పటికే అనేక అవగాహనా కార్యక్రమాలు చేపట్టాం. 7న మెదక్‌లో జరగనున్న బహిరంగ సభను కార్మిక వర్గం పెద్ద ఎత్తున విజయవంతం చేయాలి. ఈ మహాసభలకు సిఐటియు అఖిలభారత నాయకత్వం హాజరుకానుండటం రాష్ట్ర కార్మిక ఉద్యమానికి మరింత బలం చేకూరుస్తుందని మహిపాల్ పేర్కొన్నారు. జహీరాబాద్ ప్రాంతం నుండి కూడా భారీ సంఖ్యలో కార్మికులు 'చలో మెదక్' కార్యక్రమంలో పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరేష్, మహేశ్వర్, నారాయణ, బాలరాజ్, ఉమామహేశ్వర్, వంశీకృష్ణ, పులేందర్, సాయి గౌడ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సొంత గూటికి చేరిన కాంగ్రెస్ నాయకులు

**- అనంత్ సాగర్ గ్రామ నేతలు తిరిగి బీఆర్ఎస్‌లో చేరిక...**




**జహీరాబాద్ వెలుతురు, డిసెంబర్ 03:**
ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరసంఘం మండలం అనంత్ సాగర్ (చిలమామిడి) గ్రామానికి చెందిన రైతు నేతలు, స్థానిక ప్రముఖులు రమేష్, మల్లేష్ తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ స్థానిక నాయకులు గోపాలకృష్ణ, సత్తార్ మియా, రచ్చన్న, రవికుమార్ ఆధ్వర్యంలో చేరిక కార్యక్రమం జరిగింది. రాష్ట్ర రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుండి నాయకులు మళ్ళీ బీఆర్ఎస్ వైపు రావడం సానుకూల సంకేతంగా భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ కార్యకలాపాల బలోపేతానికి తమ వంతుగా కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకులు రమేష్, మల్లేష్ హామీ ఇచ్చారు. చేరిక కార్యక్రమానికి హాజరైన జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు నాయకులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారంలో, అభివృద్ధి కార్యక్రమాల్లో అందర్నీ భాగస్వాములను చేసుకునే పార్టీ మనది. తిరిగి పార్టీలో చేరిన ఈ నాయకులు గ్రామ స్థాయి బలాన్ని మరింతగా పెంచుతారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంగారెడ్డి మెడికల్ కాలేజీలో ర్యాగింగ్

**- విద్యార్థుల మధ్య పరస్పరం గొడవ**




**సంగారెడ్డి,డిసెంబరు3 ( వెలుతురు):**
సంగారెడ్డి గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం రేపింది. ఫస్ట్ ఇయర్ స్టూడెంట్ ని సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ చేశారు. ఎందుకు ర్యాగింగ్ చేస్తున్నారంటూ సీనియర్స్ పై విద్యార్థి సోదరుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆగ్రహంతో శాంతినగర్ లోని విద్యార్థి ఇంటికి వెళ్లి మరి సీనియర్స్ దాడి చేశారు. దీంతో సీనియర్లు, జూనియర్ల మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు కొట్టుకున్నారు. ఈ గ్యాంగ్ వార్ లో ఓ విద్యార్థికి చేయి విరిగగా, మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. అయితే, ఈ గొడవపై పోలీసులకు కాలనీ వాసులు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన సంఘటన ప్రదేశానికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. ఈ ఘర్షణకు కారణమైన వారిని పట్టుకుని సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లారు. ఇక, సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్‌ను నిరోధించడానికి కాలేజీ యాజమాన్యం యాంటీ-ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీతో పాటు పోలీసులు కూడా ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించాలని తెలిపారు.

## గుండెపోటుతో ఎస్సై మృతి

**హైదరాబాద్,డిసెంబర్3( వెలుతురు):**
హైదరాబాద్ లో విషాద ఘటన చోటు చేసుకుంది. విధుల్లో ఉన్న ఎస్సై గుండెపోటుతో కుప్పకూలడం తీవ్ర విషాదాన్ని నింపింది. మంగళవారం అర్ధరాత్రి ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో ఎస్సై సంజయ్ సావంత్(58) మృతి చెందాడు. సోమవారం రాత్రి నైట్ డ్యూటీలో భాగంగా పోలీస్ స్టేషన్ బ్యారక్ లో ఉన్న సమయంలో.. మంగళవారం తెల్లవారుజామున ఒక్కసారిగా కుప్పకూలాడు. విధుల్లో ఉన్న ఇతర కానిస్టేబుల్స్ వెంటనే ఎస్సైని సమీపంలోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు డిక్లేర్ చేశారు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు తోటి పోలీసులు సమాచారం అందించారు.ఎస్సై సంజయ్ గత రెండేళ్లుగా ఎల్బీనగర్ పీఎస్ లో పనిచేస్తున్నారు. 1989లో కానిస్టేబుల్ గా సెలెక్ట్ అయిన సంజయ్.. ఈ మధ్యే ఎస్సైగా ప్రమోట్ అయ్యి విధులు నిర్వహిస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఎస్సై మృతితో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

# భారత్ విభిన్న సంస్కృతుల నిలయం

**- బర్దిపూర్ దత్తక్షేత్రంలో దత్త జయంతి ఉత్సవాలు వైభవంగా**
**- దత్త, చండీ యజ్ఞాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా...**
**- నేడు దీపోత్సవం, డోలారోహణ ముఖ్యాకర్షణ..**





**జహీరాబాద్ వెలుతురు, డిసెంబర్ 03:**
భారత దేశం అనేక సంస్కృతులు, సంప్రదాయాలకు పుట్టినిల్లు అని ప్రతి భారతీయుడు తమ సంస్కృతిని కాపాడుకోవాలని బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్యశిఖామణి అవధూత గిరి మహారాజ్, మహంత్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ అన్నారు. దత్త జయంతి సందర్భంగా ఆశ్రమంలో రెండవ రోజు దత్త యజ్ఞం, చండీ యజ్ఞం భక్తిశ్రద్ధలతో ఘనంగా సాగాయి. ఉదయం 10:45 గంటలకు గణపతి పూజతో ప్రారంభమైన యజ్ఞాలు పుణ్యాహవచనం, మంటపారాధన, దేవతల ఆవాహనం, శ్రీ యంత్రపూజ, చండీ పారాయణంతో కొనసాగాయి. మధ్యాహ్నం 3:34 గంటలకు పూర్ణాహుతి, మహా మంగళహారతితో యజ్ఞ కార్యక్రమం సమాప్తమైంది. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతులు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి అనేది వేర్వేరు మతాలు, వర్ణాలు, కులాలు, భాషలు, ఆచారాలు, సంగీతం, నృత్యం, ఆహారపు శైలులు, నిర్మాణ కళల సమష్టి కలయిక అని, ప్రతి ప్రాంతం తనదైన ప్రత్యేకతను కలిగి ఉన్నా ఇవన్నీ కలిసినప్పుడు భారత సంస్కృతికి అసలైన అర్థం తెలుస్తుందని అన్నారు. భారతీయ సంస్కృతి అనేక సంస్కృతుల సంగమంగా నిలిచిందని వారు పేర్కొన్నారు. యజ్ఞానికి 116 మంది దంపతులు పాల్గొనగా కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుండి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. భక్తులు శ్రీ దత్తాత్రేయ స్వామి, పంచ వృక్షాలు, జ్యోతిర్లింగాలను దర్శించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయమాత, దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు దత్త జయంతి ప్రత్యేకాలు:
మార్గశిర పౌర్ణమి సందర్భంగా దేశవ్యాప్తంగా దత్త జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. దత్తకార్యాలయమైన బర్దిపూర్ ఆశ్రమంలో భారీ ఏర్పాట్లు చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం గుప్తా తెలిపారు.నేడు దత్త, చండీ హోమాల పూర్ణాహుతి, స్వామివారికి డోలారోహణం, సాయంత్రం దీపోత్సవం, అనంతరం విశ్వ మానవ ధర్మ ప్రచార సభ నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజా బాటలో భాగంగా విద్యుత్ శాఖ విస్తృత పరిశీలనలు - మరమ్మతులు, అవగాహన కార్యక్రమాలు

**- విద్యుత్ శాఖ అసిటెంట్ ఇంజనీర్ వెంకటేశ్వర రావు స్పష్టం**




**తూప్రాన్ వెలుతురు డిసెంబర్ 03:**
మెదక్ జిల్లా తూప్రాన్ మండలం, బ్రాహ్మణపల్లి శివారు లో ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి గ్రామంలో పలు అభివృద్ధి, భద్రతా చర్యలు చేపట్టారు. బ్రాహ్మణపల్లి శివారులోని టాటా కాఫీ కంపెనీ సమీపంలోని మైసమ్మ దేవాలయం పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మత్తులు చేయడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ యార్డ్‌ను శుభ్రపరిచామన్నారు. అలాగే అక్కడ పెరిగిన పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించామన్నారు. ఇదే సమయంలో బ్రాహ్మణపల్లి గ్రామంలో ప్రమాదకరంగా ఒరిగి ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభం విషయమై సమాచారం అందుకున్న వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని స్తంభాన్ని సరిచేశామన్నారు. ప్రజల నుంచి పిర్యాదు రాకపోయినా, ప్రజా బాటలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి పోల్ టు పోల్ పరిశీలనలు కొనసాగుతున్నాయని, తగిన చర్యలను వెంటనే తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా, సురక్షితంగా ఉండేందుకు నిరంతర పర్యవేక్షణతో పాటు అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఏఈ తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ప్రజల్లో అవగాహన పెంచే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గృహ విని యోగంలో విద్యుత్ వృథా కాకుండా చూసుకోవాలని సూచించిన ఏఈ వెంకటేశ్వరరావు, పగటి పూట స్విచ్‌లు ఆఫ్ చేయడం మరిచిపోయి కొందరు అనవసరంగా బిల్లులు ఎక్కువ చెల్లిస్తున్నారని, వారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సామర్థ్యాన్ని పెంచుతున్నాము అని కూడా వివరించారు.

# కోతులను పారదోలే వారే ఓట్లకోసం రండి

**- రేగొండ గ్రామంలో పోస్టర్ వేసిన యువత**
**- కోతుల బెడద తప్పించే వారికే ఓటేస్తామని హెచ్చరిక**

**జయశంకర్ భూపాలపల్లి,డిసెంబర్3( వెలుతురు):**
సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నానా పాట్లు పడుతున్నారు. మరోవైపు ప్రజలు కూడా ప్రధాన సమస్యలపై నిలదీస్తున్నారు. సాధారణంగా సర్పంచ్ అభ్యర్థులు ఓట్లు అడగడానికి వస్తే.. ఎవరైనా తమ ఊరిని అభివృద్ధి చేయాలని అడుగుతారు. విద్యుత్, నీటి కొరత వంటి సమస్యలను పరిష్కారం చేయాలని కోరతారు. అయితే.. రేగొండ మండల ప్రజలు మాత్రం ఓ విచిత్ర కోరిక కోరారు. ఆ ఊర్లో వానరాల బెడద అధికమవడంతో.. ముందుగా వాటిని తరిమేయాలని సర్పంచ్ అభ్యర్థులను వేడుకుంటున్నారు. కోతులను ఊరి నుంచి దాటించాకే ఓట్ల ప్రచారం కోసం రండి.. లేదంటే ఓట్లు అడగవద్దని బహిరంగంగా పోస్టర్ కూడా వేశారు. ఆ పోస్టర్లో ఇంకా ఏముందంటే... 'మా ఓటును అమ్మేది లేదు.. కోతులను తరిమి ఓట్లు అడిగేందుకు రండి. ప్రలోభాలకు లొంగి ప్రజాస్వామ్యాన్ని కూనీ చేయొద్దు. వజ్రాయుధం లాంటి ఓటుతో గ్రామీణాభివృద్ధికి బాటలు వేద్దాం. ఊరంతా వానరాల దాడుల్లో గాయాలైన బాధితులే. పత్తి, వరి, మిరప పంటలు.. కోతుల చేష్టలతో ఇంటికి చేరడం లేదు. రేగొండ మండల కేంద్రమైన మా గ్రామంలో పెద్ద సార్లు, పెద్ద పెద్ద లీడర్లు తిరుగుతున్నా.. మా గోడును పట్టించుకునే నాథుడే లేకుండాపోయారు. ఎన్నికల వేళ మా ఇల్లు తొక్కే నాయకుల్లారా.. కోతులను తరిమి ఎన్నికకు ముందే అభివృద్ధికి శ్రీకారం చుట్టి.. మీ చిత్తశుద్ధిని చాటుకోండి.' అని స్థానిక ఇన్‌స్పైర్ యూత్ అసోసియేషన్ తరఫున ఓ పోస్టర్‌లో రాసిపెట్టి అందరికీ కనిపించేలా వీధిలో గోడకు అతికించారు. రేగొండలో గోడకు అతికించిన పోస్టర్ ప్రస్తుతం.. ఈ ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీన్ని బట్టి ఆ ఊరి ప్రజలు కోతుల ద్వారా ఎంతగా ఇబ్బందులకు గురవుతున్నారో అర్థమవుతోందని నెట్టింట చర్చించుకుంటున్నారు. వారి న్యాయబద్ధమైన కోరికను నెరవేర్చి సర్పంచ్ అభ్యర్థులు చిత్తశుద్ధి చాటుకోవాలని పలువురు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడతకు నామినేషన్ల గడువు మంగళవారంతో ముగిసింది. 193 మండలాల్లోని 4,332 గ్రామ పంచాయతీలు; 38,342 వార్డులకు సంబంధించిన నామినేషన్లను స్వీకరించారు. రెండో విడత నామినేషన్లను బుధవారం పరిశీలిస్తారు. డిసెంబర్ 6న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అదే రోజు పోటీకి అర్హులైన అభ్యర్థుల జాబితాను వెల్లడిస్తారు. రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఈనెల 14న జరగనున్నాయి. ఆరోజు మధ్యాహ్నం తర్వాత కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటించనున్నారు.

# హిందూదేవుళ్లపై రేవంత్ వ్యాఖ్యలు

**- గాంధీభవన్ ముట్టడికి బిజెపి యత్నం**
**- అడ్డుకున్న పోలీసులు..స్వల్ప ఉద్రిక్తత**

**హైదరాబాద్,డిసెంబర్3( వెలుతురు):**
నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు నిరసన చేపట్టాయి. నాంపల్లిలోని గాంధీభవన్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ర్యాలీగా బయలుదేరిన బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మరోవైపు గాంధీ భవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు చేశారు. దీనిపై బీజేపీ నేతలు బుధవారం స్పందిస్తూ..నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పే వరకు తాము పోరాటం చేస్తామని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. గాంధీ భవన్‌ను ముట్టడించేందుకు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ శ్రేణులు సైతం సమాయత్తమవుతున్నట్లు సమాచారం. గాంధీ భవన్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యల్లో ఎటువంటి తప్పు లేదని కాంగ్రెస్ పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. నేతల మధ్య ఏమైనా మనస్పర్థలు ఉంటే వాటిని అధిగమించి.. అందరిని కలుపుకుని పోవాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను ఉదాహరించారని చెప్పారు.

అంతేకాని హిందూ దేవుళ్లను కించపరిచే ఉద్దేశ్యం సీఎం రేవంత్ రెడ్డికి ఎట్టి పరిస్థితుల్లో లేదని పార్టీ సీనియర్ నేతలు స్పష్టం చేస్తున్నారు. అదీకాక రేవంత్ రెడ్డి పాలనపై విమర్శించేందుకు బీజేపీ నేతలకు ఏ అంశం దొరకలేదని చెప్పారు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వారు ఆక్షేపిస్తున్నారని చెప్పారు.




## ఆటోలో అనుమానాస్పదంగా ఇద్దరు మృతదేహాలు

**- దర్యాప్తు చేపట్టిన పోలీసులు**



**హైదరాబాద్,డిసెంబర్3( వెలుతురు):**
నగరంలోని చాంద్రాయణగుట్టలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం కలకలం రేపింది. రోమన్ హోటల్ ఎదురుగా ఉన్న ఓ ఆటోలో ఇద్దరి మృతదేహాలను స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతులను జహంగీర్ (24), ఇర్ఫాన్ (25)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అధిక మోతాదులో డ్రగ్స్ తీసుకోవడంతోనే వారు మృతిచెందినట్లు భావిస్తున్నారు. ఘటనాస్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించింది. అక్కడ మూడు సిరంజీలు లభ్యమయ్యాయి. మరో వ్యక్తి పరారైనట్లు సమాచారం. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. ఘటనా స్థలంలో క్లూస్ టీమ్ సాయం తో ఆధారాలు సేకరించారు. అక్కడ మూడు సిరంజీలు లభించాయి. దీంతో అధిక మోతాదులోడ్రగ్స్ తీసుకోవడంతోనే వారు చనిపోయి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

# మూగ బాలుడిపై కుక్కల దాడి

**- మెరుగైన వైద్యం అందించాలని రేవంత్ ఆదేశం**




**హైదరాబాద్,డిసెంబర్3( వెలుతురు):**
హయత్‌నగర్‌లో మూగ బాలుడు ప్రేమ్ చంద్‌పై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనపై ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలోని అధికారులతో ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. బాలుడి పరిస్థితిపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల దాడిలో గాయపడిన బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని వారిని అదేశించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అతడికి అవసరమైన తక్షణ సాయం అందించాలని సూచించారు. స్వయంగా బాలుడిని పరామర్శించటంతో పాటు, ఆ కుటుంబాన్ని కూడా కలిసి.. వారి బాగోగులు పరిశీలించి, ప్రభుత్వ పరంగా వారిని ఆదుకోవాలని కమిషనర్‌కు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో జరిగిన సంఘటనలు అనుభవాలను దృష్టిలో పెట్టుకొని. . తక్షణం వీధి కుక్కల దాడుల కట్టడికి చర్యలు చేపట్టాలని ఆయన అదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హయత్‌నగర్ షిర్డీ నగర్‌లో బి తిరుపతి, చంద్రకళ దంపతులు నివసిస్తున్నారు. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా తిరపతి పని చేస్తున్నాడు. అతడి భార్య చంద్రకళ కూలీ పని చేస్తుంది. వీరికి ప్రేమ్‌చంద్ (8) కుమారుడు ఉన్నాడు. అతడికి మాటల రావు. మంగళవారం ఉదయం ప్రేమ్ చంద్.. తన ఇంటి సమీపంలోని కిరాణ దుకాణానికి వెళు తున్నాడు. కుక్కల గుంపు అతడిపై మూకుమ్మడిగా దాడి చేశాయి. శీతాకాలం కావడంతో అతడు స్వెటర్ ధరించాడు. స్వెటర్‌ను నోటితో కరిచి అతడిని కొంత దూరం లాక్కెళ్లాయి. ప్రేమ్ చంద్ మూగవాడు కావడంతో కేకలు వేయలేక నిస్సహాయంగా ఉండిపోయాడు. స్థానికులు వెంటనే స్పందించి.. రాళ్లు విసిరి కుక్కలను తరిమికొట్టారు. ఈ ఘటనలో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి.. 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. వాహనంలో అతడిని ఫీవర్ ఆసుపత్రికి తరలించారు. బాలుడికి మెరుగైన వైద్య చికిత్స కోసం నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. బాలుడి చెవకి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆ బాలుడిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు అతడి తల్లిదండ్రులు వెల్లడించారు. ఈ సంఘటనపై పత్రికలో వార్త కథనాలు వెలువడడంతో సీఎం రేవంత్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

# పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు దురదృష్టకరం

**- క్షమాపణలు చెప్పాలన్న మంత్రి అడ్లూరి**

**- కొండగట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు**



**జగిత్యాల,డిసెంబర్3( వెలుతురు):**
తెలంగాణ ప్రజలను కించపరుస్తూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పవన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో బుధవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. అదేవిధంగా బేతాళస్వామిని కూడా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొండగట్టులో ఇటీవల జరిగిన ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కొండగట్టు ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్య ద్వారానే వారు ఉన్నత స్థానానికి చేరుతారన్నారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ డ్వాక్రా మహిళలను మోసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలను ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో రూ.590 కోట్లు వెచ్చించి నిరుపేదలకు రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యాన్ని అందించిన ఘనత తమ ప్రభుత్వానిదే అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించింది తామే అన్నారు. ఈ ప్రభుత్వం రైతులకు అంకితమని.. దోపిడీదారులకు, దొంగలకు కాదన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా తెలంగాణ రాష్టాన్ని అభివృద్ధి పథంలో నడిచే విధంగా సిఎం రేవంత్ తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు.

# రాహుల్‌ను విమర్శించే స్థాయి కెటిఆర్‌కు లేదు

**- మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి**

**హైదరాబాద్,డిసెంబర్3( వెలుతురు):**
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి బిఆర్ఎస్ నేత కేటీఆర్‌కు లేదని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీది త్యాగాల కుటుంబమన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కుటుంబం రాజకీయం చేసిందని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రశ్నించే హక్కు కేటీఆర్‌కు లేదన్నారు. విలువలు లేని రాజకీయాలు మంచిది కాదు. కేటీఆర్‌కు నైతిక విలువలు ఉంటే రాహుల్ గాంధీ గురించి ఇంకోసారి మాట్లాడొద్దు. కాంగ్రెస్ జాతీయ పార్టీ.. భారత రాష్ట్ర సమితి ప్రాంతీయ పార్టీ. కేటీఆర్.. ఇక్కడ రాజకీయం చేయి.. సీఎం, పీసీసీ చీఫ్, మేమంతా సిద్ధం. రాహుల్ గాంధీని విమర్శిస్తే విడిచిపెట్టనని జగ్గారెడ్డి అన్నారు.

# రబీ యూరియా కోసం రైతుల క్యూ

**వరంగల్,డిసెంబర్3( వెలుతురు):**
మళ్లీ చూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. రబీకి ఎక్కడ దక్కదో అన్న ఆందోళనతో క్యూ కట్టారు. రబీ సీజన్లోనూ యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. నల్లబెల్లిలోని వీఎఫ్‌జీ సొసైటీ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో బుధవారం వేకువజామునే రైతులు బారులు తీరారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రైవేట్ ఎరువుల దుకాణాలతో కుమ్మక్కై ఎరువులు అమ్ముతున్నారని రైతులు ఆరోపించారు. కృత్రిమ ఎరువు కొరత సృష్టిస్తున్నారని వారు ఆక్షేపించారు. ఇలా అమ్ముతుండటంతో ప్రైవేట్ దుకాణాలలో కొనుగోలు చేయలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

# ఇక మొత్తం నాలుగు బ్యాంకులే...

**ముంబై, డిసెంబర్3( వెలుతురు):**
ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులను విలీనం చేసింది. అప్పట్లో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం సంచలనం సృష్టించింది.. ఇప్పుడిక మళ్లి విడత విలీన ప్రక్రియకు కేంద్రం సిద్ధమవుతున్న తెలుస్తోంది. ఇప్పటికిప్పుడు కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక అసలైన అంతరార్థం ఏంటనేది సామాన్యులకు అంతు పట్టకుండా ఉంది. ప్రస్తుతం మన దేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు 12 వరకు ఉన్నాయి. వీటి సంఖ్యను నాలుగు వరకు తగ్గించాలని కేంద్రం భావిస్తోంది. తద్వారా నాలుగు పెద్ద బ్యాంకులుగా మారుస్తామని చెబుతోంది.. ఇకపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా - యూనియన్ బ్యాంకులు మాత్రమే ఉంటాయని తెలుస్తోంది. మిగతా బ్యాంకులను వీటిలో విలీనం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంకు విలీనం. గతంలో యూనియన్ బ్యాంకులో ఆంధ్ర బ్యాంకు విలీనమైంది. ఇప్పుడు కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంక్ విలీనం అయ్యే అవకాశం కనిపిస్తోంది. వీటికింద ఇండియన్ బ్యాంకు, యూకో బ్యాంక్ లను తీసుకొస్తారని ప్రచారం జరుగుతుంది. తద్వారా ఏర్పాటయ్యే పెద్ద బ్యాంకు తోపాటు, వచ్చే రోజుల్లో కేవలం ఎస్బిఐ, పిఎన్బి, బి ఓ బి లను మాత్రమే కొనసాగించే ఆలోచనలో కేంద్రం ఉన్నట్టు తెలుస్తోంది. ఇక ఇతర మధ్య తరహా ప్రభుత్వ రంగ బ్యాంకులైన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఎస్బిఐ, పిఎన్బి, బి ఓ బి లో విలీనం చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు పంజాబ్ అండ్ సింధు బ్యాంకుపై ఇప్పటివరకు కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఇప్పటికైతే విలీనం గురించి చర్చలు మాత్రమే జరుగుతున్నాయి. ఆర్థిక మంత్రి ఆమోదం కోసం ఫైల్ పంపించిన తర్వాత.. అక్కడి నుంచి అనుమతి అనేది లభించిన తర్వాత.. క్యాబినెట్ సెక్రటేరియట్ లో ఉన్నతాధికారుల అభిప్రాయాలను తీసుకుంటారు. ఆ తర్వాత ప్రధాన కార్యాలయం వరకు పంపిస్తారు. మార్కెట్లను నియంత్రించే సెబీ పరిశీలనకు కూడా ఈ ఫైల్ వెళ్తుంది. ఇవన్నీ ఓకే అయితే వచ్చే ఏడాది విలీన ప్రక్రియ పూర్తవుతుంది. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడత విలీన ప్రక్రియలో 27 నుంచి 12 వరకు బ్యాంకుల సంఖ్యను తగ్గించారు. బ్యాలెన్స్ షీట్లను బలోపేతం చేయడం.. కార్యాలయాల సామర్థ్యాన్ని మెరుగుపరచడం.. అంతర్జాతీయంగా పోటీని పెంచడం వంటి వాటి ద్వారా బ్యాంకుల విలీన ప్రతిపాదనను ఆర్థిక శాఖ రూపొందించినట్లు తెలుస్తోంది.. పెద్ద బ్యాంకులుగా ఏర్పాటు చేయడం వల్ల ఖాతాదారుల్లో కూడా విశ్వసనీయత పెరుగుతుందని ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు.

# జనసేనలోకి హేమ

**హైదరాబాద్, డిసెంబర్3( వెలుతురు):**
సినీ పరిశ్రమకు చెందిన చాలామంది వ్యక్తులు రాజకీయాల్లో రాణించారు. అయితే అందులో సక్సెస్ అయిన వారు కొంతమందే. ఆర్కే రోజా రాజకీయాల్లోకి వచ్చి మంత్రి స్థాయికి ఎదిగారు. ఆపై పవన్ కళ్యాణ్ సైతం ఈ రాష్ట్రానికి డిప్యూటీ సీఎం అయ్యారు. మెగా బ్రదర్ నాగబాబు సైతం ఎమ్మెల్సీ అయ్యారు. వైసీపీ హయాంలో పోసాని కృష్ణ మురళి, అలీ, 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్ తదితరులు నామినేటెడ్ పదవులు అనుభవించారు. అయితే చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన వ్యక్తులు వివాదాస్పద ముద్రను చాటుకున్నారు. అయితే కొంతమంది ఇలా వచ్చి అలా మళ్లీ సినీ పరిశ్రమలోకి వెళ్ళిపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్, నటిగా గుర్తింపు తెచ్చుకున్న హేమ రాజకీయాల్లోకి వస్తారని తెలుస్తోంది. ఇటీవల తన మనసులో ఉన్న మాటను కూడా ఆమె బయటపెట్టారు. డ్రగ్స్ కేసులో ఇరుక్కుని.. కామెడీ పరంగా కూడా చాలామంది మహిళ నటీమణులు రాణించారు. అందులో హేమ కూడా ఒకరు.



గత కొంతకాలంగా ఆమె సినిమాల్లో పెద్దగా కనిపించడం లేదు. డ్రగ్స్ కేసులో ఇరుక్కున్నారు. జైలుకు కూడా వెళ్లారు. ఇటీవల ఆమెకు క్లీన్ చీట్ లభించింది. అయితే ఇప్పుడు ఆమె మూవీ ఆర్ట్స్ అసోసియేషన్ కు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించేందుకుగాను పవన్ కళ్యాణ్ ను కలుస్తానని చెబుతున్నారు. పనిలో పనిగా తన రాజకీయ ఆసక్తి, తన అభిలాషను సైతం పవన్ కళ్యాణ్ కు వివరిస్తానంటున్నారు. త్వరలో జనసేనలో చేరుతానని కూడా హింట్ ఇస్తున్నారు. అయితే ఆమెను జనసేనలోకి తీసుకుంటారా? లేదా? అన్నది చూడాలి. నటిగా గుర్తింపు.. గోదావరి ప్రాంతాలకు చెందిన హేమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా సినీ పరిశ్రమలో అడుగుపెట్టి తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. కామెడీ టైమింగ్ ఉన్న నాటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే 2014 ఎన్నికల్లోనే ఆమె రాజకీయాల్లోకి వచ్చారు. సమైక్యాంధ్ర ఉద్యమ పార్టీ నుంచి పోటీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు చివరి ముఖ్యమంత్రిగా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి ఆ పార్టీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో గోదావరి జిల్లాలో ఓ నియోజకవర్గంలో నుంచి పోటీ చేసిన హేమ నాలుగువేల వరకు ఓట్లు సొంతం చేసుకున్నారు. అయితే తర్వాత ఆమెకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి సైతం ఆఫర్లు వచ్చినట్లు తెలుస్తోంది. కానీ ఆమె మాత్రం జనసేనలో చేరుతారని ప్రచారం అన్నది సాగుతోంది. తనకు టీటీడీ బోర్డు మెంబర్ గా ఆసక్తి ఉందని ముందుగానే ప్రకటించుకున్నారట హేమ. చూడాలి ఆమె జనసేనలో చేరుతారా? లేదా? అన్నది.

# సభా హక్కుల ఉల్లంఘన ఇస్తే గట్టిగా జవాబిస్తా

**- కుక్క వ్యవహారంపై రేణుకా చౌదరి ఘాటు స్పందన**

**న్యూఢిల్లీ,డిసెంబరు3 ( వెలుతురు):**
కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ ఎంపీ రేణుకా చౌదరి తన కారులో ఒక కుక్కను తీసుకుని పార్లమెంటు ఆవరణలోకి రావడం ఇటీవల సంచలనమైంది. ఎంపీలకు కల్పించిన హక్కులకు ఇది విరుద్ధమని బీజేపీ దీనిపై మండిపడగా, ఆమెపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టనున్నారనే ప్రచారం జరిగింది. దీనిపై పార్లమెంటు వెలుపల ఆమెను మీడియా బుధవారంనాడు ప్రశ్నించినప్పుడు ఆమె 'బౌ బౌ' అంటూ రియాక్షన్ ఇచ్చారు. 'ఇంతకంటే ఏమి చెప్పాలి? తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు చూద్దాం. సమస్య ఏముంది? అది వచ్చినప్పుడు గట్టి సమాధానమిస్తాను' అని చెప్పారు. పార్లమెంటు సమావేశాల రేణుకా చౌదరి కారులో ఒక శు నకాన్ని తీసుకుని పార్లమెంటు ఆవరణలోకి వచ్చారు. వెంటనే భద్రతా సిబ్బంది ఆ కుక్కను వెనక్కి పంపేశారు. తాను రోడ్డుపై వస్తున్నప్పుడు రెండు వాహనాలు ఢీకొని మధ్యలో కుక్కపిల్ల కనిపించిందని, అది గాయపడి ఉంటుందని భావించి కారులో తీసుకువచ్చానని, ఇక్కడకు వచ్చిన వెంటనే ఆ కుక్కను తన ఇంటికి పంపించేశానని చెప్పారు. ఇందులో సమస్య ఏముందని ప్రశ్నించారు. రేణుకా చౌదరి చర్యను



బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ తప్పుపట్టడంతో ఆమె తిరిగి స్పందించారు. కాలుష్యంతో జనం చనిపోతున్నారు. దానిపై ఎవరికీ ఎలాంటి బాధ లేదు. బీఎల్‌ఓలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వాళ్ల కుటుంబాలు అతలాకుతలమవు తున్నాయి. అయినా వాళ్లకు ఎలాంటి పట్టింపూ లేదు. కార్మిక చట్టాలు రుద్దుతున్నారు. సంచార్ సాథీ యాప్ బలవంతంగా మనపై రుద్దుతున్నారు. కానీ రేణుకా చౌదరి కుక్క అందరికీ ఆందోళనకరమైన విషయంగా కనిపిస్తోంది. ఇంతకంటే ఏమి చెప్పాలి? మూగజీవాలను నేను ప్రేమిస్తూనే ఉంటాను' అని అన్నారు. పార్లమెంటు ఆవరణలోకి కుక్కలు రాకూడదనే నిషేధం ఏదీ లేదని, అటల్ బిహారీ వాజ్‌పేయి కూడా ఒకసారి ఎద్దులబండిపై వచ్చారని గుర్తుచేశారు.

# ఇండిగో విమాన సేవల్లో అంతరాయం

**- షెడ్యూల్‌ను సర్దుబాటు చేసిన సంస్థ**

**- అంతరాయంపై ప్రయాణికులకు క్షమాపణలు**

**న్యూఢిల్లీ,డిసెంబరు3 ( వెలుతురు):**
దేశవ్యాప్తంగా తమ విమాన సేవల్లో అంతరాయం ఏర్పడటంపై 'ఇండిగో' సంస్థ స్పందించింది. ఈ వ్యవహారంపై ప్రయాణికులకు క్షమాపణలు చెప్పింది. కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు రానున్న 48 గంటల పాటు తమ షెడ్యూల్‌లో సర్దుబాట్లు చేయడం ప్రారంభించి నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇందులో భాగంగా కొన్ని విమానాల రద్దు, మరికొన్నింటిని రీషెడ్యూల్ చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బుధవారం దేశవ్యాప్తంగా 100కుపైగా 'ఇండిగో' విమానాలు రద్దయినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. 'రెండు రోజులుగా మా విమాన కార్యకలాపాల్లో తీవ్ర అంతరాయం కలిగింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు. చిన్నపాటి సాంకేతిక లోపాలు, శీతాకాలానికి సంబంధించిన షెడ్యూల్ మార్పులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పెరిగిన రద్దీ, అప్‌డేట్ చేసిన సిబ్బంది రోస్టరింగ్ నియమాల (÷÷-లట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్) అమలు వంటి కారణాలు ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ప్రయాణికులకు అసౌకర్యాన్ని తగ్గించేందుకు, పరిస్థితిని వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు మా బృందాలు 24 గంటలూ పనిచేస్తున్నాయి. సేవల్లో అంతరాయంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం, రీఫండ్ అందించడం వంటివి చేస్తున్నాం' అని సంస్థ తెలిపింది. దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థగా గుర్తింపు పొందిన 'ఇండిగో'.. రోజుకు దాదాపు 2,300 విమాన సర్వీసులు నడుపుతుంది. రెండు రోజులుగా సేవల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. మంగళవారం 1,400కు పైగా సర్వీసులు ఆలస్యమయ్యాయి. దిల్లీ, ముంబయి, హైదరాబాద్, బెంగళూరు వంటి విమానాశ్రయాల్లో బుధవారం 100కుపైగా సర్వీసులను రద్దు చేసినట్లు సమాచారం. అదేవిధంగా పదులకొద్దీ విమానాలు ఆలస్యంగా నడిచాయి.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**రాజమండ్రి,డిసెంబర్3( వెలుతురు):**
అక్రమంగా తరలిస్తున్న సుమారు వంద బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాజమహేంద్రవరం సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో వ్యాన్‌ను పట్టుకున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం నుంచి ఇర్రిపాక మీదుగా జగ్గంపేట వైపు తరలిస్తున్న వ్యాన్‌ను అధికారులు తనిఖీలు చేయగా పీడీఎస్ బియ్యం పట్టుబడింది.
వాహనాన్ని సీజ్ చేసి అందులో ఉన్న బియ్యాన్ని సివిల్ సప్లై గోదానంకు తరలించినట్లు ఎంఎస్ఓ కృష్ణ తెలిపారు. 100 బస్తాల పీడీఎస్ బియ్యం ధర సుమారుగా రూ.9,30,000 ఉంటుందన్నారు. వ్యాన్ డ్రైవర్ మన్యం తేజ అనే వ్యక్తి పై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

# వర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

**- ఖమ్మంలో ముగ్గురు..**
**మహబూబాబాద్‌లో ఒకరు మృతి**

**ఖమ్మం,డిసెంబర్3( వెలుతురు):**
రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. ఖమ్మం ప్రమాదంలో ముగ్గురు, మహబూబాబాద్ జిల్లాలో ఒకరు మృతి చెందారు. ఖమ్మం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సత్తుపల్లి మండలం కిష్టాపురం వద్ద అదుపుతప్పిన కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతులను సిద్దేశీజాయ్ (18), సాదిక్ (16), శశి (12)గా గుర్తించారు. చంద్రుగొండ నుంచి సత్తుపల్లికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇక మహబూబాబాద్ జిల్లాలో లారీని ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఈ విషాదకర సంఘటన మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రైల్వే డిపార్ట్‌మెంట్‌లో జేఈఈగా పనిచేస్తున్న భగవత్ అనే వ్యక్తి లారీని వెనుక నుంచి ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచార మిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేపట్టారు.

## కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో బాంబు కలకలం

**- బాంబు సంచిని నోట కరిచిన కుక్క మృతి**



**భద్రాద్రికొత్తగూడెం,డిసెంబర్3( వెలుతురు):**
కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లో బాంబు పేలుడు కలకలం సృష్టించింది. గురువారం ఉదయం ఆగంతకుడు స్థానిక రైల్వేస్టేషన్ మొదటి ప్లాట్ ఫారంపై నల్ల సంచి ఉంచి వెళ్లిపోయాడు. అందులో ఏముందో ఎవరు పట్టించుకోలేదు. ఆ సంచిని వీధి కుక్క రైల్వే ట్రాక్‌పైకి నోటితో లాక్కెళ్లింది. ఆ సంచిలో ఉల్లిగడ్డ ఆకారంలో ఉన్న బాంబును కుక్క కొరింది. దీంతో భారీ శబ్దంతో బాంబు పేలుడు సంభవించింది. కుక్క అక్కడికక్కడే మృతి చెందింది. ఈ బాంబు పేలుడుతో రైల్వే స్టేషన్‌లోని ప్రయాణికులు పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో.. కొత్తగూడెం 3వ పట్టణ పోలీసులు రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంకా ఏమైనా బాంబులు ఉన్నాయా అంటూ పోలీస్ జాగిలాలతో రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు పరిశీలిస్తున్నారు. రైల్వే స్టేషన్‌లో ఆగంతకుడు ఎటువైపు నుంచి వచ్చాడు. ఎటువెళ్లాడనే కోణంలో పోలీసులు పరిశీలిస్తున్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర

**భూపాలపల్లి డిసెంబర్ 3, ( వెలుతురు)**

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు(వేశాలపల్లి, పెద్దకుంటపల్లి)లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... రైతులు శ్రమించి పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రజా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలు పొందాలని రైతులను ఎమ్మెల్యే కోరారు. రైతుల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

# అర్ధరాత్రి టిప్పర్ బీభత్సం

**హైదరాబాద్ డిసెంబర్ 3, ( వెలుతురు)**

మలక్పేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని ముసరాంబాగ్ క్రాస్ రోడ్డు (TV టవర్ వద్ద) మంగళవారం అర్ధ రాత్రి భయానక రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సిగ్నల్ పడడంతో ఆగి ఉన్న లారిని, అస్మాన్ఘడ్ గడ్డ పై నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ అదుపుతప్పి డివైడర్ ను దాటి ఢీకొంది. టిప్పర్ డ్రైవర్ వాహనం వదిలి పరారైనట్లుగా సమాచారం. ఈ ఘటనలో టిప్పర్...లారీ, మధిర వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఒక కార్ ను ఢీ కొనడం తో నాలుగు వాహనాలు ధ్వంసం కావడం జరిగింది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు అందరూ సురక్షితంగా బయటపడ్డారు. అదృష్టవశాత్తూ రాత్రి సమయం కావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సమయంలో హైదరాబాద్ నుండి వివిధ రాష్ట్రాలకు ప్రభుత్వ, ప్రైవేట్ టూరిస్ట్ బస్సులు బయలుదేరుతుండడంతో, ప్రమాద స్థలంలో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు క్షణాల్లో అక్కడికి చేరుకుని ట్రాఫిక్ను పునరుద్ధరించారు. టిప్పర్ బ్రేక్ ఫెయిల్ అయ్యాయా? లేక డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడా? అనే కోణాల్లో మలక్పేట్ పోలీసులు విచారణ ప్రారంభించారు.

# ఐ బొమ్మ రవికి షాక్..




**హైదరాబాద్, డిసెంబర్ 3, ( వెలుతురు)**

తెలంగాణ పోలీసులు ఐ బొమ్మ రవికి చుక్కలు చూపిస్తున్నారు. ఇన్ని రోజులపాటు చిత్ర రంగానికి రవి షాక్ ల మీద షాక్ లు ఇచ్చాడు. ఇప్పుడు అతడికి తెలంగాణ పోలీసులు దిమ్మతిరిగి పోయే విధంగా మాస్టర్ స్ట్రోక్ లు ఇస్తున్నారు. ఇప్పటికే రవిని కొద్దిరోజులుగా తమ కస్టడీలో ఉంచుకున్నారు తెలంగాణ పోలీసులు.. వివిధ అంశాల మీద విచారణ కొనసాగిస్తున్నారు. అతడి వెబ్సైట్ నిర్వహణ.. ఇతర మార్గాల ద్వారా సంపాదించిన సంపాదన.. ఇలా అన్ని విషయాలపై సమాధానాలు రాబట్టారు. కొన్ని విషయాలపై మాత్రం రవి దాటవేత ధోరణి ప్రదర్శించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా వెబ్సైట్లో కొత్త సినిమాలు అప్లోడ్ చేసే విధానం.. ఇతర దేశాలలో ఉన్న సర్వర్లు.. బెట్టింగ్ యాప్స్ కు ప్రమోషన్ చేసి సాగించిన సంపాదన.. ఈ విషయాలపై పోలీసులు ప్రశ్నిస్తే రవి సమాధానాలు చెప్పకుండా దాటవేత ధోరణి ప్రదర్శించినట్టు తెలుస్తోంది. పోలీసులు అడిగిన ప్రతి ప్రశ్నకు తెలియదు, గుర్తుకులేదు, మర్చిపోయాను అనే తీరుగా సమాధానాలు చెప్పినట్టు తెలుస్తోంది. అందువల్లే తెలంగాణ పోలీసులు అతడి దగ్గరనుంచి మరిన్ని వివరాలు రాబట్టడానికి కస్టడీకి సమయం కోరినట్లు తెలుస్తోంది.. అయితే తాజాగా రవిపై పోలీసులు మరో మూడు కేసులు నమోదు చేశారు. ఈ కేసులలో అతడికి 14 రోజులపాటు రిమాండ్ విధించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. రవి మంచు విష్ణుకు సంబంధించి కన్నప్ప, దిల్ రాజు సినిమా గేమ్ చేంజర్, నాగచైతన్య సినిమా తండేల్ లను పైరసీ చేసినట్టు తెలుస్తోంది. వారి ఫిర్యాదు మేరకు రవి మీద పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. దీంతో అతడికి నాంపల్లి కోర్టు మరో 14 రోజుల పాటు జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. ఇప్పటికే రవికి బెయిల్ మంజూరు చేయకూడదని.. అలా చేస్తే అతడు విదేశాలకు వెళ్లిపోయి ఆధారాలను తారుమారు చేస్తాడని ప్రభుత్వ తరపు న్యాయవాది న్యాయస్థానానికి విన్నవించారు. అయితే రవికి బెయిల్ మంజూరు చేసే విషయానికి సంబంధించి బుధవారం కోర్టులో విచారణ సాగుతుందని సమాచారం.. అయితే ఇప్పటికే కొంతమంది లాయర్లు రవి తరపున వాదించడానికి సిద్ధమయ్యారు. కొంతమంది ఇదే విషయాన్ని బహిరంగంగా ప్రకటించారు. రవిని అరెస్ట్ చేసిన తర్వాత సోషల్ మీడియాలో అతడికి అనుకూలంగా ఉద్యమం మొదలైంది. పోలీసులు హెచ్చరించినప్పటికీ రవి తరపున ఉద్యమం చేసేవారు ఏమాత్రం ఆగడం లేదు. పైగా పోలీసులను సైతం సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు.. కొందరైతే రవిని రాబిన్ హుడ్ తరహాలో కీర్తిస్తున్నారు. అతడు గొప్ప పని చేశాడని.. చాలామందికి దూరమైన ఎంటర్టైన్మెంట్ అందుబాటులోకి తీసుకొచ్చాడని వ్యాఖ్యానిస్తున్నారు.

# నా బార్డ్ నిధులతో గోదాములు

**హైదరాబాద్, డిసెంబర్ 3, ( వెలుతురు)**

తెలంగాణలో మూడేళ్లలో ధాన్యం ఉత్పత్తి మూడు రెట్లు పెరిగినప్పటికీ వాటిని నిల్వ చేసేందుకు అవసరమైన మేరకు గోదాములు లేవు. దీంతో కొత్తగా 26 గోదాములను నిర్మించేందుకు రాష్ట్ర సర్కారు ఏర్పాట్లు చేస్తోంది.వీటిలో 12 గోడౌన్లను ప్రభుత్వ నిధులతో, మరో 14 గోదాములను నాబార్డు నిధులతో నిర్మిస్తుంది. వీటి కోసం రూ.295.68 కోట్లు ఖర్చుచేస్తుంది. 2.91 లక్షల టన్నుల స్టోరేజీతో గోదాముల నిర్మాణం జరగనుంది. వేర్ హౌజింగ్ శాఖ ఆధ్వర్యంలో 12 గోదాములను, 1.51 లక్షల టన్నుల స్టోరేజీ సామర్థ్యంతో నిర్మిస్తారు. నాబార్డు సహకారంతో 14 గోదాములను రూ.140 కోట్ల రుణాలతో 1.40 లక్షల టన్నుల సామర్థ్యంతో ఉండేలా గోడౌన్ల నిర్మాణం చేపట్టారు.పర్యావరణ అనుకూల పంథాలో వీటి నిర్మాణం ఉంటుంది. అందులోని పంటలకు ఎలుకలు, చీడపీడల బెడద లేకుండా చేసేందుకు గాలి వెలుతురు ఉండేలా స్టోరేజ్ వృథాను నివారించేలా నిర్మిస్తారు.కాగా, 2024-25 ఏడాది తెలంగాణలో 190 లక్షల టన్నుల ధాన్యంతో పాటు 30 లక్షల టన్నుల మక్కల దిగుబడి వచ్చింది. అలాగే, 28 లక్షల టన్నుల పత్తితో పాటు 20 లక్షల టన్నుల ఇతర పంటల దిగుబడి వచ్చింది. వాటిని నిల్వచేసుకోవడానికి గోదాములు సరిపోవడం లేదు.రైతులు ప్రతి ఏడాది పంటలను నిల్వచేసుకోవడానికి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. గోదాములు అవసరాల మేరకు లేకపోవడంతో పంట తేమ పెరగడం, తడిసిపోవడం, ఎలుకలు, పురుగులు పడుతున్నాయి.ప్రస్తుతం ప్రభుత్వ రంగంలో తెలంగాణ వ్యాప్తంగా 24.59 లక్షల టన్నుల సామర్థ్యమున్న 253 గిడ్డంగులు ఉన్నాయి. అయితే, అవి సంప్రదాయ నమూనాలో ఉండడంతో, వాటి నిర్వహణలో ఇబ్బందులు వస్తున్నాయి.

# మారని పాకిస్తాన్ వక్రబుద్ధి.. వరద బాధితులకు ఎక్స్పైర్ ఫుడ్..

**లాహెూర్, డిసెంబర్ 3, ( వెలుతురు)**

పాకిస్థాన్ చిల్లర పనులకు అంతేలేకుండా పోతుంది. భారతదేశంపై నిత్యం అసత్యాలతో కూడిన వ్యాఖ్యలు చేసే పాకిస్థాన్.. తమ దేశంలో పరిస్థితులు దిగజారుతున్నా సరిచేసుకొనే ప్రయత్నం చేయడం చేయడం లేదు. పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతున్నా.. ఉగ్రవాదులను పెంచిపోషిస్తూ భారతదేశంపై దాడులకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అయితే, తాజాగా.. పాకిస్థాన్ తనకు అలవాటుగా మారిన చిల్లర పనులతో ప్రపంచ దేశాల ముందు పరువు పోగొట్టుకుంది.దిత్వా తుపాను ఇటీవల శ్రీలంకలో విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ తుపాను కారణంగా ఆ దేశం అతలాకుతలమైంది. భారీ వర్షాల కారణంగా 350మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.. వేల సంఖ్యలో నిరాశ్రయులయ్యారు. దాదాపు 11.18లక్షల మందిపై విపత్తు ప్రభావం పడిందని శ్రీలంక పేర్కొంది. దిత్వాతో భారీ నష్టపోయిన శ్రీలంకను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకొస్తున్నాయి. భారతదేశం కూడా శ్రీలంకకు అండగా నిలిచింది.శ్రీలంకలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో భారత ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ముమ్మరంగా సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. ఆపదలో ఉన్నవారిని రక్షిస్తున్నాయి. ఆపరేషన్ సాగర్ బంధు పేరిట శ్రీలంకలో భారత్ సహాయక చర్యలు నిర్వహిస్తోంది. అంతేకాక.. తమ వంతుగా




ఆహారం, వైద్య సామగ్రి, అత్యవసర సదుపాయాలను శ్రీలంకకు అందిస్తోంది.దిత్వా తుపాను ప్రభావంతో వణుకుతున్న శ్రీలంక కు భారత్ తో పాటు పాకిస్థాన్ సాయం అందించింది. అయితే, పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాల్సింది పోయి.. వారికి గడువు ముగిసిన వస్తువులను సాయంగా పంపించిందనే వార్తలు వస్తున్నాయి. వీటికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శ్రీలంక అధికారులు కూడా ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

పాకిస్థాన్ హైకమిషన్ సోషల్ మీడియాలో స్వయంగా పంచుకున్న కొలంబోకు వెళ్లే సహాయ ప్యాకేజీలపై గడువు తేదీ ఇప్పటికే ముగిసినట్లుగా ఉంది. దీంతో పాకిస్థాన్ తీరుపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీలంకకు సాయంగా ఆహారం, ఔషధాలను పాకిస్థాన్ పంపించింది. ఇవి కొలంబోకు చేరుకున్న విషయాన్ని తెలయజేస్తూ శ్రీలంకకు పాకిస్థాన్ ఇప్పుడు ఎప్పుడూ అండగా ఉంటుంది అని ముద్రించిన ప్యాకెట్లను శ్రీలంకలోని పాకిస్థాన్ హై కమిషన్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. ఆ ప్యాకెట్లపై గడువు తేదీ 2024 అక్టోబర్ లోనే ముగిసినట్లు తెలిసింది. వీటిని గమనించిన శ్రీలంక అధికారులు.. ఈ విషయాన్ని పాకిస్థాన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పాకిస్థాన్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. పాకిస్థాన్ పొరుగుదేశాలకు అందించే సహాయంలోనూ చిల్లర పనులకు పాల్పడటంతో ప్రపంచ దేశాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# మాట నెగ్గించుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**నల్గొండ, డిసెంబర్ 3, ( వెలుతురు)**

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మద్యం షాపుల నిర్వహణపై తనదైన శైలిలో కొన్ని షరతులు విధించిన సంగతి తెలిసిందే. ఊరి చివరనే మద్యం షాపులు, మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే అమ్మకాలు, పర్మిట్ రూములకు సాయంత్రం 6 గంటల తర్వాతే అనుమతి వంటి సూచనలు చేశారు. తాజాగా మద్యం దుకాణాలు గెలుచుకున్న షాపు యజమానులు.. ఇప్పుడు వాటిని అమలు చేస్తున్నారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యే మాట నెగ్గిందని చర్చించుకుంటున్నారు. అన్ని చోట్లా ఇలానే ఉంటే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. నిత్యం ఏదో ఒక అంశం మీద స్పందిస్తూ వార్తల్లో నిలుస్తుంటారు. ఈక్రమంలో గతంలో మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వైన్ షాపులు దక్కించుకున్న వారు.. గ్రామానికి చివర మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని.. అలానే ఉదయం నుంచే వైన్స్ తెరవద్దని.. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే మద్యం అమ్మకాలు ప్రారంభించాలని సూచించారు. దీనితో పాటుగా.. అసలు పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వొద్దని.. ఒకవేళ ఇవ్వాల్సి వస్తే.. సాయంత్రం ఆరు గంటల తర్వాతే వాటిల్లోకి అనుమతివ్వాలని సూచించిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో పెద్ద గందరగోళమే చెలరేగింది. కానీ ఈ అంశంలో రాజగోపాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారు. మద్యం షాపుల నిర్వహణలో ఆయన సూచనలు అమలు చేస్తున్నారు



దుకాణాదారులుమునుగోడు నియోజకవర్గంలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వైన్స్ యజమానులు.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచన మేరకు ఊరి బయటే మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. అలానే ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే మద్యం విక్రయాలు మొదలుపెడుతున్నారు. సాయంత్రం 6 గంటలకు పర్మిట్రూంలోకి అనుమతి ఇస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారని కామెంట్ చేస్తున్నారు స్థానికులు. అన్ని గ్రామాల్లో ఇదే అనుసరిస్తే.. చాలా బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. మునుగోడు నియోజకవర్గంలోని మద్యం దుకాణాల యజమానులతో కీలక భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మద్యం షాపు ఓనర్స్కు కీలక సూచనలు చేశారు. బెల్ట్ షాపులు నిర్వహించొద్దని, సిండికేట్ ఏర్పడకూడదని.. ఊరి చివరే మద్యం అమ్మకాలు జరపాలని.. అలానే పర్మిట్రూంలకు పర్మిషన్ ఇవ్వొద్దని ఎమ్మెల్యే రాజగోపాల్రెడ్డి వారికి సూచించిన సంగతి తెలిసిందే.అనంతరం మద్యం దుకాణాలు దక్కించుకున్న యజమానులతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. హైదరాబాద్లోని తన నివాసంలో ప్రత్యేక భేటీ నిర్వహించారు. ఆయన పెట్టిన కండీషన్లకు మద్యం దుకాణాదారులు, వ్యాపారులు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఊరి బయటే మద్యం షాపులను ఏర్పాటు చేయగా.. తాజాగా సోమవారం వాటిని ప్రారంభించారు. అలానే ఎమ్మెల్యే సూచించనట్లుగానే మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతనే మద్యం విక్రయాలు ప్రారంభించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మళ్లీ సెంటి మెంట

**హైదరాబాద్, డిసెంబర్ 3, ( వెలుతురు)**

తెలంగాణ నేతలు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై విరుచుకుపడుతున్నారు. ఆయన క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. ముందుగా బీఆర్ఎస్ నేతలు ఈ డిమాండ్ చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు దానిని కొనసాగిస్తున్నారు. తాజాగా తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పవన్ కళ్యాణ్ పై సంచలన ఆరోపణలు చేశారు. పవన్ క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకుంటే తెలంగాణలో ఆయన సినిమాలను ఆడనివ్వమని.. అనుమతి సైతం నిలిపివేస్తామని హెచ్చరించారు. అసలు పవన్ కళ్యాణ్ కు రాజకీయాలే తెలియని తేల్చేశారు కోమటిరెడ్డి వెంకటరెడ్డి. అయితే నిజంగా వెంకట్ రెడ్డి పవన్ కళ్యాణ్ పై కోపంతో ఈ వ్యాఖ్యలు చేశారా? లేకుంటే బి ఆర్ ఎస్ ఈ విషయంలో ముందంజలో ఉందని భావించి చేశారా? అన్నది తెలియాల్సి ఉంది. మొన్నటి అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా ఒక వ్యాఖ్య ఆయన నోటి నుంచి వచ్చింది. అదే ఇంతటి వివాదానికి కారణం అయింది. యధాలపంగా వ్యాఖ్యలు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సముద్ర జలాలు మూలంగా కొబ్బరి తోటలు నాశనం అవుతున్నాయి. పచ్చటి తోటలు సైతం ఖాళీ అయి అంద విహీనంగా కనిపిస్తున్నాయి. స్థానిక రైతుల విన్నపం మేరకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆ తోటలను పరిశీలించారు. ఈ క్రమంలోనే కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రాంతంలో కోనసీమ లాంటి అందమైన ప్రదేశం ఉండకపోవడంతో అక్కడి ప్రజలు ఎప్పుడూ బాధపడుతుంటారని.. ఆ దిష్టి తగిలినట్లు ఉందని అర్థం వచ్చేలా మాట్లాడారు. పవన్ కళ్యాణ్ సానుకూల



దృక్పథంతోనే ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ పై ఎటువంటి వ్యతిరేక భావనతో వీటిని చేయలేదు. అయితే బిఆర్ఎస్ నేత జగదీశ్వర్ రెడ్డి అయితే పవన్ కళ్యాణ్ కు బుర్ర లేదు అంటూ సంచలన కామెంట్స్ చేశారు. అటు తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఒంటరిగా పోటీ చేయలేడు కానీ అంటూ వైసిపి ట్యాగ్ లైన్ తో మాట్లాడారు. ఇప్పుడేమో మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి ఏకంగా పవన్ కళ్యాణ్ సినిమాలపైనే మాట్లాడారు. క్షమాపణ చెప్పకపోతే తెలంగాణలో పవన్ కళ్యాణ్ సినిమాలు ఆడనివ్వబోమని హెచ్చరికలు పంపారు. ఆ ముగ్గురు ఎన్నిసార్లు క్షమాపణ చెప్పాలి? అయితే ఇప్పుడు పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెబుతారా? అనేది హాట్ టాపిక్ అవుతోంది. ఎందుకంటే పవన్ వ్యతిరేక భావనతో ఆ వ్యాఖ్యలు చేయలేదు. కానీ తెలంగాణ నేతలు మాత్రం దానిని తప్పుపడుతున్నారు. అయితే అదే తెలంగాణకు సీఎం గా వ్యవహరించిన కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీష్ రావు అయితే ఏపీతోపాటు ఏపీ ప్రజలను, ఇక్కడి నేతలను ఉద్దేశించి కారుకూతలు కోశారు చాలా సందర్భాల్లో. ఈ లెక్కన వారితో ఎన్నిసార్లు క్షమాపణ చెప్పించాలి? అయితే ఇప్పుడు ఏకంగా తెలంగాణ మంత్రి స్పందించడంతో రెండు రాష్ట్రాల మధ్య వివాదం ప్రారంభం కావడం ఖాయం. ఇప్పటివరకు పవన్ కళ్యాణ్ స్పందించలేదు. జనసేన నేతలు సైతం పెద్దగా రియాక్ట్ కావడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో పవన్ కళ్యాణ్ కు కూటమి నేతలు కూడా అనుకున్న స్థాయిలో అండగా నిలబడడం లేదు. స్పందిస్తే సెంటిమెంట్ బయటకు.. కచ్చితంగా ఇప్పుడు ఏపీ నుంచి స్పందిస్తే మాత్రం మళ్లీ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించి రాజకీయంగా చలికాచుకోవాలని చూస్తోంది బిఆర్ఎస్ పార్టీ. అందుకే ఎందుకైనా మంచిది అని కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగింది. ఈ విషయంలో సెంటిమెంటు అస్త్రాన్ని కెసిఆర్ బయటకు తీస్తే మాత్రం.. అందులో తమ ప్రయోజనం పదిల పరుచుకోవాలని కాంగ్రెస్ భావించింది. అందుకే జగదీశ్వర్ రెడ్డి స్పందించిన తరువాత మాత్రమే ఎమ్మెల్యే తో పాటు మంత్రి స్పందించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలి. అయితే దీనిపై మౌనమే మేలని పవన్ కళ్యాణ్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పైగా తెలంగాణ సమాజం తప్పు పట్టేలా మాత్రం పవన్ వ్యాఖ్యలు లేవు. ఆ వ్యాఖ్యల్లో ఉన్న ద్వందర్థాలతో రాజకీయం చేయాలని చూసింది బి ఆర్ఎస్. జాగ్రత్త పడింది కాంగ్రెస్. అంతకుమించి ఏమీ కనిపించడం లేదు.

## మాటలు వక్రీకరించొద్దు.. టీ నేతలకు జనసేన స్వీట్ వార్నింగ్

**హైదరాబాద్, డిసెంబర్ 3, ( వెలుతురు)**

పల్లె పండుగ 2.0' లో భాగంగా కోనసీమ లోని రాజోలు నియోజకవర్గం లో రీసెంట్ గానే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కోన సీమ కొబ్బరి చెట్లను చూసి తెలంగాణ జనాలు దిష్టి పెడుతున్నారు, అందుకే అవి ఎండిపోతున్నాయి అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు రేపాయి. ఎక్కడ చూసినా దీని గురించే చర్చ. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలను అవమానించాడని , తక్షణమే ఆయన క్షమాపణలు చెప్పాలని ముందుగా BRS పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఇక నేడు తెలంగాణ మంత్రులు ఒక్కొక్కరుగా మీడియా ముందుకొచ్చి పవన్ కళ్యాణ్ పై తీవ్రమైన విమర్శలు చేస్తూ, నీ సినిమాలను తెలంగాణ లో ఆడనివ్వం, మర్యాదగా క్షమాపణలు చెప్పు అంటూ డిమాండ్ చేశారు. సాక్ష్యాత్తు సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటి రెడ్డి వెంకటరెడ్డి కూడా పవన్ కళ్యాణ్ కి ఇలాంటి వార్నింగ్ ఇచ్చాడు. అయితే పవన్ కళ్యాణ్ దీనిపై స్పందిస్తాడా లేదా? , క్షమాపణలు చెప్తాడా లేదా అని అనుకుంటున్న సమయం లో కాసేపటి క్రితమే సోషల్ మీడియా ద్వారా జనసేన పార్టీ నుండి ఒక ప్రకటన విడుదలైంది. అందులో 'రాజోలు నియోజగవర్గం లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనలో భాగంగా రైతులతో ముచ్చటిస్తూ మాట్లాడిన మాటలను తెలంగాణ మంత్రులు వక్రీకరిస్తూ మాట్లాడుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మంచి సఖ్యత ఉన్న ఈ సమయం లో వాస్తవ



మాటలను వక్రీకరించి విబేధాలు సృష్టించకండి' అంటూ ఆ లేఖ లో చెప్పుకొచ్చాడు. పవన్ కళ్యాణ్ అభిమానులు కూడా అసలు తమ అభిమాన నాయకుడు ఏమి మాట్లాడాడో వీడియో ద్వారా తెలిపే ప్రయత్నం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ లోని కొంతమంది నాయకులను ఉద్దేశించి మాట్లాడిన మాటలను, తెలంగాణ ప్రజల గురించి మాట్లాడినట్టుగా వక్రీకరించి చూపించారని, ఇలాంటి నీచమైన రాజకీయాలు ఇకనైనా మానుకోండి అని, తెలంగాణ ప్రభుత్వం పై వ్యతిరేకత వచ్చినప్పుడల్లా జనాల దృష్టిని మరలించేందుకు ఇలాంటి చీప్ ట్రిక్స్ ప్లే చేయడం కాంగ్రెస్ పార్టీ కి వెన్నతో పెట్టిన విద్య అంటూ మండిపడుతున్నారు పవన్ ఫ్యాన్స్. మాటలను వక్రీకరించవద్దు.




# ఐఎండీబీ పాపులర్ నటులు, దర్శకుల జాబితా

## సైయారా నటులు, దర్శకుడికి తొలిస్థానం

## తెలుగు నుంచి చోటు దక్కించుకోని తెలుగు స్టార్స్

సినిమాలకు సంబంధించి రేటింగ్ పరంగా అత్యంత విశ్వసనీయత కలిగిన ఆన్‌లైన్ వేదికగా పేరున్న ఇంటర్నెట్ మూవీ డేటా బేస్ ఐఎండీబీ ప్రతి ఏడాది సినిమాలతో పాటు తారలకు సంబంధించి వివిధ కేటగిరీలలో ప్రేక్షకాదరణ పొందిన జాబితాను ప్రకటిస్తున్నది. తాజాగా ఈ ఏడాది పాపులర్‌గా నిలిచిన తారల జాబితాను విడుదల చేసింది. ఇందులో తెలుగు నుంచి ఒక్కరు కూడా చోటు దక్కించుకోకపోవడం విశేషం. సైయారా సినిమాతో సూపర్ హిట్ అందుకున్న బాలీవుడ్ యువ నటులు ఆహన్ పాండే, అనిత్ పడ్డా.. వరుసగా మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. మోహిత్ సూరి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌ను అందుకుంది. ఇక కూలీ కామియోతో మెరిసిన ఆమిర్ ఖాన్ ఈ ఏడాది మోస్ట్ పాపులర్ తారల జాబితాలో మూడవ స్థానంలో నిలిచాడు. హోమ్ బౌండ్ సినిమాతో మెప్పించిన ఇషాన్ ఖట్టర్ నాలుగవ స్థానంలో నిలువగా.. బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్ సినిమాతో అలరించిన నటుడు లక్ష్య ఐదవ స్థానంలో దక్కించుకున్నాడు. రష్మిక మందన్నా ఆరో స్థానంలో నిలువగా.. లోక చిత్రంతో సూపర్ హిట్ అందుకున్న కళ్యాణి ప్రియదర్శన్ ఏడో స్థానం దక్కించుకుంది. ధడక్ సినిమాలో నటనకు గాను తృప్తి డిమ్రి ఎనిమిదో స్థానంలో నిలువగా.. రుక్మిణి వసంత్ 9వ స్థానం, రిషబ్ శెట్టి 10వ స్థానం దక్కించుకున్నారు దర్శకుల జాబితాలో ఐఎండీబీ విడుదల చేసిన డేటా ప్రకారం ఈ ఏడాది మోస్ట్ పాపులర్ దర్శకులు ఎవరు అనేది చూసుకుంటే. సైయారాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు మోహిత్ సూరి ఈ ఏడాది మోస్ట్ పాపులర్ దర్శకులలో అగ్ర స్థానంలో నిలిచాడు. బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్‌తో ఎంట్రీ ఇచ్చిన షారుఖ్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ ఈ ఏడాది రెండో స్థానంలో నిలిచాడు. కూలీ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న లోకేష్ కనకరాజ్ మూడో స్థానంలో నిలువగా.. నిశాంఛీతో హిట్ అందుకున్న అనురాగ్ కశ్యప్ నాలుగో స్థానంలో, ఎల్ 2 ఎంపురాన్ సినిమాతో హిట్ అందుకున్న పృథ్వీరాజ్ సుకుమారన్ ఐదో స్థానంలో నిలిచారు. ఆమిర్ ఖాన్‌తో సితారే జమీన్ పర్ లాంటి సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు ఆర్.ఎస్. ప్రసన్న ఆరో స్థానంలో నిలువగా..




మెట్రో ఇన్ డినోతో అనురాగ్ బసు ఏడో స్థానంలో నిలిచాడు. మలయాళం కొత్త లోక సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న దర్శకుడు డొమినిక్ అరుణ్ ఎనిమిదో స్థానంలో చోటు దక్కించు కోగా.. ఛావా దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ 9వ స్థానం, హోమ్ బౌండ్ చిత్రంతో నీరజ్ ఘైవాన్ 10వ స్థానంలో చోటు దక్కించుకున్నాడు.

# ఐటమ్ సాంగ్‌లతో పూజ అదుర్స్

## అల్లు అర్జున్-అట్లీ సినిమాలో ఛాన్స్ వచ్చినట్లు ప్రచారం

తెలుగు సినీ పరిశ్రమలో ఒకప్పుడు టాప్ హీరోలందరి సరసన వరుసగా నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పూజా హెగ్డే, గత కొన్నేళు ్లగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఆమె నటించిన కొన్ని పెద్ద సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోయినా స్టార్ ఇమేజ్ ఏమాత్రం తగ్గలేదు. గ్లామర్, డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ లాంటి అంశాల్లో పూజాతో సరితూగే వారు లేరని చెప్పాలి. అల్లు అర్జున్, మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, రామ్ చరణ్ వంటి అగ్రనటులతో నటించటం ఆమె కెరీర్‌కే ప్రత్యేక గుర్తింపునిచ్చింది వరుస ఫ్లాప్‌ల వల్ల లీడ్ రోల్స్ తగ్గినా, పూజా మాత్రం వెనక్కి తగ్గలేదు. హీరోయిన్‌గా కాకపోయినా, స్పెషల్ సాంగ్స్, స్పెషల్ రోల్స్ చేసుకుంటూ తన స్టార్ ప్రెజెన్స్‌ను కొనసాగించాలని నిర్ణయించుకుంది. 'కూలీ' సినిమాలో 'మౌనిక' సాంగ్ విజయంతో పూజా మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. ఆమె డాన్స్, లుక్స్, గ్లామర్ ఆ పాటను దక్షిణాది వ్యాప్తంగా వైరల్ చేశాయి. ఈ సాంగ్ హిట్ తర్వాత పూజాకు స్పెషల్ సాంగ్ ఆఫర్లు వరుసగా వస్తున్నాయి. ఇండస్ట్రీ టాక్ ప్రకారం, అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ ప్రాజెక్ట్‌లోని ప్రత్యేక గీతం కోసం పూజా హెగ్డేను ఫైనల్ చేసినట్లు సమాచారం. ఈ సాంగ్ కోసం ఆమెకు రూ.5 కోట్లు పారితోషికం ఆఫర్ చేసినట్లు టాలీవుడ్ సర్కిల్స్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.. ఒక ఐటెమ్ సాంగ్‌కి ఇది అరుదైన భారీ రేమ్యునరేషన్. ఇది పూజా మార్కెట్ ఇంకా బలంగానే ఉందని మరోసారి నిరూపిస్తోంది. సినిమా అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియాలో మాత్రం పూజా హాట్ ఫేవరెట్. 2010లో మిస్ ఇండియా పోటీలో రెండోస్థానం సాధించి గ్లామర్ రంగంలోకి అడుగుపెట్టిన పూజా హెగ్డే 2012లో తమిళం 'ముగమూడి' ద్వారా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. 2014లో వరుణ్ తేజ్ సరసన 'ముకుంద' తో టాలీవుడ్‌కి పరిచయం కాగా, ఆ తర్వాత 'ఒక లైలా కోసం', బాలీవుడ్‌లో 'మోహెంజో దారో' వంటి సినిమాలతో ప్రయాణం కొనసాగించింది. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రలకంటే స్పెషల్ సాంగ్‌లపైనే దృష్టి పెడుతుంది. స్పెషల్ సాంగ్‌లతో తన మార్కెట్‌ను తిరిగి పదిలం చేసుకుంటున్న పూజా, త్వరలోనే మళ్లీ స్టార్ హీరోల సరసన హీరోయిన్‌గా కనిపించే అవకాశాలు బలంగా ఉన్నాయని టాక్.



## సమంతకు నిడుమోరు గృహంలోకి ఆహ్వానం

### ఎమోషనల్ పోస్ట్ పంచుకున్న రాజ్ సోదరి శీతల్



అగ్ర కథానాయిక సమంత, దర్శకుడు రాజ్ నిడిమోరు జంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఇక డిసెంబర్ 2న సమంతకు అత్త వారింట్లో గ్రాండ్ వెల్‌కమ్ లభించింది. ఈ మేరకు రాజ్ సోదరి శీతల్ ఈ జంటకు విషెస్ చెబుతూ ఒక ఎమోషనల్ నోట్ పంచుకున్నారు. నిడిమోరు ఫ్యామిలీలోకి సమంతను ఆహ్వానిస్తూ ఎప్పుడూ ఆమెకు అండగా ఉంటానని అన్నారు. ప్రస్తుతం ఈ ఫ్యామిలీ ఫొటోను అభిమానులు షేర్ చేస్తున్నారు. ఆనందంతో మాటలు రావడం లేదు. గొప్ప భక్తుడు ఆర్తితో నిండిన హృదయంతో శివలింగాన్ని ఆలింగనం చేసుకుంటే ఎంత ఆనందంగా ఉంటాడో ఈరోజు నేను అలా ఉన్నాను. ఆనందబాష్పాలతో నా హృదయం ఉప్పొంగుతోంది. నేడు మా కుటుంబం పరిపూర్ణమైంది. సమంత– రాజ్ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకుసాగుతుండడం చూసి మాకెంతో గర్వంగా ఉంది. ఒకరిపై ఒకరికి గౌరవం, నిజాయతీతో రెండు హృదయాలు ఒకే మార్గాన్ని ఎంచుకున్నప్పుడు వారి జీవితం ప్రశాంతతో నిండిపోతుంది. మేము వీరికి ఎప్పుడూ అండగా ఉంటాము' అని రాసుకొచ్చారు. ఈషా ఫౌండేషన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# వర్కింగ్ అవర్స్‌తో సినిమా నడవదు

## ఔట్‌పుట్ రావాలంటే..సమిష్టిగా పనిచేయాల్సిందే

## తాజాగా నటులు రానా, దుల్కర్ సల్మాన్ వ్యాఖ్యలు



బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణెళి ఇటీవల వర్కింగ్ అవర్స్‌పై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. రోజుకు ఎనిమిది గంటల పని చాలు..అతిగా వర్క్ చేయడం ఆరోగ్యానికి మంచిది కాదు అని ఆమె చెప్పిన మాటలు హాట్ టాపిక్ అయ్యాయి. ఈ వ్యాఖ్యల కారణంగా ఆమెను 'స్పిరిట్', 'కల్కి 2' ప్రాజెక్టుల నుంచి తప్పించేశారని వచ్చిన వార్తలు మరింత వివాదాన్ని రేకెత్తించాయి. జీవితం–పని మధ్య బ్యాలెన్స్ చాలా అవసరం అని దీపిక చెప్పిన మాటలకి పలువురు సెలబ్రిటీలు ఆమెకు మద్దతు తెలిపారు. మనసు, శరీరం ఒత్తిడిలో ఉన్నప్పుడు మంచి అవుట్‌పుట్ సాధ్యం కాదని కూడా ఆమె స్పష్టం చేశారు. అయితే ఈ వివాదంపై నటుడు దగ్గుబాటి రానా తాజాగా స్పందించారు. సినిమా ఇండస్ట్రీ సాధారణ ఉద్యోగం కాదు. నటన ఒక లైఫ్‌స్టైల్. ఎనిమిది గంటలు కూర్చొని అద్భుతమైన అవుట్‌పుట్ ఇచ్చే ఫీల్డ్ ఇది కాదని రానా వెల్లడించారు. ఒక మంచి సీన్ రావాలంటే కెమెరా నుంచి లైటింగ్ వరకు, నటీనటులు నుంచి టెక్నీషియన్ల వరకూ అందరూ సమయం పట్టించుకోకుండా అంకితభావంతో పని చేస్తారని ఆయన అన్నారు. ఇక్కడ 8 గంటల రూల్ ప్రాక్టికల్‌గా చాలా కష్టం అని స్పష్టం చేశారు. నటుడు దుల్కర్ సల్మాన్ కూడా ఈ విషయంపై తన అభిప్రాయం వ్యక్తం చేశారు. వివిధ పరిశ్రమలలో వర్క్ మోడల్ ఒక్కో రకంగా ఉంటుంది. తెలుగులో మహానటి చేస్తున్నప్పుడు కొన్నిసార్లు సాయంత్రం ఆరు గంటలకే షూటింగ్ అయిపోయేది. తమిళంలో పరిస్థితి కొంచెం వేరుగా ఉంటుంది. ఆదివారాలు కూడా సెలవు ఇస్తారు. ఒక రోజు అతిగా పనిచేయడం కంటే, రోజూ కొంచెం అదనంగా పనిచేయడం బెస్ట్ అని దుల్కర్ స్పష్టం చేశారు. ఇండస్ట్రీ ధోరణి, ప్రాజెక్ట్ డిమాండ్స్ మీద వర్కింగ్ అవర్స్ ఆధారపడి ఉంటాయి అని ఆయన స్పష్టం చేశారు. మలయాళంలో షూటింగ్ ప్రారంభించిన తర్వాత ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా తెలియదు.. ఇక తమిళంలో ఈ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఒక రోజు అదనపు షూటింగ్ కంటే.. రోజూ కొన్ని గంటలు అదనంగా పనిచేయడం సులువే కదా' అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీపికా పదుకొణెళి వ్యాఖ్యలపై రానా,దుల్కర్ స్పందించడంతో సినీ పరిశ్రమలో వర్కింగ్ అవర్స్‌పై చర్చ మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది.

## అఖండ 3 లోడింగ్ టైటిల్ లీక్ చేసేసిన తమన్....

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) డిసెంబర్ 3 :**

నందమూరి బాలకృష్ణ మరియు బోయపాటి శీను కాంబినేషన్లో అఖండ 2 తాండవంతో డిసెంబర్ 5న పాన్ ఇండియా స్థాయిలో ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రం ఇప్పటికే ట్రైలర్ ,టీజర్ , మ్యూజిక్ ఆకాశమే హద్దు అన్నట్టుగా అంచనాలు పెంచింది. ఈసారి బాలయ్య మరింత రుద్రంగా మరింత ఆధ్యాత్మికంగా కనిపిస్తారు. అఖండ 2 ప్రీ రిలీజ్ బిజినెస్ కూడా రికార్డ్ స్థాయిలో జరగడంతో బాక్సస్ వద్ద ఈ చిత్రం సంచనాలను సృష్టిస్తుందని వాతావరణం ఏర్పడింది. అఖండ 2 ప్రమోషన్ లో భాగంగా నిర్మాతలు అఖండ 3 కూడా రావచ్చు అని పరోక్షంగా ఇంటి ఇచ్చిన విషయం తెలిసిందే.




మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ ఎస్ తమన్ తాజాగా డైరెక్టర్ బోయపాటి చిత్ర యూనిట్తో కలిసి దిగిన ఒక ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు ఆ ఫోటోలు వారి వెనుక ఉన్న డిజిటల్ స్క్రిన్ పై "JAI AKHANDA" నీ పెద్ద అక్షరాల్లో కనిపిస్తుంది. దీంతో అఖండ 3 కన్ఫామ్ అయిపోయింది. జై అఖండ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేశారంటూ బాలయ్య ఫ్యాన్స్ దాని వైరల్ చేస్తున్నారు. ఈ టైటిల్ నిజమా కాదా అనేది మాత్రం చిత్ర బృందం ఇప్పటివరకు వెల్లడించలేదు కానీ అఖండ 2 క్లైమాక్స్ లోనే అఖండ 3 కి హీట్ ఇచ్చి ఉండొచ్చు అని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

## సుడిగాలి సుధీర్ GOAT డైరెక్టర్ పై కేసు... నిర్మాత సీరియస్....

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) డిసెంబర్ 3 :**



డైరెక్టర్ నరేష్ కుప్పిలి దర్శకత్వంలో వాస్తవానికి రెండున్నర ఏళ్ళు క్రితమే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది కానీ ఆ సమయంలోనే ఫస్ట్ లుక్ ఫస్ట్ సింగిల్ లాంచ్ చేశారు కానీ దర్శకుడికి నిర్మాతలతో ఏర్పడిన విభేదాలు కారణంగా షూటింగ్ తాత్కాలికంగా ఆగిపోయింది. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ మొత్తానికి ఈ సినిమా షూటింగ్ పూర్తయింది ప్రస్తుతం సినిమా విడుదలకు సిద్ధమైంది డైరెక్టర్ పేరు లేకుండా ఈ సినిమా రిలీజ్ చేస్తున్నారు . తాజాగా టీజర్ రిలీజ్ చేశారు అయితే ఈవెంట్లో సుడిగాలి సుదీర్ కనిపించకపోవడం సినిమా గురించి ఒక్కటి కూడా ట్విట్ చేయకపోవడంపై నిర్మాత చంద్రశేఖర్ స్పందించారు. సుధీర్ హీరోగా నటించిన ఈ చిత్రానికి ఆయన సపోర్ట్ చేయడం లేదన్న ప్రశ్నల్లో వెలు వేత్తుతున్న తెలిపిన నేపథ్యంలో నిర్మాత చంద్రశేఖర్ వివరణ ఇచ్చారు 'సుధీర్ చాలా రెస్పాన్సిబుల్ వ్యక్తి అందుకే అతడి నీ హీరోగా ఒప్పుకున్నాను కిందిస్థాయిలో నుంచి కష్టపడి ఈ స్థాయికి వచ్చాడు అతడికి ఎప్పుడూ లేనంత పెద్ద బడ్జెట్ ఈ సినిమాకి పెట్టాము ఆయన సినిమాకి న్యాయం చేస్తాడని భావించాము . ఆయన ఫ్యామిలీ, తల్లితండ్రులు చాలా మంచోళ్ళు అందుకే మంచి కుటుంబం నుంచి వచ్చారు అతని న్యాయం చేస్తాడని నేను నమ్ముతున్నాను' అని చెప్పారు. షూటింగ్ సమయంలో కొన్ని సమస్యలు వచ్చిన కారణంగా పని కొంత కాలం నిలిచిపోయిందని ఆయన వివరించారు. డైరెక్టర్ గురించి మాట్లాడుతూ చంద్రశేఖర్ మరింత స్పష్టంగా మాట్లాడారు ఆ డైరెక్టర్ టీం విషయంలో కొంత అసౌకర్యంగా ఫీల్ అయ్యాడు. అతను రెస్పాన్సిబుల్ కాదు ప్రవర్తన చాలా చెత్తగా ఉండేది ఇటీవల దివ్యభారతిని టార్గెట్ చేస్తూ ట్విట్ చేశాడు. అతన్ని సినిమా నుంచి తొలగించిన తర్వాత కొన్ని సీన్లు నెట్ లో లింక్ చేశాడు . సాధారణ డైరెక్టర్ ఎప్పుడు ఇలాంటి పనిచేయదు అని వెల్లడించారు

## కార్తీ...తెలుగులో అన్నగారు వస్తారు

స్టార్ నటుడు కార్తీ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం వా వాతియార్ . తెలుగులో ఈ చిత్రం అన్నగారు వస్తారు అనే పేరుతో విడుదల కాబోతుంది. నలన్ కుమారస్వామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కృతి శెట్టి కథానాయికగా నటిస్తుండగా.. సత్యరాజ్, రాజ్‌కిరణ్, జీఎం సుందర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కెఇ జ్ఞానవేల్ రాజా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి తాజాగా విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. ఈ సినిమాను డిసెంబర్ 12న తమిళంతో పాటు తెలుగులో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమాలో కార్తీ పోలీస్ పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు కార్తీ సర్దార్ 2ని కూడా విడుదలకు సిద్ధం చేస్తున్నాడు.



## తిరుపతి రైల్వే స్టేషన్‌లో విస్తరణ

- భద్రత ప్రమాణాలు పాటించడం లేదన్న మధు



**తిరుపతి, డిసెంబర్3( వెలుతురు):**
తిరుపతి రైల్వే స్టేషన్ ప్రత్యామ్నయం లేకుండా విస్తరణ పనులు చేస్తున్నారని దానివల్ల ప్రయాణికులకు భద్రత సరిగ్గా లేదని సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు అన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా రైల్వే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మధు డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్ ఇరుకుగా ఉండటం వల్ల ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వెంటనే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు కందారపు మురళి, జి బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## 13 మంది కుటుంబ సభ్యులను కాల్చివేత

- హంతకుడికి బహిరంగ మరణం
- బాలుడితో కాల్చి చంపించిన అఫ్గాన్ పోలీసులు



**కాబూల్, డిసెంబర్3( వెలుతురు):**
తాలిబాన్ పాలిత అఫ్ఘానిస్తాన్‌లోని కోస్ట్ ప్రాంతంలో ఒక సంచలన ఘటన చోటుచేసుకుంది. ఒక హంతకుడికి బహిరంగ శిక్ష అమలు చేయడంలో షాకింగ్ పనిచేశారు ఆఫ్ఘాన్ పోలీసులు. ఒకే ఫ్యామిలీకి చెందిన 13 మందిని దారుణంగా హత్య చేసిన నిందితుడు మంగల్‌ను, 13 ఏళ్ల బాలుడు చేత కాల్చి చంపించారు. శిక్షను స్థానిక స్పోర్ట్స్ స్టేడియంలో 80 వేల మంది ప్రజల ముందు అమలు చేశారు. అఫ్ఘాన్ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ 'ఖిసాస్' అంటే ప్రతీకార శిక్ష జరిగింది. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం, మంగల్ 10 నెలల క్రితం అలీ షిర్ టెరెజియో జిల్లాల్లో నివశించే అబ్దుల్ రహ్మాన్.. అతని కుటుంబంలోని 12 మందిని తుపాకీతో కాల్చి చంపాడు. ఈ హత్యలకు అతనికి జీవిత ఖైదు శిక్ష పడింది. శిక్ష అమలు సమయంలో తాలిబాన్ అధికారులు కుటుంబంలో బతికున్న బాలుడు అబ్దుల్ రహ్మాన్ మంగల్‌కు క్షమాభిక్ష పెడతావా అని అడిగారు.. కానీ బాలుడు నిరాకరించడంతో, అతనికి తుపాకీ ఇచ్చి మంగల్‌పై మూడు రౌండ్ల కాల్పులు జరిపించారు. ఈ సందర్భంగా స్టేడియం భిడ్డు 'అల్లాహు అక్బర్' నినాదాలతో దద్దరిల్లింది. కోస్ట్ పోలీస్ ప్రతినిధి ఈ ఘటనను ధృవీకరించారు. తాలిబాన్ పాలితంలో షరియా చట్టం కింద ఇలాంటి బహిరంగ శిక్షలు పెరుగుతున్నాయి. అయితే, అంతర్జాతీయ సమాజం ఈ శిక్షను 'అమానవీయమైనది, అత్యంత క్రూరమైనది' అని ఖండిస్తోంది.

## పల్నాడు జిల్లాలో స్క్రబ్ టైఫస్ కలకలం

- ఇప్పటికే ఇద్దరు మృతి చెందగా..కొందరికి లక్షణాలు




**పల్నాడు, డిసెంబర్3( వెలుతురు):**
పల్నాడు జిల్లాలో స్క్రబ్ టైఫస్ కలకలం సృష్టిస్తుంది. ఈ లక్షణాలతో ఇద్దరు మహిళలు మృతి చెందారు. అలానే మరొకరు చికిత్స పొందుతున్నారు. ముప్పాళ్ల మండలం రుద్రవరం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని జ్యోతి జ్వరం, ఒంటినొప్పులతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 20 రోజుల క్రితం మరణించింది. రాజుపాలెంకు చెందిన వృద్ధురాలు నాగమ్మ కూడా జ్వరంతో చికిత్స పొందుతూ 20 రోజుల క్రితం మృతి చెందింది. అలానే రాజుపాలెం మండలం కొత్తూరుకు చెందిన మరో వృద్ధురాలు సాలమ్మ కూడా స్క్రబ్ టైఫస్ లక్షణాలతో ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చనిపోయిన జ్యోతి, నాగమ్మల శాంపిల్స్ ను టెస్టుల కోసం ముంబై పంపించారు. పరీక్షల్లో స్క్రబ్ టైఫస్‌తో మృతిచెందినట్లు రిపోర్టుల్లో తేలినట్లు ప్రచారం జరుగుతుంది. దీని గురించి స్పష్టత రావాల్సి ఉంది. స్క్రబ్ టైఫస్ వ్యాధి గురించి వైద్యులు పలు వివరాలు తెలిపారు. నల్లిని పోలిన చిన్న కీటకం స్క్రబ్ టైఫస్. గత కొన్నేళ్లుగా జిల్లాలో తన ఉనికిని చాటుకుంటూనే ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దీని బారినపడి ఇబ్బంది పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. స్క్రబ్ టైఫస్ కాటుతో సోకే బ్యాక్టీరియా ప్రభావాన్ని గుర్తించేందుకు గుంటూరు సమగ్రాసుపత్రిలో ప్రయోగశాల ఉందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి తెలిపారు. అనుమానిత లక్షణాలున్న వారి రక్త నమునాలు పంపితే నిర్ధారణ పరీక్షలు చేస్తామని వైద్యులు తెలిపారు. పాజిటివ్‌గా గుర్తిస్తే చికిత్స అందిస్తారని వైద్యాధికారి డాక్టర్ రవి తెలిపారు. ఇది మనుషుల నుంచి మనుషులకు వ్యాపించదని వివరించారు. తగిన జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

## ఎనిమిదేళ్ల పాపపై అత్యాచార యత్నం

**వరంగల్, డిసెంబర్3( వెలుతురు):**
వరంగల్ జిల్లా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ యువకుడు ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతంలో వేల్పుల కమల్ అనే యువకుడు కిరాణా షాప్ నిర్వహిస్తుంటాడు. ఈ నెల రెండవ తేదీ రాత్రి కిరాణా దుకాణంలో సరుకులు కొనేందుకు వెళ్లిన 8 ఏళ్ల బాలికను లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో దుకాణానికి వేరే వారు రావడంతో పాప బయటికి పరిగెత్తుకుంటూ వెళ్లి వచ్చి విషయం తల్లిదండ్రులకు తెలిపింది. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## 12 ఏండ్ల జర్నలిస్టుల గోసే మహా ధర్నాకు కారణం...

# మహా ధర్నా ఘనవిజయం

**హైదరాబాద్, డిసెంబర్ 03 (వెలుతురు):**
తెలంగాణలో చిన్న, మధ్య తరగతి పత్రికలపై గత 12 ఏండ్లుగా కొనసాగుతున్న వివక్షకు బుధవారం రోజున నిర్వహించిన మహా ధర్నా ఘనవిజయాన్ని అందుకుంది. పలు రాష్ట్రాలు జర్నలిస్టులకు అనేక సదుపాయాలు కల్పిస్తుండగా, తెలంగాణలో మాత్రం మౌలిక హక్కులు కూడా అందకపోవడం దురదృష్టకరమని చిన్న పత్రికల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు.

### ప్రకటనలు - బిల్లులు - సదుపాయాలు.. ప్రతిదాంట్లో అన్యాయం

చిన్న, మధ్య తరహా పత్రికలు రెండు ప్రభుత్వాల కాలంలోనూ అన్యాయానికే గురయ్యాయని అశోక్ పేర్కొన్నారు. "పత్రికల ప్రకటనల కోసం సంవత్సరాంతం నాయకులను కోరాల్సిన పరిస్థితి. అడ్వర్టైజ్‌మెంట్ బిల్లులు వచ్చేది లేదు. ప్రభుత్వం హామీలతోనే సరిపెడుతోంది. చిన్న పత్రికలపై చిన్న చూపు చూపడం తప్పు," అని ఆయన అన్నారు.

### జర్నలిస్టులు అడిగేది వజ్రాలు కాదు - బ్రతకడానికి కావాల్సిన హక్కులే

జర్నలిస్టుల బాధలు అర్థం చేసుకునే పరిస్థితి ప్రభుత్వానికే లేదని ఆయన విమర్శించారు. "అడిగేది బంగారం, పదవులు కాదు అనారోగ్యానికి ఒక హెల్త్ కార్డు, కుటుంబం ఉండేందుకు ఒక ఇల్లు మాత్రమే. అన్ని ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యే ఆరోగ్య కార్డు జర్నలిస్టులను అప్పుల పాలయ్యే దశ నుంచి కాపాడుతుంది," అని అశోక్ చెప్పారు.

### ప్రభుత్వాలే మీడియాపై ఆధారపడుతూ జర్నలిస్టులకు భరోసా లేదంటే ఎలా?

"మొత్తం పాలన మీడియా మీదే నడుస్తుంది. జర్నలిస్టులు ఒక్కరోజు పని ఆపితే ప్రభుత్వ పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలి. ఉద్యమ తెలంగాణలో జర్నలిస్టులు చేసిన త్యాగాలకు నేటికీ గుర్తింపు లేదు," అని ఆయన విమర్శించారు.

### అక్రిడిటేషన్ కార్డులపై స్పష్టత లేకుండా రెండేళ్లు

అక్రిడిటేషన్ కార్డుల విషయంలో స్పష్టమైన పాలసీ తీసుకురాకపోవడం పత్రికలపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

### రాష్ట్ర చరిత్రలో తొలి మహా ధర్నా - వెంటనే చర్యలు తీసుకోవాలి

బుధవారం రోజున నిర్వహించిన మహా ధర్నా రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి జర్నలిస్టులు ఇంత పెద్ద సంఖ్యలో కూడిన చారిత్రక సంఘటనగా అశోక్ పేర్కొన్నారు. చిన్న పత్రికలు – జర్నలిస్టులు బ్రతికేలా ప్రభుత్వం వెంటనే నిర్ణయాలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వెలుతురు
VELTHURU
వెలుతురు TV
NEWS



విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో
తెలంగాణ నుండి వెలబడుతూ
అతి తక్కువ కాలంలోనే ప్రజాదరణ పొందిన
ఏకైక పత్రిక వెలుతురు దినపత్రిక
మరియు వెలుతురు టీవీ.
తెలంగాణ రాష్ట్రంలో ఆసక్తిగల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతోంది అనుభవజ్ఞాలకు ప్రాధాన్యం అలాగే నూతన అభ్యర్థులకు అవకాశం కల్పించబడును.
1. జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్
2. ఆర్.సీ ఇన్చార్జులు
3. మండల రిపోర్టర్స్
4. క్రైమ్ రిపోర్టర్స్
దయచేసి టైం పాస్ కోసం ఫోన్ చేయవద్దు.
ఇది ఉద్యోగం కాదు,
ఎలాంటి జీత బత్యాలు ఇవ్వబడవు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్:
8639840328

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com